23-10Pg1exHMNWJQEKV 1 VJA_23-10Pg1exHMNWJQEKV.qxd 10/23/2025 12:03 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విజయవాడ
fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 261 పేజీలు: 12 వెల: 6.50

సెర్బియా పార్లమెంటుపై **ఉగ్రదాడి** 9లో

**వైట్‌హౌస్ భద్రత గేటును ఢీకొట్టిన కారు**

# అమరావతిలో ప్రపంచస్థాయి లైబ్రరీ


బుధవారం దుబాయ్‌లోని ప్రముఖ రియాల్టి సంస్థ శోభా గ్రూప్ ఫౌండర్ చైర్మన్ పిఎన్సీ మీనన్‌తో సిఎం సమావేశ దృశ్యం

## రూ. 100 కోట్లతో నిర్మాణానికి ముందుకొచ్చిన దుబాయ్ సంస్థ శోభా గ్రూప్

### టౌన్‌షిప్‌లు, లగ్జరీ హోటళ్లు నిర్మించాలని సంస్థ చైర్మన్ రవి మీనన్‌ను కోరిన సిఎం చంద్రబాబు

### గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రం చిరునామా

### దుబాయ్‌లోని పారిశ్రామికవేత్తలతో సిఎం చర్చలు

**విజయవాడ అక్టోబరు 22, ప్రభాతవార్తప్రతినిధి:** దుబాయ్‌లోని ప్రముఖసంస్థ శోభా రియాల్టి అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంధాలయం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. రూ.100 కోట్ల విరాళంతో వరల్డ్ క్లాస్ లైబ్రరీని నిర్మించనుంది. ఎపిలో పెట్టుబడి అవకాశాలు వివరించేందుకు దుబాయ్ పర్యటనకు వెళ్లిన సిఎం చంద్రబాబుతో ఆ దేశంలోని శోభా రియాల్టి చైర్మన్ రవి మీనన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో లైబ్రరీ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రితో చర్చించారు. శోభా రియాల్టి సంస్థ అమరావతిలో ప్రపంచ స్థాయి స్టేట్ లైబ్రరీ నిర్మించేందుకు ముందుకు రావటంపై సిఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయం నిర్మాణానికి ఇంత పెద్ద మొత్తంలో విరాళం ప్రకటించటంపై ధన్యవాదాలు తెలియచేశారు. అమరావతిని ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా నిర్మిస్తున్నామని సిఎం ఆయనకు వివరించారు. రాజధాని నిర్మాణంలో శోభా రియాల్టీ సంస్థకూడా భాగస్వామి కావాలని ఆహ్వానించారు. ఎపికి వచ్చి రాజధాని నిర్మాణాన్ని పరిశీలించాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయిలో నగరాలు నిర్మితం అవుతున్నాయని వాటితో సమానంగా మౌలిక సదుపాయాలతో అమరావతిని నిర్మిస్తున్నట్టు సిఎం వివరించారు. గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రాన్ని చిరునామాగా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు శోభా గ్రూప్ ప్రతినిధులకు చంద్రబాబు వివరించారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, విశాఖలో గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటు అవుతోందని చంద్రబాబు చెప్పారు. ఇక తిరుపతి, విశాఖ వంటి నగరాల్లో రానున్న రోజుల్లో అనేక మార్పులు రానున్నాయని... మౌలిక సదుపాయాలపై భారీగా ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు.

**పోర్టులున్నాయి... కారిడార్లు వస్తున్నాయి..**

రాష్ట్రంలో రియాల్టి రంగంలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ క్రమంలో అమరావతి, విశాఖ, తిరుపతి వంటి ప్రాంతాల్లోకూడా బిజినెస్ ఐటీ పార్కులు, మాల్స్, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లతో పాటు ఉన్నతశ్రేణి వర్గాలకు హౌసింగ్ ప్రాజెక్టులను చేపట్టేందుకు అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నిర్మితం అవుతున్న పారిశ్రామిక కారిడార్లు, పోర్టులకు >>2


నెల్లూరు జిల్లా జలదంకిలో పొంగిపొర్లుతున్న వాగులు

# మరో 3 రోజులు భారీ వర్షాలు

### విపత్తు నివారణ సంస్థ అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత

### వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం

### పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్సీ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

### పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లోపు వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అతిభారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణసంస్థ అధికారులతో హోంమంత్రి అనిత బుధవారం సమీక్ష >>2

**తిరుపతి జిల్లాలో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం** 2లో

# ఉపాధి హామీ పథకానికి మొదటి విడతగా రూ. 665 కోట్లు

## నిధులు విడుదల చేసిన కేంద్రం

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా రూ.665 కోట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ విడుదల చేసింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.166 కోట్లు జత చేసింది. మొత్తంగా రూ.831 కోట్ల నిధులతో ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి ఉన్న పెండింగ్ బిల్లులు క్లియర్ చేసే వెసులుబాటు కలుగుతుంది. రాష్ట్రంలో పంచాయతీ భవనాల నిర్మాణం, రికార్డులు కంప్యూటరీకరణ, సిబ్బంది, ప్రజా ప్రతినిధులకి శిక్షణ, ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జిఎస్ఎ) ద్వారా రూ.50 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు జత చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికీ, గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలియచేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి లలన్ సింగ్ ప్రత్యేక కృతజ్ఞతలు. కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ అందించేందుకు తగిన ఆదేశాలు ఇస్తున్న గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రసూతి మరణాలకు అడ్డుకట్ట వేయాలి

### పిఠాపురానికి చెందిన శ్రీదుర్గ ప్రసూతి మరణంపై తక్షణం నివేదిక ఇవ్వండి

### కాకినాడ కలెక్టర్, పడా ప్రాజెక్టు డైరెక్టర్‌తో డి సిఎం పవన్



**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్న తరుణంలో ప్రసూతి సమయంలో అందించే సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు ఇందుకు సంబంధించిన సేవలపై అనుభవజ్ఞులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం రాజధానిలోని క్యాంపు కార్యాలయం నుంచి కాకినాడ జిల్లా కలెక్టర్, పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఇటీవల పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలుకి చెందిన దొండపాటి శ్రీదుర్గ పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డను ప్రసవించిన అనంతరం అపస్మారక స్థితికి చేరుకోవడం, కాకినాడ ఆసుపత్రికి తరలించగా మృతి చెందిన ఘటనపై సమీక్ష నిర్వహించారు. ప్రసూతి సమయంలో వైద్య సేవల విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యంగా ఉండకూడదని, అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. గర్భిణులకు వైద్యం >>2


బుధవారం ఇరుముడిని శిరసున ఉంచి శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించిన రాష్ట్రపతి ముర్ము

## రాష్ట్రపతి అయ్యప్ప దర్శనం

**తిరువనంతపురం, అక్టోబరు 22:** కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప స్వామివారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం పంబనుంచి ఇరుముడితో ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి.. అధి >>2

# హైస్కూలు నుంచే ఎఐ


స్పోర్ట్స్ హబ్‌ల గురించి నారా లోకేష్‌కు వివరిస్తున్న ఎఐవైఎఫ్ పాపులస్ ఆసియా పసిఫిక్ బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు

### స్కూళ్లలో ఎఐ, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్‌ల ఏర్పాటు

### బ్రిస్‌బేన్ విద్యారంగ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యారంగ సంస్కరణల్లో ఆంధ్రప్రదేశ్ భారత్‌లో ముందువరుసలో ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారాలోకేష్ అన్నారు. విద్యారంగంపై క్వీన్స్ ల్యాండ్ ట్రేడ్ ఇన్వెస్టిమెంట్ సెంటర్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో హైస్కూలు స్థాయి నుంచే ఎఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నామని, ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్‌లు, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎఐ విప్లవం ద్వారా వచ్చే అవకాశాలను ఎపిలోని యువత అందుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఎపిలో ఎఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. గవర్నెన్స్‌లో ఎఐ వినియోగం ద్వారా అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఎఐ ద్వారా విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. పబ్లిక్ పాలసీ, సస్టెనబిలిటీ, ఇన్నోవేషన్ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల కోసం ఆంధ్రప్రదేశ్‌గ్రిఫిత్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. 'పరిశోధన, విద్యార్థుల మార్పిడి, అవగాహన కార్యక్రమాలను సమన్వయం చేసేలా గ్రిఫిత్ యూనివర్సిటీ ఇండియా సెంటర్ లేదా హబ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయండి. సిలబస్ రూపకల్పన, నైపుణ్య ధృవీకరణ, గ్లోబల్ అకడమిక్ ప్రమాణాల కోసం ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలు, ఎపిఎస్ఎస్‌డిసి (ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్)తో భాగస్వామ్యం వహించండి. పునరుత్పాదక శక్తి, వాతావరణ స్థితిస్థాపకత, ప్రజారోగ్యం, నీటి నిర్వహణ రంగాల్లో సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు ప్రారంభించండి. గ్రిఫిత్ యూనవర్సిటీ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ విద్యాసంస్థల మధ్య డ్యూయల్‌డిగ్రీ లేదా ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేయండి. ఈ ఏడాది >>2

## అద్దేపల్లి, జగన్మోహన్ ఎక్సైజు పోలీసు కస్టడీకి

### -నకిలీ మద్యం కేసు

**విజయవాడ, అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో హాట్ టాపిక్‌గా మారిన నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అద్దేపల్లి జనార్దన్, జగన్ మోహన్‌ను ఎక్సైజ్ పోలీసుల కస్టడీకి ఇస్తూ ఎన్టీఆర్ జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అక్టోబరు 24 నుంచి అక్టోబరు 30 వరకు ఏడు రోజులపాటు నిందితులను పోలీస్ కస్టడీకి ఇస్తూ జిల్లా కోర్టు ఆదేశించింది.

ఈ కేసులో ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌ను ఈనెల 24న అదుపులోకి తీసుకుని 30న తిరిగి జైలు అధికారులకు అప్పగించనున్నారు. కాగా, ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైల్లో అద్దేపల్లి జనార్దన్ ఉన్నాడు. అలాగే విజయవాడ జైల్లో ఉన్న ఏ2 జగన్ మోహన్‌ను కూడా పోలీసులు విచారించనున్నారు. అతడినీ ఈనెల 24 నుంచి 30 వరకు ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు.

# అరమార్కు సడలింపు!

### ఇంటర్ ప్రాక్టికల్స్ ఉన్న సైన్స్ సబ్జెక్టుల రాత పరీక్షలకు సర్దుబాటు

**విజయవాడ, అక్టోబరు 22, ప్రభాతవార్తప్రతినిధి :** ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రాక్టికల్స్ ఉన్న సైన్స్ సబ్జెక్టుల రాత పరీక్షల్లో అర మార్కు సడలింపు ఇచ్చింది. 2 సంవత్సరాల్లో కలిపి రాత పరీక్షలో అర మార్కు తక్కువ వచ్చినా, విద్యార్థులను ఉత్తీర్ణులుగానే పరిగణించనున్నట్లు ప్రకటించింది. ఈ అర మార్కును సెకండ్ ఇయర్‌లో నిర్వహించే ప్రాక్టికల్స్‌లో సర్దుబాటు చేశారు. ఇంటర్మీడియట్‌లో ఈ విద్యా సంవత్సరం ఎన్‌సిఇఆర్టీ సిలబస్‌ను అమలు చేయడంతో పాటు పరీక్షల్లోనూ అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. దీనికి సంబంధించిన వివరాలను బోర్డు విడుదల చేసింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టులకు సంబంధించి ఫస్ట్ ఇయర్‌లో 85 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఎగ్జామ్స్‌లో పాస్ అవ్వాలంటే 35 మార్కుల లెక్కన 29.75 మార్కులు రావాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ఫస్ట్ ఇయర్‌లో 29 మార్కులకు తగ్గించారు. సెకండ్ ఇయర్‌లో 85 మార్కులకు 30 మార్కులు తెచ్చుకోవాలనే నిబంధన పెట్టారు. 2 సంవత్సరాలు కలిపి 35 మార్కుల కింద 59.50 మార్కులు సాధించాల్సి ఉండగా, 59 మార్కులకే ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఆ అర మార్కును సర్దుబాటు చేసి, సెకండ్ ఇయర్‌లో ప్రాక్టికల్స్ 30 మార్కులకు, ఉత్తీర్ణత సాధించేందుకు 10.5 నుంచి 11 మార్కులకు పెంచారు.ఫస్ట్ ఇయర్‌లో కొన్ని సబ్జెక్టుల్లో 30 మార్కులు వచ్చినా ఉత్తీర్ణులే. అయితే, మొత్తం మీద 35 రావాల్సి ఉంటుంది. ఏదైనా ఒక సబ్జెక్టులో అత్యధిక మార్కులు వచ్చి, మిగతా వాటిలో 30 చొప్పున మార్కులు వచ్చినా ఉత్తీర్ణులైనట్లే పరిగణిస్తారు.ఇప్పటికే రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 24వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయని ఇంటర్ బోర్డు వెల్లడించింది. ఫిబ్రవరి 23 నుంచి ఫస్ట్‌ఇయర్, ఫిబ్రవరి 24నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొంది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. ఇది తాత్కాలిక షెడ్యూల్‌మాత్రమే అని పరిస్థితినిబట్టి ఇందులో మార్పుచేసేఅవకాశం ఉంటుందని పేర్కొంది.

## టీచర్లకూ 'టెట్'

### రెండు రోజుల్లో నోటిఫికేషన్

**విజయవాడ,అక్టోబరు 22,పభాతవార్త ప్రతినిధి:** సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసేందుకు ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లకూ అవకాశం కల్పించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 2011కు ముందు టెట్ లేకుండా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన టీచర్లకూ టెట్ రాసుకునే అవకాశం కల్పిస్తున్నారు. రెండు రోజుల్లో టెట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ పాస్ కావాలని సుప్రీంకోర్టు సెప్టెంబరు 1న తీర్పు వెలువరించింది. అప్పటి నుంచి రెండేళ్లలో ఉత్తీర్ణులు కావాలని స్పష్టం చేసింది. ఐదేళ్లలో పదవీ విరమణ చేయబోయే వారికి అవసరంలేదని, అయితే వారుపదోన్నతి పొందాలంటే టెట్ పాసవ్వాలని సూచించింది. సుప్రీం కోర్టు తీర్పుపై ఇపపటికే కొన్ని సంఘాలు రివ్యూ పిటీషన్లు వేశాయి. ఈ తీర్పుకోసం వేచి ఉండే వారికే వెసులుబాటు కల్పిస్తారు.ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ షెడ్యూలును విడుదల చేయనుంది. ఈసారి అర్హత తగ్గింపు >>2

# రూ.10,319 కోట్లతో అమృత్ 2.0 పనులు

### సవరించిన అంచనాలకు ప్రభుత్వం ఆమోదం

### రామ్ మోడల్‌లో 281 పనుల పూర్తికి అనుమతి

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణ స్థానికసంస్థల్లో తాగునీటిసరఫరా, మురుగునీటి శుద్ధి,ఇతరత్రా 281 ప్రాజెక్టుల పనులు అమృత్ 2.0లోచేపట్టేందుకు రూ.10,319 కోట్లతో సవరించిన అంచనాలను ప్రభుత్వం ఆమోదించింది. కన్సెషనల్ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (చామ్)లో పనులు పూర్తి చేసేందుకు అనుమతించింది. ఈ మేరకు పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్సీ హయాంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు సరిగా కేటాయించని కారణంగా నిలిచిపోయిన అమృత్ 2.0 పనులు ఇప్పుడు ఛామ్ మోడల్‌లో పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.అంచనా వ్యయంలో 60% మొత్తాన్ని గుత్తేదారు సంస్థలు సమకూర్చనున్నాయి. వీటిని వడ్డీతో పదేళ్లలో 40 వాయిదాల కింద రాష్ట్రప్రభుత్వం తిరిగి చెల్లించనుంది. మిగతా 40% నిధులు పట్టణ స్థానిక సంస్థల వాటాతో పాటు 15,16వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి ఖర్చు చేయనున్నారు.

ప్రతి బిల్లులో నుంచి 7.5% మొత్తాలు తగ్గించి గుత్తేదారులకు చెల్లించేవిధానానికి చామ్ మోడల్‌లో మినహాయించారు. ఈ మొత్తాలు పనులు పూర్తయ్యాక తిరిగి గుత్తేదారులకు చెల్లిస్తుంటారు. జాతీయ రహదారుల అథారిటీ పనుల్లో ఇలాంటి మినహాయింపు ఇచ్చినందున...అదే మోడల్‌ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్ట్ అంచనా వ్యయంలో 60% మొత్తాలు గుత్తేదారులే పెట్టుబడిగా పెడుతున్నందున బిల్లుల్లో ప్రతిసారీ 7.5% కోత పెట్టాలన్న నిర్ణయం పైనా గుత్తేదారు సంస్థలు అభ్యంతరం తెలిపాయి. 2025-26 ఎస్ఎస్ఆర్ రేట్ల >>2

23-10pg2exHMNWJQE 2_23-10pg2exHMNWJQE.qxd 10/22/2025 11:58 PM Page 1






బుధవారం దుబాయ్‌లోని షరాఫ్ గ్రూప్ సంస్థతో సిఎం చంద్రబాబు భేటీ దృశ్యం

# షరాఫ్ గ్రూప్‌తో సిఎం చంద్రబాబు చర్చలు

**విజయవాడ అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** షరాఫ్ గ్రూప్ వైస్ ఛైర్మన్, షరాఫ్ డీజీ సంస్థ వ్యస్థాపకుడు షరాఫుద్దీన్ షరాఫ్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలపై షరాఫ్‌తో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మౌలిక వసతులు, మావన వనరుల లభ్యత, అలాగే ఇతర అనుకూలతల గురించి వివరించారు. బుధవారం యుఎఇలో తొలిరోజు పర్యటనలో భాగంగా షరాఫ్ గ్రూప్ వైస్ ఛైర్మన్‌తో సమావేశమైన సిఎం.. ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్ ప్రాజెక్టుల ఏర్పాటు గురించి ప్రధానంగా చర్చించారు. షరాఫ్ గ్రూప్ ఇప్పటికే భారతదేశం లోని పలు రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఎపి చేపట్టిన పారిశ్రామిక కారిడార్లలో ఆధునిక లాజిస్టిక్స్ పార్కులు, గిడ్డంగులు స్థాపించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. దీనికి ఆసక్తి చూపిన షరాఫ్ గ్రూప్ తమ అనుబంధ సంస్థ అయిన హింద్ టెర్మినల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, గిడ్డంగి సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరిచింది. ఇందుకోసం రైల్వే, పోర్ట్ అనుసంధానం కలిగిన ప్రాంతాన్ని గుర్తించాలని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**అవసరమైతే పాలసీల్లో మార్పులు చేస్తాం..**

మా రాష్ట్రంలో పోర్టులు, నేషనల్ హైవేలు విస్తారంగా ఉన్నాయి. కార్గో రవాణాకు రాష్ట్రం అనుకూలం. మేం ఇప్పుడు కొత్త పాలసీలు తెచ్చాం. రాష్ట్రానికి మేలు జరుగుతుందనుకుంటే పాలసీల్లో మార్పులు తేవడానికి సిద్ధం. లాజిస్టిక్స్‌పై 14 శాతం ఖర్చుపెడుతున్నాం. దీన్ని 8 నుంచి 9 శాతానికి తగ్గించాలని చూస్తున్నాం. ఇందుకోసం పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే, రహదారి ప్రాజెక్టులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. లాజిస్టిక్ వ్యయం తగ్గించడానికి సహకరించండి. రాయలసీమలో ఆటోమొబైల్ పరిశ్రమలువస్తున్నాయి. నవంబరు 14,15 తేదీల్లో విశాఖలోజరిగే పెట్టుబడిదారుల సదస్సుకు హాజరు కండి అని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి అన్నారు. దీనికి స్పందించిన ఆ సంస్థ ప్రతినిధులు భారత్‌లో పెట్టుబడులకు ఆసక్తిగాఉన్నామని, ఎపికి తప్పనిసరిగా వస్తామని చెప్పారు.

# ప్రపంచస్థాయి లైబ్రరీ

>> అనుసంధానంగా ఇండస్ట్రియల్ టౌన్ షిప్, హౌసింగ్ ప్రాజెక్టులకు అవకాశం ఉందని శోభా రియాల్టీ ఛైర్మన్ రవి పిఎన్సీ మీనన్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా శోభా గ్రూప్ సంస్థ చేస్తున్న ఛారిటీని సిఎం అభినందించారు. తమ ఆదాయంలో 50 శాతాన్ని ఛారిటీగా ఖర్చు పెట్టడాన్ని ప్రస్తావిస్తూ తాము ఎపిలో పి4 విధానాన్ని అవలంభిస్తూ అమలు చేస్తున్న జీరో పావర్టీ మిషన్ అంశాలను వివరించారు. తమ సంస్థ దుబాయ్‌తో పాటు ఒమన్, బహ్రెయిన్, ఖతార్, బ్రూనై దేశాల్లో ప్రాజెక్టులు నిర్వహిస్తోందని శోభా గ్రూప్ ఛైర్మన్ రవి మీనన్ ముఖ్యమంత్రికి వివరించారు. భారత్‌లోని 14 రాష్ట్రాల్లోని 27 నగరాల్లో శోభా రియాల్టీ ప్రాజెక్టులు చేస్తోందని.. ప్రత్యేకించి బెంగుళూరు, గుర్గావ్, చెన్నై, కేరళలోని హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టామని సిఎంకు తెలిపారు. వచ్చే నెల 14, 15వ తేదీల్లో విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తున్నామని...ఆ సదస్సుకు రావాలని సిఎం చంద్రబాబు ఆహ్వానించారు.

# ప్రసూతి మరణాలకు అడ్డుకట్ట వేయాలి

>> నుంచి ప్రసవం వరకూ, అనంతర వైద్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సక్రమంగా అందాలని చెప్పారు. పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలి విధి నిర్వహణ తీరు, ఇతర సిబ్బంది వ్యవహారంపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పిఠాపురం ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, నియోజకవర్గంలో వైద్యం అందించే విధానం అందరికీ ఒక మోడల్‌గా నిలవాలని.. ఆ దిశగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కాకినాడ జిల్లాలో మెటర్నల్ డెత్ ఆడిట్ నిర్వహణ గురించి ఆరా తీశారు. ప్రసూతి మరణాలు సీరియస్‌గా తీసుకోవలసిన అంశమనీ, ఇలాంటి మరణాలు సంభవించినప్పుడు తక్షణమే నిపుణులైన వైద్యుల బృందంతో సమగ్రంగా విచారణ చేసి కారణాలను నమోదు చేయాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. శ్రీదుర్గ ప్రసూతి మరణంపై, పుట్టిన బిడ్డ ఆరోగ్య స్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలోని కొన్ని ఆసుపత్రులపై వైద్యులు, ఇతర సిబ్బంది తమ విశ్వాసాల ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించి ప్రభుత్వ ఆసుపత్రులను వ్యక్తిగత విశ్వాసాల ప్రచారానికి వేదికలుగా చేయకూడదన్నారు.

# అమృత్ 2.0 పనులు

>> ప్రకారం టెండర్లు పిలిచేందుకు పురపాలక శాఖ ప్రజారోగ్య ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.ఏపీ పట్టణాభివృద్ధి చరిత్రలో అతి పెద్ద పెట్టుబడి ప్రాజెక్టుగా రికార్డ్,పట్టణాల్లో మెరుగైన త్రాగునీరు,డ్రైనేజీ సుపాయంరూ.10,319.93 కోట్లతో 281 పనులకు పరిపాలనా ఆమోదం తెలుపుతూ మున్సిపల్ శాఖ ఆమోదం ఎపియుఎఫ్ఐడిసి,పబ్లిక్‌హెల్త్,గ్రీన్ బిల్డింగ్స్ కార్పొరేషన్‌లకు భాధ్యతలుమొత్తం ప్రాజెక్ట్ ఖర్చులో కేంద్రం నుంచి రూ.4,470 కోట్లు,రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2,490 కోట్లు,ఫైనాన్స్ కమీషనర్ నిధులు రూ.925 కోట్లు,పట్టణాల వాటా రూ.590 కోట్లుమొత్తం ప్రాజెక్ట కాంప్లెక్స్ రూ.6,477 కోట్లు,పదేళ్ళ నిర్వహణ ఖర్చు రూ.1499 కోట్లు,వడ్డీ ఖర్చు రూ.2,344 కోట్లు కేటాయించారు.



బుధవారం అమిత్‌షా పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్న గుజరాత్ మంత్రి హర్ష్ సంఘ్వి

# ఎన్ఐఎ కస్టడీకి ఉగ్రవాది అబూబకర్ భార్య సైరా బాను

## కడప సెంట్రల్ జైలు నుంచి విజయవాడకు తరలింపు

**రాజంపేట,అక్టోబర్ 22 ప్రభాతవార్త:** దేశంలోనే సంచలనం సృష్టించిన తమిళనాడు బాంబు పేలుళ్ల లో కేసులో ఎన్ఐఎ బృందం అదుపులోకి తీసుకున్న ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధికి భార్య సైరా బానును పిటి వారినితో బుధవారం విజయవాడకు తరలించారు. కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదుగా ఉన్న సైరాబానును వారం రోజులుపాటు విచారణకోసం ఎన్ఐఎ అధికారులు తీసుకెళ్లారు. జూలై 1న రాయచోటిలో నివాసం ఉంటున్న ఉగ్రవాదులు అబూబకర్, మహమ్మద్ లను తమిళనాడు ఐబి అధికారులు అరెస్ట్ చేసి చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత విచారణలో పలు విషయాలు వెల్లడి కావడంతో ఎన్ఐఎ అధికారులు పిటి వారెంట్‌తో కడప సెంట్రల్ జైలు నుంచి విజయవాడకు తరలించారు. సైరా భానును విచారిస్తే ఇంకా ఎలాంటి సంచలన విషయాలు బయటపెడతాయో చూడాల్సి ఉంది.

# పాఠశాల బాలికపై వృద్ధుని అత్యాచారం

## నిందితునిపై కేసు నమోదు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 22( ప్రభాతవార్త ):** తుని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గురుకుల (బాలికలు) పాఠశాలలో ఎనిమిదవతరగతి చదువుతున్న విద్యార్థినికి తాతవరసయ్యే 62 ఏళ్ల వ్యక్తి మాయ మాటలు చెప్పి పాఠశాల నుండి బయటకు తీసుకెళ్లారు. ఆ వ్యక్తి పట్టణ శివారులో అత్యాచారం చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలపై పెద్దాపురం డిఎస్పీ డి. శ్రీహరి రాజు సంఘటనా స్థలానికి విచ్చేసి విచారణ చేపట్టారు. ఈ కేసు దర్యాప్తు వేగవంతం చేస్తామని, అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి తాటిక నారాయణరావుపై కిడ్నాప్, లైంగికం, అత్యాచారం, సెక్షన్ 5,6 వంటి పలు సెక్షన్లతో కేసు నమోదు చేశామని డిఎస్పీ తెలిపారు. ఇది హేయమైన నేరం. అవమానవీయ కోణంలో దర్యాప్తు చేయాలి. కాబట్టి ప్రతి ఒక్కరు సహకరించాలి. సోషల్ మీడియాలో పార్టీల పేరుతో ప్రసారం చేయరాదు. బాధితురాలు ఫోటోలు ప్రసారం చేయవద్దని ఆయనపేర్కొన్నారు. ఈ కేసును త్వరితగతిన విచారణ చేసి ప్రత్యేక జ్యుడీషియల్‌కు నివేదిస్తామన్నారు. ఈ సంఘటనపై గురుకుల పాఠశాల ఎదుట బాలిక బంధువులు ఆందోళన చేశారు. ఎవరి అనుమతితో నాలుగుసార్లు పాపను బయటకు పంపించారని, ఆ విషయాలను వెల్లడించాలని ప్రిన్సిపాల్ని నిలదీశారు. రాష్ట్రంలో ఆడపిల్లలకి రక్షణ ఉందా? లేదా? అని మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మిశివ కుమారి పాత్రికేయ సమావేశంలో హోమంత్రి అనితను ప్రశ్నించారు. హోం మంత్రి అనిత మహిళ, తుని ఎమ్మెల్యే మహిళ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మహిళా వరుసగా ఉన్న మూడు నియోజకవర్గాలలో మహిళా శాసనసభ్యులు ఉన్నప్పటికీ మైనర్ బాలికపై అత్యాచారం జరగటం రాష్ట్రానికి సిగ్గుచేటు అన్నారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ప్రశ్నించిన అనిత గొంతు అధికారంలోకి వచ్చిన తర్వాత నోరు మెదపకపోవడం శోషనీయమన్నారు. మైనర్ బాలికపై అఘాయి త్యానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె వెల్లడించారు.

# ఆ కీచకుడి భరతం పట్టండి

## కాకినాడ ఎస్పీని కోరిన మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** కాకినాడ జిల్లా తునిలో మైనర్ గురుకుల విద్యార్థినిపై జరిగిన అత్యాచారయత్న ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బంధువునంటూ విద్యార్థినిని పాఠశాలనుంచి తోటల్లోకి తీసుకెళ్లి వేధించిన కీచకుడి ఉదంతం బుధవారం సోషల్ మీడియాలో దుమారం రేగింది. దీనిపై తక్షణమే స్పందించిన మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్ లో మాట్లాడారు. ఆ కీచకుడి భరతం పట్టాలని కోరారు. ఈ ఉదంతంపై కమిషన్ సుమోటోగా కేసును స్వీకరిస్తున్నట్లు కమిషన్ ఛైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ చెప్పారు. కేసు దర్యాప్తును వేగవంతంగా నిర్వహించాలని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్ బాలికలపై ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడిన ఏ స్థాయి వారైనా వదలకుండా కఠినంగా శిక్షించాల్సిందేనని చెప్పారు. బాధిత బాలికకు తక్షణ రక్షణ, వైద్య సహాయం, చట్టపరమైన మద్దతు అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, చైల్డ్ వెల్ఫేర్‌కమిటీకి ఆదేశాలు జారీచేశారు. ఘటనపై పూర్తినివేదికను 48 గంటల్లోగా కమిషన్‌కు సమర్పించా లంటూ జిల్లా పోలీసు శాఖకు నోటీసు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గురుకుల పాఠశాలల్లో భద్రతా చర్యలను కఠినతరం చేయాలని రాష్ట్ర విద్యాశాఖకు లేఖల ద్వారా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు విరుద్ధమైన ఏ చర్యలైనా కమిషన్ సహించదని, నిందితులకు కఠినమైన శిక్ష విధించేలా న్యాయ ప్రక్రియను

# తిరుపతి జిల్లాలో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం

**తిరుపతి, అక్టోబరు 22ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాయలసీమ జిల్లాల్లో ప్రధానంగా తిరుపతి, చిత్తూరు జిల్లాలవ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్నం తరువాత అల్పపీడనం వాయుగుండంగా బలపడుతుందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో ఈ రెండు జిల్లాలకు రెడ్అలర్ట్ జారీచేసింది. ప్రభుత్వ అధికారులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అప్రమత్తం చేశారు. రెండుజిల్లాల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు. బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటి గంటవరకు తిరుపతి జిల్లాలో తిరుమల,తిరుపతి, చంద్రగిరి, రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు ,తడ మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. సరాసరి జిల్లావ్యాప్తంగా 8.3సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తిరుపతి జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, చంద్రగిరి, నాయుడుపేట, పుత్తూరు,ఏర్పేడు మార్గాల్లో ప్రధాన రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఇళ్లలోకి భారీగావరదనీరుచేరింది. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట తరువాత సూర్యుడు కనిపించాడు. దీంతో వరుణదేవుడు శాంతించినా చలిగాలులు వీస్తున్నాయి. తిరుపతి జిల్లా, చిత్తూరుజిల్లాలో 24గంటలూ అప్రమత్తంగాఉండాలని ఆదేశాలతో కంట్రోల్‌రూమ్స్ కొనసాగిస్తున్నారు. ఎక్కడా కూడా ప్రాణనష్టం జరగకుండా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, చిత్తూరుజిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లాఎస్పీ తుషార్‌దూడే అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేలా స్పష్టమైన సూచనలు ఇచ్చారు. తిరుపతినగరంలోని అనేక ప్రాంతాలు, ప్రధాన మార్గాలు భారీ వర్షాలకు జలమయంగా మారాయి.

# హైస్కూలు నుంచే ఎఐ

>> నవంబర్ 14,15 తేదీల్లో ఎపిలో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ 2025, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫోరమ్ సమావేశాలకు హాజరుకండి. గ్రిఫిత్ విశ్వవిద్యాలయ ఆవిష్కరణ, స్టార్టప్ మద్దతునిచ్చేలా ఆంధ్రప్రదేశ్ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలసి పనిచేయాలి" అని మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు.

**ఎపిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు డిజైన్లు ఇవ్వండి: పాపులస్ సంస్థ ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ భేటీ**

పాపులస్ ఆసియా పసిఫిక్ బిజినెస్ డెవలప్‌మెంట్, బిడ్స్ అండ్ కమ్యూనికేషన్ హెడ్ ఎలిజిబెట్ డిసిల్వాలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బ్రిస్బేన్‌లో భేటీ అయ్యారు. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన స్టేడియాలకు వినూత్నమైన డిజైన్ రూపకల్పన, నిర్మాణంలో పాపులస్ ఆర్కిటెక్ట్స్ సంస్థ పేరొందింది. క్రీడాసౌకర్యాలు, మైదానాలు, ఈవెంట్ స్థలాలడిజైనింగ్, నిర్మాణంలో 40సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన పాపులస 60 బిలియన్ల విలువైన 3,500కు పైగా విలువైన ప్రాజెక్టులను చేపట్టింది. భారత్‌లో ప్రధాన మౌలికసదుపాయాల ప్రాజెక్టులపై ఎల్ అండ్ టీతో కలసి పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రాంతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు మద్దతుఇచ్చే క్రీడా సదుపాయాలను అభివృద్ధిచేస్తోంది.

# రాష్ట్రపతి అయ్యప్ప దర్శనం

>>. కారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాలధరించి ఇరుముడితో 18 మెట్లుఎక్కి అయ్యప్పను దర్శించుకున్నారు. అక్కడ ఇరుముడి సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముర్ము ఓ రికార్డు నెలకొల్పారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి ప్రెసిడెంట్‌గా నిలిచారు.ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో రెండు గంటల పాటూ బస చేయనున్నారు. అక్కడే రాష్ట్రపతికి ప్రత్యేకంగా ఆహారంవండి వడ్డించారు. మధ్యాహ్నం 3:10 గం.కు ముర్ము శబరి మల నుంచి బయల్దేరి వెళ్లారు.

# ఎన్టీఆర్ సేవా ట్రస్టు నెట్వర్క్ ఆసుపత్రులకు రూ. 250 కోట్లు విడుదల

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ అనుబంధ(నెట్వర్క్) ఆసుపత్రుల బకాయిల్లో రూ.250 కోట్లను ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసింది. నిధుల చెల్లింపులపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ తో చర్చించారు. అనంతరం చర్యల్లో భాగంగా నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. అలాగే త్వరలో మరో రూ.250 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైద్య సేవల్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్, ఇతర సంఘాల ప్రతినిధులను సౌరభ్ గౌర్ కోరారు. ఈ మేరకు బుధవారం తనని కలిసిన పలువురికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని వివరించారు.

# కాకినాడలో భారీ వర్షం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22(ప్రభాతవార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కాకినాడ జిల్లాలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాకినాడ ప్రధానమార్గంలో నీరు నిలిచిపోవడంతో ప్రయా ణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం సాయంత్రంనుండిఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచిపోయింది. తీర ప్రాంతంలో సముద్రపు అలలు ఎగసిపడి కెరటాల ఉధృతికి కోతకు గుర వుతుంది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడడంతో రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

# టిడిపిలో వేధింపులపై సీనియర్ నాయకుడు ఆందోళన

## ఎన్టీఆర్ విగ్రహానికి తల బాదుకుంటూ కన్నీరు

**లేపాక్షి, అక్టోబర్ 22 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీలో ఓ నాయకుడు తనను వేధింపులకు గురి చేస్తున్నాడని నిరసిస్తూ లేపాక్షి మండలం సిరివరంకు చెందిన సీనియర్ నాయకులు ఆవులరెడ్డి వినూత్న రీతిలో తన ఆవేదనను వెలిబుచ్చాడు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్ష మండల కేంద్రమైన లేపాక్షిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్దకు మంగళవారం రాత్రి చేరుకుని కొన్ని నిమిషాల పాటు అందరూ చూస్తుండగా తాను ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకుంటూ ఎన్టీఆర్ విగ్రహానికి తలబాదుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయ వర్గాల్లో సంచలనం కలిగించిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. సిరివరం చెరువు నీటి సంఘం అధ్యక్షులుగా ఉన్న ఆవులరెడ్డి తనకు జరిగిన అన్యాయంపై ఎమ్మెల్యే బాలకృష్ణకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశాడు. తనకు అన్యాయం చేసింది కేవలం టిడిపికి చెందిన గ్రీన్ పార్క్ నాగరాజు అని గట్టిగా కేకలు వేశారు. తనను బలవంతంగా తాగునీటి సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేయించారని, వారిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తానని ఎన్టీఆర్ పాదాల ముందు మోకరిల్లి పలుమార్లు తల బాదుకున్న సంఘటన అందరినీ కలచి వేసింది. వివరాల్లోకి వెళితే గత ఎమ్మెల్యే ఎన్నికల్లో సిరివరం పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ తగ్గింది అన్న కారణంగా సీనియర్ నేతలపై వేటు వేసే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా గత వారంలో లేపాక్షి మండల మాజీ జెడ్పిటిసి హిందూపురం మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ సిరివరం కిష్టప్పను ఎమ్మెల్యే కార్యాలయానికి పిలిపించి ప్రస్తుతం నిర్వహిస్తున్న డీలర్ షిప్‌కు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిరివరం కిష్టప్ప గత 35 సంవత్సరాలుగా తాను డీలర్ షిప్ నిర్వహిస్తూ ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా నిర్వహిస్తున్నట్టు ఘాటుగా సమాధానమిచ్చినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. తాను డీలర్ షిప్‌కు ఎట్టి పరిస్థితులలోనూ రాజీనామా చేయనని ఖరాకండిగా ఎమ్మెల్యే కార్యాలయంలో తెగేసి చెప్పినట్టు సమాచారం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కూడా తనకు ఎలాంటి సమస్య ఎదురు కాలేదని వారితో పేర్కొన్నట్టు తెలిసింది.

ఆ తరువాత ఆవులరెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయానికి పిలిపించి సిరివరం చెరువు సంఘం అధ్యక్షుని పదవికి బలవంతంగా రాజీనామా చేయించినట్లు అందుకు సీనియర్ తెలుగుదేశం పార్టీ నేత గ్రీన్ పార్క్ నాగరాజు తనను డిమాండ్ చేసినట్లు ఆవులరెడ్డి లేపాక్షిలో ఎన్టీఆర్ విగ్రహం ముందు ఆరోపించారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో తాను సిరివరంలో నిరంతరం కష్టపడి పని చేశానని అయినా నాకు తీరని అన్యాయం జరిగిందని ఆవులరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ కోసం తాను నిరంతరం కష్టపడ్డానని ఆయన అన్నారు.

# టీచర్లకూ 'టెట్'

>> లేదు: ఎస్సీ,ఎస్టీ,బీసీ,విభిన్న ప్రతిభావంతులకు డిగ్రీలో 40% మార్కులున్నా బిఇడిలో ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ సడలింపుతో బిఇడి పూర్తి చేసిన అభ్యర్థులు ఆతర్వాత టెట్ రాయాలంటే 45%అర్హత మార్కులు అవసరమవుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ నిబంధనను సడలిస్తూ 40% ఉన్నా టెట్‌రాసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈసారి 45% అర్హతమార్కులనే అనుసరించాలని పాఠశాలవిద్యాశాఖ నిర్ణయించింది. రెండు రోజుల్లో ఇవ్వనున్న టెట్‌లో 2011కు ముందు, ఆతర్వాత విద్యార్హతలను నిర్ణయించింది. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు విద్యార్హతల్లో కనీస మార్కులు ఉండాలనే దానిపై ఇంత వరకు స్పష్టత రాలేదు.2011కు ముందు అభ్యర్థులు టెట్ రాసేందుకు ఎస్జీటీలకు ఇంటర్మీడియట్‌లో ఓసిలకు 45% బీసీ,ఎస్సీ,ఎస్టీ,దివ్యాంగులు,మాజీ సైనికోద్యోగులకు 45% మార్కులు ఉండాలి. పేపర్-2 రాసేవారికి సైతం నిర్ణీత అర్హతలో ఓసీలకు 50%,ఇతరులకు 45% మార్కులు ఉండాలి.

## వారం - వర్జ్యం

23-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
విదియ రా.10.47
విశాఖ తె.4.41
వర్జ్యం : ఉ.9.21-11.09
దు.ఉ.9.56-10.43, 2) మ.2.36-3.23
శుభసమయం: ఉ.8.00-8.45
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:**వృత్తి, వ్యాపారాలలో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి.

**వృషభం:** అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**మిథునం:**నూతన పెట్టుబడులు కొద్దికాలం వాయిదా వేయడం మంచిది.

**కర్కాటకం :**ముఖ్యవ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకొంటారు.

**సింహం:**దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**కన్య :** జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. వాహన సౌఖ్యం.

**తుల :** దైవ సంబంధిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** చర్చలు, శుభకార్యాలలో ఎక్కువగా పాల్గొంటారు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** సంతానం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**మకరం:** ఎల్లవేళలా సలహాలను తీసుకోనే వారి వద్ద కాకుండా మరొక నిపుణుని సలహాలు తీసుకొంటారు..

**కుంభం:** వివాదాలకు దూరంగా ఉండండి. సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**మీనం:** శుభకార్యాలలో పాల్గొంటారు. కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మరో 3 రోజులు భారీ వర్షాలు

>> సమావేశం నిర్వహించారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని అధికారులకు తెలియజేశారు. సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోంమంత్రి అనిత వినతి చేశారు,ఇక శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఎల్లో అలర్ట్ చేసింది. గురువారం(ఈ నెల23వ తేదినుంచి) నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలోని అక్కడక్కడ భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉంది.

**అధికారుల అలర్ట్**

దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయి. సముద్రం అల్లకల్లోలంగా మారుతుంది కాబట్టి, మత్స్యకారులు వచ్చే శనివారం వరకు వేటకు వెళ్లవద్దు అని అధికారులు హెచ్చరించారు. ప్రభావిత జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రజలు సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించవచ్చు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. ఎపిలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చిత్తూరు, ప్రకాశం, బాపట్ల తదితర జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం తీవ్ర ఇబ్బంది పడుతున్నది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమైనవి. కౌండిన్య నదిలో జల ప్రవాహం ఎక్కువగా ఉన్నది కావున ప్రజలు నీటి ప్రవాహం వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎడతెరపి లేని వర్షాల వలన మనుషులే కాక జంతువులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. బుధవారం ఉదయం పలమనేరు మున్సిపల్ కమిషనర్ లోతట్టు ప్రాంతాలైన పలమనేరు పెద్ద చెరువు ఎద్దుల చెరువు ముంపు ప్రాంతాలను పరిశీలించి ఆయా ఏరియా వార్డు సెక్రటేరియలకు సహాయక చర్యల నిమిత్తం ఆదేశాలు జారీ చేశారు. ఏపిలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చిత్తూరు, ప్రకాశం, బాపట్ల తదితర జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం తీవ్ర ఇబ్బంది పడుతున్నది.రాష్ట్రానికి వాయుగుండం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులను రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అప్రమత్తం చేశారు. దక్షిణకోస్తా జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మత్స్యకారులు ఎవ్వరూ చేపలవేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడెక్కడ వాగులు పొంగుతాయో అక్కడి ప్రజలను హెచ్చరించాలని ఆదేశాలు జారీ చేశారు. చెట్లు విరిగిపడే చోట ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా అధికారులంతా సహాయక చర్యల్లో పాల్గొనాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

**రాష్ట్రంలో కొనసాగుతున్న వర్షాలు, పిడుగుపాటు ఇద్దరు మహిళలు మృతి**

నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం తమిళనాడు తీరం నుంచి వాయవ్య దిశగా కదిలి అదే ప్రాంతంలో కొనసాగుతోంది. వాయువ్య దిశగా రాబోయే 12 గంటల్లో నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. తదుపరి 12 గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్ర కోస్తా తీరాల మీదుగా కదిలే అవకాశం ఉంది. దక్షిణ కోస్తాలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.రాష్ట్రంలో తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో రాయలసీమ లోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు ఫ్లాష్ ఫ్లడ్ అలర్ట్ జారీ చేశారు. మరోవైపు కోస్తాలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్ అలర్ట్ జారీ చేశారు. ఆయా జిల్లాల్లో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని చెప్పారు. తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

23-10Pg3exHMNWJQECRT 3_23-10Pg3exHMNWJQECRT.qxd 10/22/2025 11:51 PM Page 1



# తిరుమల సమాచారం

## వైష్ణవ భక్తాగ్రేసరులకు అప్పపడి



**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** అనాది కాలంగా కొనసాగుతున్న వైష్ణవ సాంప్రదాయాల్లో అప్పపడి నివేదన విశిష్టమైన ప్రసాదం. శ్రీవారికి భక్తులపట్ల అపారకరుణకు ప్రతిఫలంగా స్వయంగా భక్తులకు ప్రసాదాన్ని పంపించే ఆచారం అప్పపడి. వైష్ణవభక్తాగ్రేసరుల తిరునక్షత్రోత్స వాల పవిత్ర దినాల్లో భాగంగా అప్పపడి ఊరేగింపు తిరుమల నుండి తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంకు తీసుకెళ్ళారు. రేపు శాత్తుమొర నిర్వహిస్తారు.

## శ్రీవారి ఆశీస్సులతో సకలశుభాలు

### - హైకోర్టు జడ్జి మానవేంద్రరాయ్



**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీక మాసం ఆరంభంలో కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రరాయ్ విశ్వాసం వెలిబుచ్చారు. సకలశుభాలు కలగాలని ఆకాంక్షించారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్న న్యాయమూర్తి తోలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో మాజీ డిజిపి ఠాకూర్



**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని బుధవారం ఉదయం మాజీ డిజిపి ఆర్‌పి ఠాకూర్ దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల ప్రారంభసమయంలో ఆయన ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఠాకూర్ వెంట తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, విఎస్ఒ సురేంద్ర ఉన్నారు.

## అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నాం



**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే అందరికీ మంచి జరుగుతుందని ,ప్రజలు సుఖసంతోషాలతోఉండాలని వేడుకున్నట్లు మాజీ మంత్రి సినీనటి ఆర్‌కె రోజా, సినీనటి రవళితెలిపారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల ప్రారంభసమయంలో ఇద్దరూ ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# షిప్ బిల్డింగ్ నుంచి డేటా సెంటర్ల దాకా..

### - ఎపిలో భారీ అవకాశాలు - యుఎఇలోని తెలుగువారి అభివృద్ధికి తోడ్పడండి

### - దుబాయ్‌లోని భారత్ ఎంబసి ప్రతినిధులతో సిఎం చంద్రబాబు చర్చలు

**విజయవాడ,అక్టోబర్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్, యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేలా సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. దుబాయిలోని భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు.ఈ సందర్భంలో పలు అంశాలను వారితో ప్రస్తావించారు.. పెట్టుబడుల సాధనకు, నవంబర్ నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానాలు పలికేందుకు యూఏఈలో మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం సీఎం చంద్రబాబు దుబాయ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా దుబాయ్, అబుదాబి దేశాల్లో భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో సీఎం భేటీ అయ్యారు. దుబాయ్ ఇండియన్ కాన్సుల్ జనరల్ సతీష్ కుమార్ శివన్, అబుదాబిలోని ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. దుబాయ్ సహా యూఏఈ దేశాల్లోని వివిధ కంపెనీల వివరాలు, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉంటుందనే అంశాలపై వారితో చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పెట్రో కెమికల్స్, పోర్టులు, లాజిస్టిక్స్, ఏవియేషన్, ఇండస్ట్రియల్ పార్కులు, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఆతిథ్య రంగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీలో వనరులు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. గూగుల్ సంస్థ విశాఖలో అతిపెద్ద డేటా ఏఐ హబ్ 15 బిలియన్ డాలర్లతో పెట్టుబడులు పెడుతోందని సీఎం వారికి వివరించారు. ఏపీకి 1054 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరప్రాంతంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు సీఎం వివరించారు. యూఏఈ దేశాల సావరీన్ ఫండ్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపైనా వారితో ముఖ్యమంత్రి చర్చించారు. ఆంధ్రప్రదేశ్ లో వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా దుబాయ్ సహా వివిధ దేశాల కంపెనీలకు వివరించాలని ఎంబసీ ప్రతినిధులకు సీఎం సూచించారు. యూఏఈ ఏపీ పారిశ్రామిక బంధం ధృఢంగా ఉండేలా చూడాలని సూచించారు. ఇప్పటికే భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ దేశాలకు చెందిన వివిధ సంస్థలు ముందుకు వచ్చిన నేపథ్యంలో ఏపీలో ఉన్న అవకాశాలను ఆయా దేశాల్లోని కంపెనీలకు వివరించాలని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అనుమతులు ఇస్తోందని అన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐతో కలిసి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని... యూఏఈలోని వివిధ సంస్థలను ఆ సదస్సుకు ఆహ్వానిస్తున్నామని దుబాయిలోని భారత ఎంబసీ ప్రతినిధులకు సీఎం తెలిపారు.

ప్రధాని మోదీ చొరవ వల్లే దేశంలో చాలా మార్పులు వచ్చాయని.. భారత్ ను పెద్ద ఎత్తున ఆయన ప్రమోట్ చేస్తున్నారని అన్నారు. గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ పార్క్ లోనూ యూఏఈ నుంచి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అమర్నాథ్ తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దుబాయ్‌లోని అంతర్జాతీయ స్థాయి సంస్థలకు అవసరమైన టెక్నాలజీ నిపుణులను అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. యూఏఈలో తెలుగువాళ్లు ఉన్నారని...వారికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఎంబసీ ప్రతినిధులను సీఎం చంద్రబాబు కోరారు. దుబాయ్ లో తన పర్యటన చివరి రోజున తెలుగు డయాస్పోరా కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీఎం చంద్రబాబు చెప్పారు.

అంతకు ముందు హైదరాబాద్ నుంచి దుబాయ్ కు చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకు స్థానిక తెలుగు ప్రజలు విమానాశ్రయానికి వచ్చి ఘనంగా స్వాగతం పలికారు. దుబాయిలో ఉన్న తెలుగు వారు.. ప్రత్యేకించి మహిళలు తెలుగు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం తెలియచేశారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారిని సీఎం అప్యాయంగా పలకరించారు.



దుబాయ్‌లోని భారత ఎంబసీ ప్రతినిధులతో చంద్రబాబు నాయుడు

## ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం ఎపి రైతులకు కొత్త అవకాశాలకు నాంది

### - రాష్ట్ర ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు, ఎగుమతులకు మంత్రి లోకేష్ ప్రాధాన్యం : మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు

**విజయవాడ అక్టోబర్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఆక్వా రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు మంత్రి నారా లోకేష్ గారు చేస్తున్న కృషి అభినందనీయం అని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు పేర్కొన్నారు. ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం కొత్త అవకాశాలకు నాంది కానుందని ఆయన అన్నారు. అమెరికా విధించిన అధిక సుంకాల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఏపీ ఆక్వా ఉత్పత్తులకు కొత్త మార్కెట్లు కల్పించాలనే లోకేష్ దూరదృష్టి ప్రశంసనీయం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఏపీ ఆక్వా రైతుల అభివృద్ధి దిశగా ఆలోచించిన మంత్రి లోకేష్ నిబద్ధతను ఆయన అభినందించారు. ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు, నిల్వ సామర్థ్యం, ప్రాసెసింగ్, కోల్డ్ చైన్, ప్యాకేజింగ్ రంగాల్లో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. ఏపీ సీ ఫుడ్ బ్రాండ్‌కి అంతర్జాతీయ గుర్తింపు తేవాలన్న మంత్రి లోకేష్ సంకల్పం రాష్ట్రానికి గౌరవం తెస్తుందని అన్నారు. రాష్ట్రానికి 1,000 కిలోమీటర్ల విస్తీర్ణం గల సముద్రతీరం ఆక్వా పరిశ్రమకు బలమైన ఆధారమని, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతిక రంగాల్లో మంత్రి లోకేష్ చూపుతున్న ప్రగతిశీల ఆలోచనలను ప్రశంసిస్తూ, వెస్టన్ సిడ్నీ వర్సిటీతో సంయుక్త పరిశోధన కార్యక్రమాలకు తీసుకుంటున్న చర్యలు ఆహ్వానించదగినవని అన్నారు. రైతులకు స్మార్ట్ ఫార్మింగ్ టెక్నాలజీ అందించే చర్యలు ప్రశంసనీయం అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పెట్టుబడుల వర్షం కురుస్తోందని, ఆక్వా రంగం అభివృద్ధి ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



మంత్రులు నారా లోకేష్, అచ్చెన్ననాయుడు

## బాలల సంఘం రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయండి :ఎఐవైఎఫ్



బాలల సంఘం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో నవంబర్ 14న బాలల సంఘం రాష్ట్ర సమ్మేళనం ను జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్, పరుచూరి రాజేంద్ర బాబు కోరారు. బాలల సంఘం రాష్ట్ర సమ్మేళనం జయప్రదం చేయాలని విజయవాడ హనుమాన్ పేట దాసరి భవన్ లో వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థ రోజుకు పెరుగుతుందని బాలలు విద్యకు దూరమై బాలకార్మికులుగా మిగిలిపోతున్నారని చట్టాలు ఉన్నా పేరుకే తప్ప బాలకార్మికుల నియంత్రణ జరగలేదని బాల్య వివాహాలు జరుగుతున్న నియంత్రణ కొరవైందని అన్నారు. నేటి సమాజంలో బాలలు గంజాయి మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్తును దూరం చేసుకుంటున్న నేపథ్యంలో రాష్ట్ర యువజన సమ్మేళనాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

## సీమలో రైల్వే అభివృద్ధి పనులు వేగవంతం: డి ఆర్ ఎం చంద్రశేఖర్ గుప్త

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 22, ప్రభాత వార్త:** రాయలసీమలోని దక్షి ణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో అమృత్ స్టేషన్ పథకంలో చేపట్టిన స్టేషన్ల పునర్నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని డి ఆర్ ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డి ఆర్ ఎం సుధాకర్ లు అన్నారు. సీనియర్ డి సి ఎం మనోజ్, డి సి ఎం శ్రీకాంత్ రెడ్డి, ఏ ఎస్ సి అనిల్ కుమార్ సింగ్ లతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.400 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన తిరుపతి రైల్వే స్టేషన్, రూ.50 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన రేణిగుంట స్టేషన్లతో పాటు, యాద్గీర్,రాయచూరు, ఆదోని,అనంతపురం,చిత్తూరులతో పాటు డివిజన్ పరిధిలో మొత్తం 17 రైల్వేస్టేషన్లలో జరుగుతున్న పునర్నిర్మాణపు పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు.

## గరుడవారధిపై నుండి దూకి తమిళనాడు వాసి ఆత్మహత్య

**తిరుపతి,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** జీవితంపై విరక్తిచెంది తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి తిరుపతిలో గరుడవారధిపైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. 30అడుగుల పై నుండి దూకడంతో తలపగిలి సంఘటనా స్థలిలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద సంఘటన బుధవారం ఉదయం తిరుపతి ఆర్టీసి బస్టాండ్-కపిలతీర్థం గరుడవారధిమార్గంలో మున్సిపల్‌పార్కు వద్ద జరిగింది. తమిళనాడు మధురై సత్యమూర్తినగర్‌కు చెందిన పాండియ రాజన్(31)కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు వచ్చారు. శ్రీవారి దర్శనానంతరం మంగళవారం సాయంత్రం తిరుపతికి దిగారు. తిరుపతిలో తిరుగాడుతూ రాత్రి కుటుంబ సభ్యులను రైల్లో మధురైకి పంపాడు. తాను బస్సులో వస్తానని నమ్మించాడు. బుధవారం ఉదయం అతను గరుడవారధిపై మున్సిపల్ పార్కువద్ద రాకపోకలు లేని సమయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వయసుమీరిపోతున్నా వివాహం కాకపోవడం, మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు అలిపిరి పోలీసులకు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుని వద్ద చిరునామాతో అలిపిరి సిఐ రామకిశోర్, ఎస్ఐ లోకేశ్‌కుమార్ అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దేవుని దర్శనానికి వచ్చి ఆ తరువాత అఘాయిత్యం చేసుకోవడంతో కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. ఇంటికి చేరగానే ఈ విషాదవార్తతో కుటుంబసభ్యులు తిరుపతికి వస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. అలిపిరి ఎస్ఐ లోకేశ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

## రైల్వే ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టండి

### జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాత వార్తప్రతినిధి:** విస్తృత ప్రజాప్రయోజనాలతో ముడిపడిన రైల్వే, జాతీయ రహదారులు (ఎన్‌హెచ్) ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ కోరారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆర్‌డీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని రైల్వే, ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు సంబంధించిన స్థితిగతులపై సమీక్షించారు. భూ సేకరణలో పురోగతిపై చర్చించారు. ఆర్‌వోబీ, ఆర్‌యూబీ ప్రాజెక్టులతో పాటు జాతీయ రహదారుల గ్రీన్ ఫీల్డ్ అలైన్ మెంట్, అవుటర్ రింగ్ రోడ్డుపై దిశానిర్దేశం చేశారు.

## వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించండి

### - వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీడిసిఎల్ చైర్మెన్ శివశంకర్

**తిరుపతిరూరల్, అక్టోబర్22 ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర విద్యుత్ సేవలు అందించుటకు విద్యుత్ శాఖ ఉద్యోగులు కృషి చేయాలని ఎపి ఎస్పీడిసిఎల్ సంస్థ చైర్మెన్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. బుధవారం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్లతో సిఎండి వీడియో కాన్ఫెరేన్స్ నిర్వహించారు.

# తిరుమలను ముంచెత్తిన వాన

### -7 సెంటీమీటర్లు వర్షపాతం నమోదు - జలాశయాల్లోకి మోస్తరుగా చేరిన వరద నీరు

**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** వరుసగా నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తిరుమలకొండ జలమయంగా మారింది. మంగళ,బుధవారాల్లో రెండురోజులు సుమారు ఏడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రధాన తాగునీటి జలాశయాలు గోగర్భమ్, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార తీర్థాల డ్యామ్‌లకు మోస్తరుగా వరద నీరు చేరింది. ప్రస్తుతం ఉన్న జలాశయాల్లో నీటినిల్వలతో 2026 మార్చినెలాఖరు వరకు తాగునీటి సమస్య తీరిందని టిటిడి వర్గాలు తెలిపాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గత నాలుగురోజులుగా విడవకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి.గోగర్భమ్‌డ్యామ్, ఆకాశగంగ జలాశయాలకు వరదనీరు చేరడంతో నిల్వలు పెరిగాయి.తిరుమలలో తాగునీటి జలాశయమైన గోగర్భండ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు కాగా 80శాతం నీటిమట్టం చేరింది.పాపవినాశనం 697.14 అడుగులు కాగా 63శాతం నీరుచేరింది. ఆకాశగంగ జలాశయం 685లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం ఉండగా వరదనీటితో 60శాతం మట్టం చేరింది.ఇక తిరుమలలో రెండు ప్రధాన పెద్దజలాశయాలు కుమారధార, పసుపుధార తీర్థాలు. ఈ రెండు జలాశయాల్లో పసుపుధార 2,833 లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం, కుమారధారతీర్థం 4,258లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యం కాగా 50శాతంమాత్రమే నీరు చేరింది. ఇదివరకు అడపాదడపా వర్షాలు వచ్చినా జలాశయాలకు పెద్దగా నీరుచేరలేదు. గత రెండు రోజు లుగా తుఫాన్‌తో కురిసిన వర్షాలకు వరదనీరు చేరడంతో తాగునీటి సమస్యకు ఇబ్బందులు తొలగినట్లేనని టిటిడి నీటివిభాగం తెలిపింది. ఈ వరదనీరు కొండల్లోంచి తిరుపతి మాల్వాడిగుండం, కపిలతీర్థం జలాశయాల్లోకి ప్రవహిస్తోంది. తిరుమలకు ఇప్పుడున్న పరిస్థితుల్లో రోజూ లక్షమంది వరకు భక్తులు వస్తున్నారు. నీటి వినియోగంకూడా పెరిగింది. ప్రతిరోజూ కొండపై 43లక్షల గ్యాలన్ల నీరు వినియోగిస్తున్నారు. ఇందులో 18లక్షల గ్యాలన్ల నీరు తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భమ్, ఆకాశగంగ, పాపవినాశనమ్, కుమారధార, పసుపుధార తీర్థాల డ్యామ్‌ల నుండి వాడుకుంటున్నారు. ఇప్పుడు తాజా పరిస్థితు లతో జలాశయాల్లో నీరు 180 రోజులు వరకు అవసరాలకు సరిపోతుందనే అంచనా. బంగాళాఖాతంలో అల్పపీడనంతో తిరుమలలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం వరకు విడవకుండా కురిసిన జోరువానలకు జలమయంగా మారింది. ఆలయం ముందుభాగం, పరిసరాలు, మాఢవీధుల్లో వరదనీరు ప్రవహించింది. వర్షాలతో వాతావరణం పూర్తిగా మారడంతో విపరీతమైన చలిగాలులు వీస్తున్నాయి.



వరదనీటిలో తిరుమల ఆలయం పరిసరాలు

## లక్ష్మీనాయుడు కుటుంబానికి భరోసా ఇచ్చిన ప్రభుత్వం

### - మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు

### - హత్యకు గురైన కార్యకర్త కుటుంబానికి చెక్కులు అందజేసిన మంత్రి నారాయణ



**నెల్లూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త-వైద్యం :** గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనారాయణ హత్య చాలా దారుణమైనదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. బుధవారం నెల్లూరులోని రోడ్లు భవనాలు అతిధి గృహంలో తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేసే కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు భార్య సుజాతకు ఐదు లక్షల రూపాయల చెక్కును, కుమార్తెలు లహన్విశ్రీ, తన్విశ్రీలకు 5 లక్షల రూపాయలు వంతున తిరుమలశెట్టి భార్గవ నాయుడుకి మూడు లక్షలు, తిరుమలశెట్టి పవన్ కుమార్‌కు 5 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విషయం తెలిసిన వెంటనే లక్ష్మీ నాయుడు హత్య ఉదంతంపై తక్షణమే స్పందించి హోం శాఖ మంత్రి అనిత, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, శాసనసభ్యులు శ్రీనివాసరావులతో కమిటీ వేయడం జరిగిందన్నారు. కమిటీ తుది నివేదిక ప్రకారం లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునే చర్యలలో నిన్న ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా నగదుతో పాటు వారి కుటుంబ సభ్యులకు రెండు ఎకరాలు వంతున మొత్తం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అంతే కాక పిల్లల చదువులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఆయన తెలిపారు. హత్యాకాండలో వెన్నుపూసకు దెబ్బతగిలి ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న తిరుమలశెట్టి పవన్ కుమార్‌కు ఐదు లక్షల రూపాయలు, నాలుగు ఎకరాల భూమిని ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదే విధంగా గాయాలతో బాధపడుతున్న తిరుమలశెట్టి భార్గవ నాయుడు కు మూడు లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు. హత్య కేసుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా నేరస్తులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## వసతి గృహాలలో పిల్లల సంరక్షణపై కలెక్టర్ హెచ్చరిక

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22(ప్రభాతవార్త):** జిల్లా వసతి గృహాలలో ఉండే పిల్లల విషయంలో అన్ని వసతి గృహాల వార్డెన్లు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో నిరక్ష్యం వహించరాదని గురువారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వసతి గృహాల నుండి పిల్లలను పంపేముందు, పిల్లల సంరక్షణలో భద్రతను గరిష్టంగా నిబంధిస్తూ, బంధువుల వివరాలు, తగిన ఆధారాలు ముందుగా నమోదు చేసుకున్న తర్వాత మాత్రమే వారితో పంపవలసినదని స్పష్టం చేశారు. ఇటీవల నగరంలో చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో, హాస్టల్ వార్డెన్‌కు షో కాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సంఘటనపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్తో సమగ్ర విచారణ చేపట్టడం జరుగుతోందని వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తులో, వసతి గృహాల్లో నిరక్ష్యం గమనించబడక పోయినప్పటికీ, ఆడపిల్లలు, వసతి గృహాల్లో ఉండే పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్, ఈ హెచ్చరికల ద్వారా,

వసతి గృహాల వార్డెన్లు పూర్తి అప్రమత్తత, జాగ్రత్త మరియు బాధ్యతా దృక్పథంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు స్పష్టంగా అర్థం అయ్యే విధంగా, పిల్లల భద్రతను మరింత బలపరచడం అని తెలిపారు.

## రాజమండ్రి గణేష్ చౌక్ బాలికల వసతి గృహం విద్యార్థినిపై అత్యాచారం

### నిందితుడుపై పోక్సో కేసు నమోదు - బిసి బాలికల హాస్టల్ వార్డెన్‌ను నిలదీసిన వైసిపి మహిళా నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, మేడపాటి షర్మిలారెడ్డి బృందం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22( ప్రభాతవార్త):** రాజమండ్రి లోని బాలికల వసతి గృహంలోని ఒక విద్యార్థినిని మూడు రోజుల క్రితం ఒక యువకుడు బయటకు తీసుకువెళ్ళి అత్యాచారం చేసిన సంఘటన నేపథ్యంలో బుధవారం జక్కంపూడి విజయలక్ష్మి రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, గాండ్ల తెలకుల కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్ సంకిస భవానీ ప్రియ, బీసీ నాయకురాలు బర్ల సీతారత్నం తదితరులు వసతి గృహాన్ని సందర్శించి వార్డెన్ ను గట్టిగా నిలదీశారు. అపరిచితుల వెంట హాస్టల్ విద్యార్థినిని ఎలా బయటకు పంపించారని వారు వార్డన్ను నిలదీశారు. రిజిస్టర్లో వివరాలు సరిగా నమోదు చేయకపోవడం పట్ల వైసీపీ మహిళా నాయకులు వార్డన్పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రోజు సాయంత్రం ఆ విద్యార్థిని తన అన్నయ్య వచ్చాడని, సబ్బులు తెచ్చుకోవాలని చెప్పి బయటకు వెళ్ళిందని వార్డెన్ చెప్పారు. కుటుంబ సభ్యులు కాని వారితో ఎలా పంపిస్తారని జక్కంపూడి విజయలక్ష్మిబృందం గట్టిగా ప్రశ్నించారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తరుచుగా మహిళల జోలికి ఎవరు వచ్చినా వారికి అదే ఆఖరు రోజని చెబుతారని, కాని కూటమి పాలనలో మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే నిందితులపై సరైన చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు.

వార్త

విద్య లేకపోయినప్పటికీ గర్వించేవాడు, దరిద్రుడైనప్పటికీ పెద్ద ఎత్తులు వేసేవాడు, పనులు చేయనప్పటికీ ధనాన్ని ఆశించే వాడు మూర్ఖుడు.

-లావోసు

# పేదరికం తగ్గుముఖం!

దేశంలో పేదరికం తగ్గిందని ఎంతోకాలంగా విడుదలవుతున్న సర్వే సంస్థల నివేదికలు, నీతి ఆయోగ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ సంస్థ కూడా అదే చెబుతోంది. ఈ సంస్థ ఏటా తన సర్వే నివేదికలు అందిస్తూనే ఉంది. కేవలం 15 సంవత్సరాల వ్యవధిలోనే ప్రపంచ విలువను తగ్గించుకున్న 25 దేశాలలో భారత దేశం కూడా ఒకటి. మన దేశంలో 2021 నుంచి 2025 మధ్య 415 మిలియన్ల మంది ప్రజలు పేదరికం నుంచి గట్టెక్కిన వైనాన్ని యునైటెడ్ నేషన్స్ నివేదిక గతంలోనే వెల్లడించింది. ఇది నిజంగా అద్భుతమైన విజయం గానే భావించాలి. 2023 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2016-2021 మధ్య దేశ జనాభాలో 10శాతం మంది పేదరికం నుంచి తప్పించుకోగలిగారని వివరించిం ది. ఇలాంటి సానుకూల మార్పులకు దోహదపడే జీవన ప్రమాణాల సూచికలలో గణనీయ ప్రగతి కనపడింది. 2005-2006లో సుమారు 645 మిలియన్ల మంది పేదరికంలో మగ్గుతుండగా ,ఆ సంఖ్య 2015-2016 నాటికి 370 మిలియన్లకు తగ్గింది. 2019-2021 లో దాదాపు 230 మిలియన్లకు తగ్గింది. అంటే దేశంలో ప్రగతిశీల ఆలోచనలు, దారిద్ర్య రేఖకు దిగువనున్న వారి ఆర్థిక స్థితిగతులను పెంచేలా అమలు చేస్తున్న వివిధ పథకాల ఫలితంగానే పరిగణనలోకి తీసుకోవాల్సిందే! ఏటా అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినంగా అక్టోబరు 17న జరుపుకుంటాము. అనుకున్న లక్ష్యాలు సాధించగలిగామో లేదో తెలుసుకునే ప్రక్రియలో ద గ్లోబల్ ఇండెక్స్ సంస్థఈ ఏడాది అక్టోబరు 18నాటికి పేదరిక స్థాయిని అంచనా వేసి, ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి స్థితిగతులపై ప్రత్యేక నివేదికను విడుదల చేసింది. పేదరిక నిర్మూలన కోసం కృషి చేయాలని ఐక్యరాజ్య సమితి సంకల్పిస్తే భారత్ పేదరిక నిర్మూలన నినాదాన్ని అందిపుచ్చుకుంది. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధిలక్ష్యాలలో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలి.ఆనాటికి ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని 2019 జూలైలో ఆ సంస్థ నివేదిక చెబుతోంది. 101 దేశాల్లో 23.1 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగం 18 ఏళ్ల లోపు వారే. అధ్యయనం జరిపిన దేశాల్లో 17.5 శాతం వయోజనులు పేదరికంలో మగ్గుతుండగా, 33.8 శాతం చిన్నారులు ఆ దురవస్థలో కూరుకుపోయి ఉన్నారు. పేదరికాన్ని సామాజిక, ఆర్థిక సమస్యగా గుర్తించిన దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. అదే బాటలో భారత్ కూడా నడుస్తోంది. ఇది ఈ నాటి సమస్య కాదు. ఐతే స్వాతంత్రం వచ్చిన తరువాత నుంచి ప్రభుత్వాలు సమాజంలో వెనుకబాటు తనాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని బీదల పాట్లు ఎలా ఉంటాయో అధ్యయనం చేసి మరీ పథకాలను అందుబాటులోకి తెచ్చారు. కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికంగా పేర్కొంటాము. ఎన్ని ఆటంకాలు ఎదురైనా శాస్త్రీయ కోణంలో ఆలోచించి ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం పాటుపడుతున్నాయని చెప్పాలి. ఇప్పుడొస్తున్న ఫలితాలనుబట్టి పేదరిక నిర్మూలన,సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయి. పేదల అభ్యున్నతికి ఉపాధి కల్పనతొలిమెట్టు. ఆపై ఆర్థిక స్వావలంబన కోసం విద్య, వైద్యం,రుణ సదుపాయం, మెరుగైన మౌలిక సదుపాయాలుఅందుబాటులో ఉండాలి. ఒకప్పుడు సంపన్నులు, పేదలు అనే వర్గాల గురించి విస్తృత చర్చ జరిగింది.కానీ ఎంత చేసినా, ఏమి చేసినా మరో వర్గం దారిద్ర్యం అంచున ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. వాళ్లే నిరుపేదలు. ఇప్పుడా పరిస్థితులు మారాయి. 1990లో మొత్తం జనాభాలో 36 శాతం మంది పేదరికంలో ఉంటే, 2025 నాటికి అది 10శాతానికి తగ్గింది. 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆదాయం కనీస అవస రానికి అనుగుణంగా ఉండాలనేది భావన. ప్రపంచం నుంచి పేదరికాన్ని తరిమి కొట్టడం సహస్రాబ్ది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకంగా చెప్పుకొన్న నేపథ్యంలో దేశాల మధ్య యుద్ధం కాదు, పేదరికంపై సమరం చేయాలని ఆ మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో పాటు పెద్దల అభ్యున్నతికి చేసిన ఆలోచనలకు కూడా సత్ఫలితాలను ఇచ్చింది. శ్రామికులకు ఉపాధి కల్పించే వ్యవసాయ స్థితిగతులను మెరుగుపరిస్తే వారికి జీవనోపాధి కలిగి ఆర్థికంగా ఎదుగుతారు. భారతీయ శ్రామికుల్లో తొంభై శాతా నికిపైగా అసంఘటిత రంగాల్లోనే పని. ఆయా రంగాల్లో వేతన భత్యాల విషయమై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించి వాటిని మెరుగుపరచి నప్పుడే పేదరికాన్ని పారద్రోలేందుకు ఆస్కారముంటుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా పేదరికం తగ్గుముఖం పట్టిందని గ్లోబల్ ఇండెక్స్ సర్వే ఘంటాపథంగా చెబుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 11.77 శాతం నుంచి 6.06కి తగ్గగా తెలంగాణలో 13.180 శాతం నుంచి 5.85 శాతానికి తగ్గింది. అందరికీ ఉపాధి కల్పించినట్లయితే పేదరికం, ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, నీతి ఆయోగ్ ,ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. భారత్‌లో కొన్నిరాష్ట్రాలు ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో కూడా గణనీయంగా పేదరికం తగ్గినట్లు ఈ సర్వే వివరిస్తోంది. ఐరాస లక్ష్యం నెరవేరాలంటే మరో అయిదేళ్ల చిత్తశుద్ధితో ఆయా రాష్ట్రాలు బడుగుల అభ్యున్నతిలో భాగంగా నిరుపేదల లక్ష్యంగా పనిచేయాలి.



మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.

గురునానక్



మనిషి వంటిపై దుస్తులు వేసుకున్నా ముఖం మీద చిరునవ్వు లేనిచో ముస్తాబు పూర్తికానట్లే.

మహాత్మా గాంధీ

# మార్కెట్ యార్డులు రైతులకిచ్చే భరోసా ఎంత?

**పరిస్థితులు అనుకూలించక పండించిన పంటకూడా అనుకున్న రీతిలో రాకపోవడం వల్ల కష్టపడి పంటలు పండించే రైతులు, కాంట్రాక్టు వ్యాపారుల మధ్య విభేదాలు పొడ చూపుతున్నాయి. వీటివలన ఎక్కువగా నష్టపోయేది రైతులే అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దళారులు మోసం చేసిన నష్టపోయేది రైతులే, మార్కెట్ యార్డులో నష్టం వచ్చినా నష్టపోయేది రైతులే, ప్రకృతి కన్నెర్ర చేసినా నష్టపోయేది రైతులే. ఎటుచూసినా నష్టపోయేది రైతులే అనే విషయం విస్మరించరాదు. ఏది ఏమైనప్పటికీ రైతులుపండించిన పంటకు వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా తగిన రీతిలో గిట్టుబాటు ధర వచ్చే విధంగా రైతులు లబ్ధి పొందవలసి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యవసాయరంగ నిపుణులలో లేకపోలేదు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులు గతంతో పోలిస్తే కొంత ఆధునికరించబడినప్పటికీ, అన్నదాతలు చాలావరకు మధ్య దళారీల చేతుల్లో నష్టపోకుండా పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధరవచ్చే విధంగా రైతన్నలకు భరోసా ఇచ్చేవిధంగా మార్కెట్‌యార్డుల నిర్వహణ మరింతగా ప్రామాణికంగా కచ్చితత్వం కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉంది.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశానికి వెన్నెముక అయిన రైతు అన్నదాతగా వ్యవసాయ రంగంలో ఎదురు అవుతున్న అనేక అవరోధాల మధ్య దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ప్రజల జీవనానికి అవసరమైన నిత్యవసర ఆహార ఉత్పత్తులను, వ్యాపార వాణిజ్య పంటలను రైతులు సమృద్ధిగా పండిస్తూ వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా అమ్మకాలు జరిపి వినియోగదారులకు అందించేందుకు నిర్విరామ కృషి చేస్తున్నప్పటికీ, వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్ణయించే ధరలు రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించే స్థాయిలో లేకపోతున్నాయా అనే వాదనలు రైతాంగం నుండి వినిపిస్తుంటాయి. పెట్టుబడి పెట్టి పండించిన పంటలను రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చినప్పుడు మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధరలు లాభసాటిగా ఉన్నా లేకున్నా అమ్మకాలు జరిపి రావాల్సిన పరిస్థితిలో రైతాంగం ఉందనే భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. ఒకవేళ లాభసాటిగా లేని ధరకు అమ్మడానికి ఇష్టం లేకపోయినా మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటదిగుబడిని తిరిగి మళ్లీ వెనక్కి తీసుకుపోవడం భారంతో కూడిన పని. మద్దతు ధర పలికే వరకు నిలువ ఉంచాలన్నా కోల్డ్ స్టోరేజీల్లో రోజు వారీ కిరాయి కట్టవలసిందే.సొంత రవాణా ఖర్చు భరించాల్సిందే, ఇలాంటి పరిస్థితుల్లో కొంతమంది మధ్య దళారీలు రైతులకు ఎక్కువ ధర ఆశ చూపి కొనుగోలు చేసుకునే క్రమంలో రైతులు మధ్య దళారుల చేతుల్లో మోసపోతున్న సంఘటనలు అడపాదడపా చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సాధారణంగా రైతులు పండించిన వరి, మొక్కజొన్న, గోధుమ, పప్పు దినుసులు తదితర ఆహార పంటలతో పాటు పత్తి, పసుపు, మిరప లాంటి వాణిజ్య పంటలను అమ్మకానికి కొనుగోలుకు వేదికగా వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉంటున్నాయి. వ్యవసాయ మార్కెట్లో ఆయా పంటలకు నిర్దిష్టమైన ధరను ప్రభుత్వం మార్కెట్ కమిటీ నిర్ణయం మేరకు రైతులు పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్ యార్డులు కొనుగోలు చేసి తిరిగి కావలసిన వారికి విక్రయాలు చేయడానికి ఒక నిర్దిష్టమైన చట్టబద్ధత కలిగినటువంటి వేదికగా వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉంటున్నప్పటికీ రైతుల విషయంలో మార్కెట్ యార్డులు అనుకున్న స్థాయిలో రైతులకు లాభాలు చేకూర్చే విధంగా గిట్టుబాటు ధరలు ఉండటం లేదనే భావన రైతాంగంలో లేకపోలేదు. రైతులు పండించిన పంటను మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చినప్పుడు తూకం వేసే విధానంలో గతంలో అనేక లోటుపాట్లు తెరపైకి వచ్చినా ప్రస్తుతం ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంతో తూకం నిర్వహిస్తున్నా, తరచుగా మిషన్లలో సాంకేతిక లోపాలు ఏర్పడడం, కొన్ని సార్లు తూకంలో హెచ్చుతగ్గులు గోచరిస్తుండటంతో రైతులలో



గందరగోళ పరిస్థితులు నెలకుంటున్నాయా అనే సంశయం కలుగక మానదు. ఇలాంటి సందర్భాల్లో రైతులు పండించిన పంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డులు నిర్దిష్టమైన వేదికగా ఉంటూనే రైతుల నుండి పంటలు కొనుగోలు చేసే క్రమంలో అయినా, వినియోగదా రులకు విక్రయించే రీతిలో గానీ విశ్వసనీయతతో పురోగతి సాధించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీలు క్షేత్రస్థాయి లో మరింత కార్యచరణను చేపట్టాల్సిన అవసరం ఉంటుం దేమో. వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పండించిన పంటను ఆన్‌లైన్‌లో అమ్ముకోవడానికి ఇ మార్కెట్ విధానం తీసుకు వచ్చినప్పటికీ, తరచుగా టెక్నికల్ విషయంలో అనేక సమస్యలు వస్తున్నాయి. ఈ సందర్భంగా రైతులు అనేక ఇబ్బందులు పడవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దళారీల చేతుల్లో రైతులు మోసపోకుండా వ్యవసాయ మార్కెట్లను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకు రావడానికి ప్రవేశపెట్టిన నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్ విధానం రైతులకు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, వాటి పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకునే రీతిలో ఎలాంటి సాం కేతిక ఇబ్బందులు కలగకుండా మార్కెట్ కమిటీలు వీలైనం తగా చూడగలిగితే రైతుకు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర మార్కెట్లో ఉన్నప్పుడు ధరను ముందుగా రైతులు తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది.కాబట్టి పండించిన పంటను గిట్టుబాటు ధర ఉన్నప్పుడు సరైన సమయంలో మార్కెట్ యార్డ్‌లకు రైతులు తీసుకుని రావడానికి మరింత ఆసక్తి చూపుతారు. వ్యవసాయ మార్కెట్ చట్టాల ప్రకారం కాంట్రాక్టు పెట్టుబడి వ్యాపారులు కొంతమంది నేరుగా రైతులను కలుసుకుని పంట చేతికి వచ్చే వరకు ఖర్చును భరిస్తామని, పండించిన పంటను తామే కొని విక్రయిస్తామనే రీతిలో ఒప్పందాలు జరుపుకుంటున్నప్పటికీ, తరచుగా ఇలాంటి ఒప్పందాలతో పెట్టుబడి దారులకు రైతులకు మధ్య అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. కాంట్రాక్టు తీసుకున్న సమయానికి పంట చేతికి వచ్చి సరైన దిగుబడి వచ్చిందంటే సమస్య లేదు. కానీ పరిస్థితులు అనుకూలించక పండించిన పంటకూడా అనుకున్న రీతిలో రాకపోవడం వల్ల కష్టపడి పంటలు పండించే రైతులు, కాంట్రాక్టు వ్యాపారుల మధ్య విభేదాలు పొడ చూపుతున్నాయి. వీటి వలన ఎక్కువగా నష్టపోయేది రైతులే అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దళారులు మోసం చేసిన నష్టపోయేది రైతులే, మార్కెట్ యార్డులో నష్టం వచ్చినా నష్టపోయేది రైతులే, ప్రకృతి కన్నెర్ర చేసినా నష్టపోయేది రైతులే. ఎటుచూసినా నష్టపోయేది రైతులే అనే విషయం విస్మరించరాదు. ఏది ఏమైనప్పటికీ రైతులుపండించిన పంటకు వ్యవసాయమార్కెట్ యార్డుల ద్వారా తగిన రీతిలో గిట్టుబాటు ధర వచ్చే విధంగా రైతులు లబ్ధి పొందవలసి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యవసాయరంగ నిపుణులలో లేకపోలేదు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్‌యార్డు లు గతంతో పోలిస్తే కొంత ఆధునికరించబడినప్పటికి, అన్నదాతలు చాలావరకు మధ్య దళారీల చేతుల్లో నష్ట పోకుండా పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధరవచ్చే విధంగా రైతన్నలకు భరోసా ఇచ్చేవిధంగా మార్కెట్‌యార్డుల నిర్వహణ మరింతగా ప్రామాణికంగా కచ్చితత్వం కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. ●

# అమ్మాయిల చదువుకు ఆటంకాలు తొలగించాలి

డి. అశోక్

లింగ సమానత్వం దిశగా ప్రపంచం పురోగమిస్తోందని, విద్యా రంగంలో అద్భుతమైన మార్పులు వస్తున్నాయని భావిస్తున్న తరుణంలో, యునెస్కో విడుదల చేసిన తాజా నివేదిక మనల్ని ఆత్మపరిశీలన చేసుకొనేలా చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా నేటికీ 13.3కోట్ల మంది బాలికలు పాఠశాల విద్యకు దూరంగా ఉన్నారన్న వాస్తవం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. మూడు దశాబ్దాల క్రితం బీజింగ్ డిక్లరేషన్ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో గణనీయమైన ప్రగతి సాధించినప్పటికీ, ప్రాంతీయ అసమానతలు, నాణ్యమైన విద్యలో లోపాలు, నాయకత్వ స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం కొరవడటం వంటి సవాళ్లు ఇంకా మిగిలే ఉన్నాయని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే, ఈ బాలికలు తమ భవిష్యత్తును నిర్మించుకొనే అవకాశాన్ని కోల్పోవడమే కాకుండా, సమాజాలు కూడా విద్య ద్వారా అందే సామాజిక, ఆర్థిక ప్రయోజనాలకు దూరమవుతాయి. 1995 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక, మాధ్యమిక విద్యలో బాలికల నమోదు నిష్పత్తి బాలురతో సమానంగా పెరిగింది. కానీ ఈ ప్రగతి అన్నిచోట్లా ఒకేలా లేదు. సబ్‌సహారా ఆఫ్రికా వంటి ప్రాంతాలు వెనుకబడి ఉండగా, లాటిన్ అమెరికాలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా సెకండరీ విద్య వైపు మొగ్గుచూపుతున్నారు. పేదరికం, గ్రామీణ ప్రాంతాల్లో నివసించడం వంటి అంశాలు ఈ అసమానతలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. గినియా, మాలి వంటి దేశాల్లో అతి తక్కువ సంఖ్యలో యువతులు పాఠశాలలకు వెళ్లగలుగుతున్నారంట పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.ప్రపంచ చిత్రానికి భారతదేశం అతీతమేమీ కాదు. 'బేటీ బచావో, బేటీ పడావో' వంటి పథకాలతో కేంద్ర ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సవాళ్లు అనేకం. ముఖ్యంగా ప్రాథమిక విద్య తర్వాత, ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయికి వచ్చేసరికి బాలికల డ్రాపౌట్ల సంఖ్య పెరుగుతోంది. దీనికి సామాజిక,ఆర్థిక కారణాలు అనేకం. బాల్యవివాహాలు, ఇంటి పనుల్లో సహాయం చేయాలనే ఒత్తిడి, పాఠశాలలు దూరంగా ఉండటం, సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం, భద్రతాపరమైన ఆందోళనలు ప్రధాన ఆటంకాలుగా నిలుస్తున్నాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే గణాంకాల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు బాలికల చదువుకు అడ్డుకట్టవేస్తున్నాయి. ఇక తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విషయానికొస్తే, ప్రభుత్వాలు బాలికా విద్య కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 'అమ్మఒడి', 'జగనన్న విద్యా దీవెన' వంటి పథకాలు విద్యార్థుల నమోదు నిష్పత్తిని పెంచడంలో దోహదపడ్డాయి. తెలంగాణలో గురుకుల పాఠశాలల వ్యవస్థ ద్వారా గ్రామీణ, పేద బాలికలకు నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నం జరుగుతోంది. అయినప్పటికీ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య విద్యా నాణ్యతలో వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు డిజిటల్ విద్యకు దూరమవుతున్నారు. పాఠ్య పుస్తకాల్లో లింగ వివక్ష చూపే అంశాలు, మహిళలను కేవలం సంప్రదాయ పాత్రలకే పరిమితం చేసేధోరణులు ఇంకా కొనసాగుతుండటం విచారకరం. యునెస్కో నివేదిక నొక్కి చెప్పిన మరో కీలక అంశం విద్యా రంగంలో నాయకత్వ లోపం.ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల్లో మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, ఉన్నత విద్యా సంస్థల అధిపతుల్లో కేవలం 30మాత్రమే మహిళలున్నారు. ఈ పరిస్థితి మన దేశంలో, మన రాష్ట్రాల్లో కూడా భిన్నంగాలేదు. వ్యవస్థాగతమైన అడ్డంకులు మహిళలను నాయకత్వ స్థానాలకు చేరకుండా అడ్డుకుంటున్నాయి. విద్య ద్వారా సాధించాలనుకుంటున్న సంపూర్ణ సమానత్వానికి ఇది గొడ్డలిపెట్టు. బాలికా విద్యను కేవలం అక్షరాస్యత శాతాన్ని పెంచే అంకెగా కాకుండా, సామాజిక పరివర్తనకు సాధనంగా చూడాలి. ప్రభుత్వాలు కేవలం నమోదుపైనే కాకుండా, విద్య నాణ్యత, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు (ముఖ్యంగా బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు), భద్రతపై దృష్టి సారించాలి. బాల్య వివాహాలకువ్యతిరేకంగా చట్టాలను కఠినంగా అమలు చేయడంతోపాటు, ఆడపిల్ల చదువు కుటుంబానికి భారమనే భావనను తొలగించడానికి విస్తృత ప్రచారం కల్పించాలి. పాఠ్య పుస్తకాల్లో లింగ సమానత్వాన్ని పెంపొందించే అంశాలను చేర్చాలి. మహిళా శాస్త్రవేత్తలు, నాయకులు, క్రీడాకారుల విజయగాథలను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి.విద్యా రంగంలో మహిళలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడానికి ప్రత్యేక శిక్షణ,ప్రోత్సాహకాలు అందించాలి. చదువుతోపాటు బాలికలకు వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తే, వారు ఆర్థికంగా నిలదొక్కుకోగలరనే భరోసా తల్లిదండ్రులకు కలుగుతుంది. విద్యావంతురాలైన మహిళ తన కుటుంబాన్నే కాకుండా,దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయగలదు. బీజింగ్ డిక్లరేషన్ ఆశయాలను సాకారం చేయాలంటే,గణాంకాలను చూసి సంతృప్తి చెందకుండా, క్షేత్రస్థాయిలోని సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వాలు,సమాజం కలిసికట్టుగా పనిచేయాలి. ●

# ఆందోళనలతో అట్టుడుకుతున్న అమెరికా!

ఐ.ప్రసాదరావు

ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాలకు మన ఇరుగు పొరుగు దేశాల్లో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో సంభవించిన పరిణామాలు, అలాగే ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న పరిణామాలు కనువిప్పు కలగాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు స్వతహాగా స్వదేశంలోనే అమెరికా వాసులకు అగ్రహజ్వాలలు రగులుస్తున్నాయి. గత కొన్ని నెలలుగా అక్కడ అక్కడ స్వల్పంగా ప్రారంభమైన నిరసనలు అక్టోబర్ 19వ తేదీన అమెరికాలో దాదాపు 2500 ప్రాంతాల్లో 'నో కింగ్స్' పేరుతో నిరసనలు దేశవ్యాప్తంగా మిన్నంటాయి. లక్షలాది ప్రజలు, సంస్థలు, డెమోక్రట్స్ తో సహా రోడ్లు ఎక్కి ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు పట్ల ప్లేకార్డ్స్, స్లోగన్స్‌తో హోరెత్తించారు. న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, వాషింగ్టన్, ఫిలిడెల్ఫియా, అట్లాంటా, హ్యూస్టన్, చికాగో వంటి నగరాలతో పాటు యాభై రాష్ట్రాల్లో అమెరికాలో ,'రాజులు లేరు, చక్రవర్తులు (రారాజులు)లేరు' అంటూ నినదించారు.అమెరికా రాజ్యాంగం ప్రకారం పాలన అందించాలి అని, నిరంకుశ పాలన సహించం అని నిరసనకారులు నినదించారు. యూరప్ దేశాల్లో కూడా అమెరికా రాయబార కార్యాలయాల ముందు నిరసనలు వ్యక్తంచేశారు. ఇంత ఉధృతంగా రెండవసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ట్రంప్‌కు స్వదేశంలోనే తిరుగుబాటు తేవడానికి ప్రధాన కారణం ఆయన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పేరుతో రకరకాల ఉత్తర్వులు జారీ చేసి పాలనను అస్తవ్యస్తం చేయడమే. గత మూడు వారాలుగా అమెరికాలో 'షట్ డౌన్' ప్రారంభమై అనేకమంది ఉద్యోగాలు కోల్పోవడం, ద్రవ్యోల్బణం పెరుగుదల, వలసలపై తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రఖ్యాత యూనివర్సిటకు నిధులు నిలుపుదల చేయడం, విద్యాశాఖపై తీసుకున్న నిర్ణయాలు, అనేక రంగాల్లో, శాఖల్లో ఉద్యోగాల కోత వంటి అనేక నిర్ణయాలు ప్రజలను ఆగ్రహావేశాలకు గురిచేస్తున్నాయి. ఈ నిరసనలు జెన్ జెడ్ తరహాలో ఉధృతం అవుతుండటం పట్ల ప్రపంచ వ్యాప్తంగా అమెరికాలో జరుగుతున్న పరిణామాలు పట్ల ఆసక్తి పెరుగుతుంది. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (యమ్ .ఏ.జి.ఏ)'అనే నినాదంతో గద్దెఎక్కిన ట్రంప్, మొదట్లో చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై అధిక సుంకాలు విధించి, తదుపరి పునః సమీక్ష చేసుకోవడం, ఇక మనదేశంపై కూడా దాదాపు యాభై శాతం సుంకాలు విధిస్తూ, విరోధం తెచ్చుకోవడం, మన భారతీయ విద్యార్థులపై ఆంక్షలు విధించడం, వీసాలు జారీ కఠినతరం చేయడం వల్ల కూడా మనదేశానికి దూరం జరగడంతో, స్వతహాగా మనతో పాటు అమెరికాలో కూడా ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఒకడుగు ముందుకేసి భారత్, పాక్ మధ్య యుద్ధం నేనే అపానని ట్రంప్ చెప్పడం, దీనిని భారత్ ఖండించడంతో, ట్రంప్ తన వ్యక్తిగత స్టేచర్ కోల్పోవడం జరిగింది. తిరిగి



మరల నేడు భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనదు అని ట్రంప్ చెప్పడం, ఈ విషయాన్ని మరల మన అధికారులు ఖండించడంతో మరింత పలచన అవ్వడం జరుగుతుంది. ఒక పక్క తాను తీసుకున్న నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధం అని ఫెడరల్ కోర్టు పేర్కొనటం, మరోపక్క నోబెల్ బహుమతి కోసం ఆరాటం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కొన్ని రాష్ట్రాల్లో 'నేషనల్ గార్డ్' పోలీసులను పంపుతూ ఆయా రాష్ట్రాల ప్రజల, మేయర్ల ఆగ్రహానికి గురి అవుతున్న పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో జనవరి నెలలో రెండవ సారి అమెరికా అధ్యక్షుడుగా బాధ్యత స్వీకరించిన ట్రంప్ అంతర్జాతీయంగా వివిధదేశాలతో సత్ సంబంధాలు కోల్పోవడం జరుగుతుంది. మరోపక్క తాను తీసుకుంటున్న నిర్ణయాలు వల్ల స్వదేశంలోనే నిరసనలు మిన్నంటుతున్నాయి. ఇంత స్వల్ప కాలంలోనే భారీగా అసంతృప్తి మూటగట్టుకోవడంతో,భవిష్యత్తులో అమెరికాపరిస్థితి ఏమిటి అనే భావనకు అందరూ వస్తున్నారు. ముఖ్యంగా ఒకపక్క భారత్ మాకు మిత్రుడు అంటూనే, మరోపక్క ఇటీవల కాలంలో పాకిస్థాన్‌తో సన్నిహితంగా మెలగటంతో మనకు మరింత దూరంగా జరుగుతున్నాడు. ఈ విధంగా స్వదేశంలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ ట్రంప్ తన నిర్ణయాలు వల్ల వ్యతిరేకత మూటకట్టుకుంటున్నారు. తన ఎన్నికల ప్రచారంలో కుడి భుజంగా పనిచేసిన 'ఎలన్ మస్క్' ను సైతం తన నిర్ణయాలతో దూరం చేసుకోవడం జరిగింది.ఇదే సమయంలో తనకు అత్యంత ప్రియ మిత్రుడు అని చెప్పుకునే మన ప్రధాని మోడీని సైతం దూరం చేసుకోవడం గమనార్హం. ఈవిధంగా అతి తక్కువ సమయంలో దాదాపు అందరికీ దూరం జరగడం ఆందోళనకరం. ఇక అంతర్జాతీయ సంస్థలైన ఐక్యరాజ్యసమితి నిర్ణయాలు బేఖాతరు చేయడం, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు నిధులు నిలుపుదల చేయడం, పర్యావరణ పరిరక్షణ చట్టాల నుండి, ఒప్పందాలు నుంచి బయటకు రావడం, ఒబామా హెల్త్ కేర్‌ను ఉపసంహరించడం వంటి నిర్ణయాలు ట్రంప్ ఇమేజ్‌ను పూర్తిగా దెబ్బతిస్తున్నాయి. ఈ విధంగా ట్రంప్ నిర్ణయాలు మంచి కన్నా చెడ్డ ఎక్కువ కలుగుతుంది. ఒకవైపు చైనా అధ్యక్షుడుతో త్వరలో చర్చిస్తాను అని తెలపడం, వెంటనే చర్చలు లేవు అదనపు సుంకాలు 155శాతం విధిస్తామని అంటాడు. నిలకడ లేని స్థితిలో ఉండటం గమనార్హం. ఇకనైనా తన నిర్ణయాలు పునః సమీక్షచేసుకోవడం, ఆచితూచి అడుగులు వేయడం ద్వారానే తన ప్రతిష్టను, అమెరికా ప్రతిష్టను కాపాడుకోవడం జరుగుతుంది. లేని ఎడల అతి త్వరలోనే స్వదేశంలో, అంతర్జాతీయ స్థాయిలో పలుచనయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ట్రంప్ తెంపరితనం ఇకనైనా తగ్గించుకోవడం ఉత్తమం. ప్రపంచంలోనే అతిపెద్ద పురాతన ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే అమెరికా, ప్రస్తుతం తన డాలర్ ప్రాబల్యం ఎలా కోల్పోతుందో, అలాగే భవిష్యత్తులో తన ప్రజాస్వామ్య వైభవాన్ని ఇటువంటి వైఖరిలతో కోల్పోతుంది. ఇక మనదేశం కూడా విదేశాంగ విధానం, దౌత్య విధానం మెరుగు పరుచుకోవాలి. పెట్టుబడిదారీ దేశాలు, సామ్రాజ్యవాద దేశాలతో అప్రమత్తంగాఉండాలి.అలీన విధానంతో ముందుకు సాగాలి. మనదేశంలో కూడా ప్రజాస్వామ్య గొంతుకలను అణిచివేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అన్నిటికీ ఒకేవిధానానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. భిన్నత్వంలో ఏకత్వం గల మనదేశంలో రాజ్యాంగ బద్ధంగా, ప్రజాస్వామ్య సామ్యవాద లౌకికభావనతో పాలన అందించాలి. అప్పుడు మాత్రమే శాంతి, అభివృద్ధి సాకారం అవు తుందని అని పాలకులు గ్రహించాలి. అధికారం ఉందని, అహంకారంతో పోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ●

# ప్రజావాక్కు



### అధ్వానంగా ప్రధాన రహదారులు

రాష్ట్రంలోనిమహబూబాబాద్ జిల్లా కేంద్రం నుండి వయా ఇల్లందుద్వారా కొత్తగూడెం జిల్లా కేంద్రానికి వెళ్లే జాతీయ రహదారి గుంతల మాయమై అధ్వానంగా తయారైంది. ఈ దారి గుండా ప్రతిరోజు వేలాది వాహనాలు వివిధ ప్రదేశాలకు ప్రయాణిస్తుంటాయి. ముఖ్యంగా కరీంనగర్ నిజామాబాద్ హుజురాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, గోదావరిఖని,హనుమకొండ, వరంగల్,నర్సంపేట నుండి భద్రాచలం, విజయవాడకు వెళ్లేవాహనాలు వయా మహబూబాద్, ఇల్లందు ద్వారా వెళుతుంటాయి. గోదావరిలో పుణ్యాసనము ఆచరించి పాపికొండలు పర్ణశాల లాంటి ప్రదేశాలకు భక్తులు ఎక్కువగా వెళుతుంటారు. సుమారు 70 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారి అనేక ప్రాంతాల్లో గోతులమయమై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న పాలకులు స్పందించకపోవడం శోచనీయం.

- కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా

### స్టాఫ్‌ను నియమించాలి

ఆర్మీ స్కూల్‌గా పిలవబడేతెలంగాణ రాష్ట్రంలోని 2 సైనిక్ స్కూల్‌లో ఆర్మీ స్టాఫ్ చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ సైనిక్ స్కూల్ వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని అశోక్ నగర్ సైనిక్ స్కూల్‌లో ఒక్కరే ఆర్మీ స్టాఫ్ ఉంది. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ షెడ్యూల్ క్యాస్ట్ సైనిక్ స్కూల్‌లో అతి తక్కువ ఆర్మీ స్టాఫ్ వుంది. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 2 సైనిక్ స్కూల్‌లో పేద విద్యార్థులు చదువుతున్నారు. కనుక ప్రభుత్వం ఈ స్కూల్‌లో స్టాఫ్‌ను నియమించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### ప్రపంచ శాంతికి పాటుపడాలి

క్వాడ్ ఇటీవల ఒకస్పష్టమైన వైఖరిని తీసుకుంటున్నట్లు తోస్తుంది.అది చైనాకివ్యతిరేకంగా అనిమాత్రమే చెప్పవచ్చు.దానివైఖరి మూలంగానే ఇండోపసిఫిక్ అని అమెరికా తన వాణిజ్య సంబంధాలను మార్చుకుంది. ఇకపోతే కోవిడ్ దరిమిలా చైనా తన ఉత్పత్తి వ్యవస్థలు అతలాకుతల మయ్యాయి. తద్వారా తన ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టంవాటిల్లింది. కానీ తిరిగి పుంజుకొని పాకిస్థాన్ వంటి దేశాల సహాయంతో అది తన ఆధిపత్యం చూపించాలి అనుకుంటుంది.

- భారత అవినాష్, జనగామ

### ముందస్తు చర్యలు అవసరం

ఇటీవల దేశవ్యాప్తంగా ప్రయాణీకుల బస్సుల్లో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఈ ఘోర సంఘటనలు మానవ ప్రాణాల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. బస్సు ప్రయాణం రోడ్లలో సురక్షితమైన మార్గంగా పరిగణించబడినా, ప్రస్తుత పరిస్థితులు జీవన భద్రతకు పెద్ద ముప్పుగా నిలుస్తున్నాయి.ప్రస్తుతం నివేదికల ప్రకారం, ఎక్కువగా పాత, సరిగా రక్షణా ప్రమాణాలు పాటించని బస్సులు ప్రమాదాలకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. డ్రైవర్ల శిక్షణలో కొరత, సాధారణ రక్షణ సాధనాలలో లోపాలు, మురికి, నిబంధనల ఉల్లంఘనలు భద్రతకు ముప్పుగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం,రవాణావిభాగం తక్షణచర్యలు తీసుకోవాలి. ప్రయాణికుల కోసం అవగాహన కార్యక్రమాలు, అత్యవసర మార్గాల సూచనలు,డ్రైవర్ శిక్షణమరింత బలోపేతంచేయడం అవసరం.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### షరా మామూలే

ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి రావాలని ముందు వెనుక ఆలోచించకుండా సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా హామీల వర్షం కురిపేస్తుంటారు పార్టీలకు చెందిన నాయకులు. అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుంటారు. అయితే ఒకరు మోసం చేసినా మరొకరు మంచి చేయకపోతారా అనే ఆశతో ప్రభుత్వాలను మారుస్తుంటారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ల అమలుకు నోచుకోలేదని సూపర్‌సిక్స్ సూపర్‌ఫ్లాప్ అనిఅనుకుంటున్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వ పాలనలో తేడా కన్పించడంలేదు.

-ఎస్.శర్మ, హైదరాబాద్

### సామాజిక బాధ్యత

ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం కోసం ఎంతోమంది వస్తుంటారు. వారితోపాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు వస్తుంటారు. కొందరు ఆరుబయట నిద్రిస్తూ,తిని తినక ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు.వారిలో చాలామంది పేదరికం వల్ల భోజనం కొనలేని పరిస్థితిలో ఉంటున్నారు. వారికి పట్టెదన్నం పెట్టాలి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఇప్పటికే అన్నదానం చేస్తున్నారు కానీ సరిపోవడంలేదు.ఇలాంటి వారికి సహాయం చేయడం మనందరి సామాజిక బాధ్యత.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విజయవాడ వార్త



## రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు: సిఆర్డిఏ కమిషనర్ కన్నబాబు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 22:** ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతులతో నిర్వహించే సిఆర్డిఏ గ్రామసభ నిడమర్రు గ్రామంలో జరిగింది. నిడమర్రు గ్రామసభలో కమిషనర్ కె.కన్నబాబు , అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవతేజ పాల్గొన్నారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ఈ సభలలో రైతులు, స్థానికులు చెప్పిన ప్రతి సమస్యను సిఆర్డిఏ పరిష్కరిస్తుందని కమిషనర్ గారు తెలిపారు. గ్రామంలోని రైతులు ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి కమిషనర్ గారికి వివరించారు. నెగోషియేటెడ్ సెటిల్మెంట్ పాలసీ రహదారి నిర్మాణం కారణంగా నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు, రిటర్నబుల్ ప్లాట్లకు బ్యాంకు లోన్లు మంజూరు కావడంలో ఉన్న సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధి, మంగళగిరి నిడమర్రు రోడ్డు సమస్య తదితర అంశాలపై




రైతులు, స్థానికులు చెప్పిన పలు సమస్యలను సావధానంగా విన్న కమిషనర్ గారు.. కొన్ని సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ కావడంలో ఉన్న సమస్యలను కమిషనర్ గారు క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చి పరిష్కరించారు. మిగిలిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. స్థానిక రైతులు వెల్లడించిన అంశాలపై క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిఆర్డిఏ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్ గారు సూచించారు. రిటర్నబుల్ ప్లాట్లకు బ్యాంకు లోన్లు మంజూరయ్యేలా



గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు బ్యాంకు అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. మంగళగిరి నిడమర్రు రోడ్డు సమస్యను సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామన్నారు. నిడమర్రులో అందుబాటులో ఉన్న భూములలో రానున్న రోజులలో భారీ ఎత్తున ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, కాలుష్యం విడుదల చేయని పరిశ్రమలు ఏర్పాటవుతాయన్నారు. రాజధాని గ్రామాలలో రూ.940 కోట్లతో మౌలికవసతులు అభివృద్ధి చేసేలా దీశిళి సిద్ధం చేస్తున్నామన్నారు. రైతులకిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేసి రైతులకు అందజేస్తామన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సిఆర్డిఏ సామాజిక సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో జాబ్ మేళాలు, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గ్రామస్తులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ గారు సూచించారు. గిదీళి బాండ్లను ఆన్లైన్ విధానంలో పారదర్శకంగా జారీ చేస్తామన్నారు. సదరు సభలో సిఆర్డిఏ కమిషనర్ గారు సమస్యలను పరిష్కరించే విధానంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కమిషనర్ కోరారు. గ్రామంలో సుమారు 450 ఎకరాలకు పైగా ఉన్న భూమిని భూసమీకరణ పథకం(లిశిళీ) కింద రాజధాని నిర్మాణానికి అందజేయాలని కమిషనర్ గామస్తులను కోరారు. రాజధాని అభివృద్ధి కొరకు భూసమీకరణ కింద భూములు అందజేయని పక్షంలో భూసేకరణ విధానం అమలు చేస్తామని కమిషనర్ గారు పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంలో రైతులు, భూయజమానులు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ గారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కమిషనర్ గారు, సిఆర్డిఏ అధికారుల విజ్ఞప్తికి రైతుల నుంచి సానుకూల స్పందన లభించింది. గ్రామసభలో డైరెక్టర్ ల్యాండ్స్(క్యాపిటల్ సిటీ) వసంతరాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి. రవీందర్, కమ్యూనికేషన్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ జి.రామరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జగన్ పుట్టుకతోనే నేరస్థుడు

... ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 22:**రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆరోపించారు. బుధవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్ నేరాలు చేస్తాడు, నేరస్థులను ప్రోత్సహిస్తాడని విమర్శించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపాడు గ్రామంలో ప్రపంచానికే విజ్ఞాన దిక్సూచిగా నిలిచిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని నిప్పు పెట్టి, తాము సుద్ధపూసలమని, ఏమీ తెలియదన్నట్టు నాటకాలాడారు. వైసీపీ సర్పంచ్ గోవిందప్ప రాత్రికి రాత్రి అంబేద్కర్ విగ్రహానికి పెట్రోల్ పోసి తగలబెట్టాడు. తర్వాత పోలీసులకు ఫోన్ చేసి, గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగలబెట్టారని అబద్ధం చెప్పాడని ఆరోపించారన్నారు.. మరుసటి రోజు మాజీ మంత్రి నారాయణస్వామి, వైసీపీ నేత కరుణాకర్ రెడ్డితో



కలిసి పెద్ద ఎత్తున ధర్నా పేరుతో డ్రామాలాడారని అన్నారు. . సీసీ కెమెరాలు, డాగ్ స్క్వాడ్ పరిశీలనలో గోవిందయ్య దొరికిపోవడంతో వారి నాటకం బట్టబయలైందని తెలిపారు. ఏమీ ఎరగనట్టు ధర్నా చేయడం, నటించడంలో వైసీపీ నాయకులకు సాటి లేరు. బాబాయ్ ని చంపించి చంద్రబాబునాయుడు చేతిలో కత్తి పెట్టి నారాసురరక్త చరిత్ర అని కమల్ హాసన్ ను మించి జగన్ యాక్టింగ్ చేశారని,. జగన్ కమల్ హాసన్ మించి యాక్టింగ్ చేస్తే.. జగన్ మించిన యాక్టింగ్ చేసిన వ్యక్తి గోవిందప్ప అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని కి నిప్పు పెట్టిన వైసీపీ సర్పంచ్ గోవిందప్ప ను జగన్ ఎందుకు సస్పెండ్ చేయలేదు..? రాష్ట్రంలో వైసీపీ పోకడలు అతి జుగుప్సాకరంగా ఉన్నాయని మండిపడ్డాడు. దళితులు నా మేనమామలు అంటూనే గత ఐదేళ్ల దళితుల గొంతులు కోశారన్నారు. జగన్ తన కారుతో రోడ్లపై దళితుల తలలు తొక్కించుకుంటూ వెళ్లారని,. జగన్ పుట్టుకతోనే నేరస్థుడు. తన సొంత బాబాయిని చంపి చంద్రబాబుపై నెట్టాలని చూశారని అదేవిధంగా అంబేద్కర్ విగ్రహాన్ని కాల్చి, ఈ పని కూటమి ప్రభుత్వానిదని నమ్మబలుకు ప్రయత్నం చేశారు. జగన్ రెడ్డి నేరస్థుల ముఠా గురించి చాంతాడంత చెప్పవచ్చు. వైసీపీ నాయకులది టెర్రరిస్టుల స్వభావం. రాజకీయ ముసుగు వేసుకుని చేయరాని పనులన్నీ చేస్తున్నారన్నారు.

## పెట్టుబడిదారులకు ముహూర్తం ట్రేడింగ్ దీపావళి



విజయవాడ, ప్రభాతవార్త అక్టోబర్ 22 : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్లో, ప్రతి పెట్టుబడిదారుడు విశ్వాసం, బాధ్యతతో వృద్ధి చెందే పారదర్శక, సమ్మిళిత వాతావరణాన్ని పెంచడం పట్ల మేము నిబద్ధతగా ఉన్నామని ముహురత్ ట్రేడింగ్ యమ్.డి.మరియు యన్.యస్.ఇ ఆశిష్ కుమార్ చౌహాన్ ట్వీట్చేశారు. ఈ పండుగ ప్రతి ఒక్కరికీ సంపద, ఆరోగ్యం, ఆనందం, శాంతి తేవాలని కోరుతూ అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వాసం, జ్ఞానం, క్రమశిక్షణతో మన ఆర్థిక ప్రయాణాన్ని రూపొందించేలా సమయం, పెట్టుబడి పెడితే సంపదను సృష్టించి భారతదేశం అద్భుతమైన ఆర్థిక వృద్ధి గాథలో భాగం కావడం కూడా అని "ఎక్కువ మంది ప్రజలు మూలధన మార్కెట్లలో వారి విశ్వాసాన్ని పెంచడానికి, దీర్ఘకాలిక శ్రేయస్సును సాధించడానికి పెట్టుబడిదారులఅవగాహన మరియు సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం చాలా కీలకమని కొత్త ప్రారంభాల స్ఫూర్తితో, జ్ఞానం మన ఎంపికలకు మార్గనిర్దేశంచేస్తామన్నారు.

## విజయవాడలో గ్లోబై కీర్తిలాల్స్ రిటైల్ షోరూం ప్రారంభం

విజయవాడ, అక్టోబర్ 22, ప్రభాతవార్త: వజ్రాల ఆభరణాల పరిశ్రమలో ప్రసిద్ధ సంస్థ గ్లో బై కీర్తిలాల్స్ విజయవాడలో తన 8వ రిటైల్ షోరూమ్ ను ఎంజీ రోడ్డు దరి కళానికేతన్ ఎదురుగా



సంస్థ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండ్ విస్తరణకు మరియు సున్నితమైన, అధిక నాణ్యత గల సహజ వజ్రాల ఆభరణాలను మరింత విస్తృత వినియోగదారుల వర్గానికి అందించే లక్ష్యం తో ప్రారంభించిన ఈ షోరూంలో జెన్ జెడ్ వినియోగదారుల అభిరుచి మేరకు ఆధునిక డిజైన్లు అందిస్తామన్నారు. తేలికపాటి సహజ వజ్రాల ఆభరణాల అద్భుత సేకరణ రూ.7వేల నుంచి ప్రారంభమవుతాయన్నారు. యువతకు ఆధునిక సౌందర్యాన్ని కాలాతీత సొగసుతో మిళితం చేస్తూ, రోజువారీ ధారణకు మరియు ప్రత్యేక సందర్భాలకు సముచితంగా ఉండేలా రూపొందించామన్నారు.

## అమరావతిలో రూ.100 కోట్లతో ప్రపంచ స్థాయి గ్రంథాలయం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 22:** దుబాయ్ లోని ప్రముఖ సంస్థ శోభా రియాల్టి అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంధాలయం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. రూ.100 కోట్ల విరాళంతో వరల్డ్ క్లాస్ లైబ్రరీని నిర్మించనుంది. ఏపీలో పెట్టుబడి అవకాశాలు వివరించేందుకు దుబాయ్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుతో ఆ దేశంలోని శోభా రియాల్టి ఫౌండర్ ఛైర్మన్ పీఎన్సీ మీనన్ తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో లైబ్రరీ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రితో చర్చించారు.

**విరాళం ప్రకటించిన దుబాయ్ సంస్థ**
**శోభా గ్రూప్ ఛైర్మన్ పీఎన్సీ మీనన్**
**... ఏపీలో రియాల్టి రంగంలో పెట్టుబడుల అవకాశాలు**
**...దుబాయ్ ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూప్ ఛైర్మన్ తో సీఎం చంద్రబాబు**

శోభా రియాల్టి సంస్థ అమరావతిలో ప్రపంచ స్థాయి స్టేట్ లైబ్రరీ నిర్మించేందుకు ముందుకు రావటంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయం




నిర్మాణానికి ఇంత పెద్ద మొత్తంలో విరాళం ప్రకటించటంపై ధన్యవాదాలు తెలియచేశారు. అమరావతిని ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా నిర్మిస్తున్నామని సీఎం ఆయనకు వివరించారు. రాజధాని నిర్మాణంలో శోభా రియాల్టి సంస్థ కూడా భాగస్వామి కావాలని ఆహ్వానించారు. ఏపీకి వచ్చి రాజధాని నిర్మాణాన్ని పరిశీలించాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయిలో నగరాలు నిర్మితం అవుతున్నాయని వాటితో సమానంగా మౌలిక సదుపాయాలతో అమరావతిని నిర్మిస్తున్నట్టు సీఎం వివరించారు. గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రాన్ని చిరునామాగా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు శోభా గ్రూప్ ప్రతినిధులకు చంద్రబాబు వివరించారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, విశాఖలో గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటు అవుతోందని చంద్రబాబు చెప్పారు.





దుబాయ్ ఫ్యూచర్ మ్యూజియంను మంత్రులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు సందర్శించారు. దీన్ని లివింగ్ మ్యూజింగ్గా రూపొందించారు. అంతరిక్షం, వాతావరణం, ఆరోగ్యం, విద్య, వైద్యం, ఏఐ వంటి రంగాల్లో భవిష్యత్ ఆవిష్కరణలు ఏవిధంగా ఉండబోతున్నాయనేది టెక్నాలజీని ఉపయోగించి మ్యూజియంలో ప్రదర్శణలు చేస్తున్నట్లు అక్కడి అధికారులు వివరించారు. ఫ్యూచర్ జర్నీ పేరుతో ఏర్పాటు చేసిన ఎక్స్పీరియన్స్ జోన్ను సీఎం చంద్రబాబు సందర్శించారు.
(గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)



గోల్డ్ కోస్ట్, బ్రిస్బేన్ పర్యటన ముగించుకొని బుధవారం మెల్బోర్న్ చేరుకున్న విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్.లోకేష్ కు మెల్బోర్న్ లో ఘన స్వాగతం పలికిన తెలుగు ప్రవాసాంధ్రులు
(గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## మంత్రి నారా లోకేష్ కృషితోనే ఆక్వా రైతులకు ఆస్ట్రేలియా మార్కెట్లో ఊరట

మాజీ ఎమ్మెల్సీ, సిఎం కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణ రాజు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 22:** రొయ్యలు సాగు చేసిన రైతు మీసం తిప్పేలా చేసిన యువనేత నారా లోకేష్ బాబు. ఒకవైపు యువత, మరోవైపు రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్న విషయం మంత్రి నారా లోకేష్ బాబు ఆస్ట్రేలియా పర్యటన ద్వారా మరోసారి స్పష్టమైంది. ఆక్వా రైతులు ఎగుమతులు లేక నష్టపోతున్న సమస్యను అధిగమించేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయం. ఆక్వా రైతుల పట్ల మంత్రి నారా లోకేష్ బాబు నిబద్ధత, దూరదృష్టి వల్లే ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతులకు అంతర్జాతీయ మార్కెట్లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఆస్ట్రేలియా మార్కెట్లో ప్రవేశం సాధించడం రాష్ట్ర ఆక్వా రంగానికి మైలురాయిగా నిలిచింది. అమెరికా భారీ సుంకాలు, అనేక అడ్డంకుల మధ్య కూడా రెండు దేశాల ప్రభుత్వాల మధ్య సఖ్యత సాధించి, ఆక్వా రైతులకు కొత్త జీవం పోయడం ప్రశంసనీయమని, ఇది భారతదేశానికే గర్వకారణం అని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలతో ఏపీ ఆక్వా రంగం ప్రపంచ చిత్ర పటంలో మరింత బలంగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఆక్వా రైతు క్షేమం కోసం కట్టుబడి ఉందని, ఆక్వా రైతులు ఆర్థికంగా బలంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నేడు యువనేత చొరవతో అమెరికా సుంకాల కారణంగా ఆర్థికంగా కుదేలైన ఆక్వా రంగం, ఆక్వా రైతులకు ఆస్ట్రేలియా తీసుకున్న ఈ నిర్ణయం ఊరటనిచ్చిందని పేర్కొన్నారు.

## జగన్ హయాంలో కల్తీ మద్యం వల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోయారు: చీఫ్విప్ జీ.వీ


**వినుకొండ,అక్టోబర్22,ప్రభాతవార్త:** రాష్ట్రంలో కల్తీ మద్యం అన్నమాటే వినిపించకూడదన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఏపీ ప్రభుత్వ చీఫ్విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జగన్ హయాంలో కల్తీ మద్యం సేవించి అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. కల్తీ మద ్యం విక్రయాలు చేసేవారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. మద్యం కొనుగోలుదారులు సురక్షయాప్ వినియోగంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 29వ తేది నుంచి వారం రోజులుపాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నటు పేర్కొన్నారు. ఎక్సైజ్



అధికారులు,నాయకులు,ప్రజలందరూ కలసి నకిలీ మద్యం నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తే లైసెన్స్ రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

## పురమిత్ర యాప్ ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 22,ప్రభాతవార్త: దోమల నివారణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ప్రజారోగ్య మలేరియా సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్లలో భాగంగా కల్వర్టలలో ఫాగింగ్,సైడ్ డ్రైన్లలో ఎంఎల్ ఆయిల్ స్ప్రే,బుడమేరు కాలువలో గుర్రపు డెక్కలు బోట్ల సహాయంతో తొలగించచారు. ఏలూరు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను ట్రక్కర్ మెషిన్లతో తొలగించి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా దోమల నిర్మూలనకై చర్యలు తీసుకున్నారు.



బుధవారం ఉదయం కోటినగర్,రామకృష్ణాపురం,అజిత్సింగ్నగర్,గాంధీనగర్ ప్రాంతాలన్నీ బయాలజిస్ట్ కామేశ్వరరావు పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఏఎల్ఓ,పిడిపి చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతాల్లో ప్రజలు నివసిస్తున్న ఇళ్ళ పరిసరాల్లో ఉన్న డ్రమ్ములలో పూలకుండీలలో ఖాళీ స్థలాల్లో టైర్లలో,ట్యాంకులలో నిల్వ నీరును తొలగించి పిడిపి చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ పి.కామేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి లార్వా ఆపరేషన్లు,పిడిపి ఆక్టివిటీలు నగరం మొత్తం క్రమం తప్పకుండా చేసుకొస్తున్నారని,తద్వారా దోమలను నిర్మూలించి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇనస్పెక్టర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు శాఖలో పిజికల్ ఫిట్నెస్ ఎంతో అవసరం : సిపి రాజశేఖరబాబు

విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 22,ప్రభాతవార్త: పోలీసు శాఖలో ఫిజికల్ ఫిట్నెస్ ఎంతో అవసరమని, వ్యాయామం,క్రీడలు,పోలీసుల్లో మరింత ఉత్తేజాన్ని నింపుతాయని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. పోలీసు సిబ్బందితో మానసిక,శారీరక ఉత్సాహాన్ని పెంపొందించడానికి స్పోర్ట్స్ కిట్లను ఆయన తన చేతుల మీదుగా అందచేశారు. క్రీడలు ఆడటం వలన క్రమశిక్షణ వస్తుందని, ప్రతి మనిషి దైనందిన జీవితంలో ఏదో ఒక వ్యాయామం తప్పనిసరని,తద్వారా శారీరకంగా మానసికంగా ఉత్సాహంగా ఉంటారని పోలీసులు శారీరక ఆరోగ్యంతో పాటు మానకికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడు వారి కుటుంబాలు సంతోషంగా ఉంటాయనే ఉద్దేశ్యంతో సిపి రాజశేఖరబాబు క్రీడలో పాల్గొనేందుకు సిబ్బందిని ఉత్సాహపర్చడానికి పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.65వేలు నగదుతో రెండు వాలీబాల్ కిట్స్,రెండు క్రికెట్ కిట్స్లను,నాలుగు ఫుట్బాల్స్,బాట్మెంటన్ కిట్స్ను కొనుగోలు చేయించారు. వాటిని ఆయనతో పాటు అడ్మిన్ డిసిపి కెజివి సరిత,పోలీసు సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ క్రీడలు పోలీసుల్లో మరింత ఉత్తేజాన్ని నింపుతాయని, క్రీడలతో మనకి తెలియకుండానే మానసికంగా ధృఢత్వాన్ని పొందుతామన్నారు. ప్రజల్లో పోలీసులపై అంచనాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని అందరూ వ్యాయామం,క్రీడల్లో పాల్గొని ఫిజికల్ ఫిట్నెస్ పెంచుకొని ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిపి ఎన్విడి ప్రసాద్,ఏసిపిలు భానుప్రకాష్రెడ్డి,కృష్ణంరాజు, సిఐలు,ఆర్ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.



## కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రూ.665 కోట్ల నిధుల విడుదల

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 22:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా రూ.665 కోట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ విడుదల చేసింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.166 కోట్లు జత చేసింది. మొత్తంగా రూ.831 కోట్ల నిధులతో ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి ఉన్న పెండింగ్ బిల్లులు క్లియర్ చేసే వెసులుబాటు కలుగుతుంది. రాష్ట్రంలో పంచాయతీ భవనాల నిర్మాణం, రికార్డులు కంప్యూటరీకరణ, సిబ్బంది, ప్రజా ప్రతినిధులకి శిక్షణ, ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్.జి.ఎస్.ఏ.) ద్వారా రూ.50 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు జత చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికీ, గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి నేతృత్వంలోకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్కృతజ్ఞతలు తెలియచేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిశివరాజ్ సింగ్ చౌహాన్కి, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిలలన్ సింగ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## భవిత సెంటర్ విద్యార్థులకు దుప్పట్లు పండ్లు పంపిణీ



పెదనందిపాడు అక్టోబర్ 22 (ప్రభాతవార్త) మండల విద్యా వనరుల కేంద్రంలో ఉన్న భవిత సెంటర్లో ప్రత్యేక అవసరాలు గలిగిన విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారని. వారికి దాతలు పలు విధాలుగా సహకరించడం ప్రశంసనీయమని పెదనందిపాడు మండల విద్యాశాఖ అధికారి 2. పి జాకబ్ అన్నారు. ఈ విద్యార్థులకు తాను పలు రకాలుగా సహాయ సహకారాలు అందించటమే కాక. మరికొందరి దాతలచేత కూడా ఈ విద్యార్థులకు సహాయ సహకారాలు అందజేస్తున్న స్ఫూర్తి దాత. అంగన్వాడి టీచర్ అమరేశ్వరి సేవలు ప్రశంసనీయమన్నారు. బుధవారం అమరేశ్వరి నేతృత్వంలో దాత కమ్మ గీత హారిక. ప్రత్యేక అవసరాలు గలిగిన 25 మంది భవిత విద్యార్థులకు దుప్పట్లు పండ్లు ఎంఈఓ జాకబ్ ద్వారా అందజేశారు .ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ స్కూల్ ఐ ఈ ఆర్ టి ఉపాధ్యాయులు, కెవిఎస్ పూర్ణచంద్రరావు,ళీ పరిమళ, ఏ డబ్ల్యు డబ్ల్యు నాగమణి. వెంకాయమ్మ. సంతోషం.మరియు భవిత సెంటర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు22, ప్రభాతవార్త: రాష్ట్రంలోని విద్యార్థి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరిని ఎండగడుతూ ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు తలపెట్టిన బస్సు యాత్ర పోస్టర్‌ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణాంజనేయులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఇన్‌చార్జ్ పాలెం నాసరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గమనించకుండ పాలన కొనసాగిస్తుందని అన్నారు. జీఓ నెంబరు 77 పేద విద్యార్థులకు భారంగా మారిందన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులు సర్టిఫికెట్‌లు పొందడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల్లో శాశ్వత అధ్యాపకుల కొరత వల్ల నాణ్యమైన విద్య అందడంలేదని వాపోయారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బస్సు యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంలో ప్రధాన కార్యదర్శి అఖిల్, ఉపాధ్యక్షులు జాన్‌సైదా, గణేష్, డేవిడ్, నరేంద్ర, ట్రెజరర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బి.ఆర్క్ ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు22, ప్రభాతవార్త: ఏఎన్‌యు పరిధిలో బి.ఆర్క్ కోర్సు 1/5 మొదటి సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు బుధవారం విడుదల చేశారు. 5గురికి 5మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 38మందికి 34మంది పాస్ అయ్యారు. ఎంబిఏ కోర్సు రెండవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 754మంది పరీక్షలు రాయగా వారిలో 610 ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యూయేషన్‌కు నవంబరు 3లోగా ఒక్కో పేపర్‌కు రూ.2070 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**నానో టెక్నాలజీ ఫలితాలు:** యంఎస్సీ నానో టెక్నాలజీ కోర్సు 1/5 రెండవ సెమిస్టర్‌కు జూలైలో జరిగిన పరీక్షల్లో 5గురికి ఒకరు ఉత్తీర్ణత సాధించారు.

**ఫార్మా.డి, యంయిడి రీవాల్యూయేషన్ ఫలితాలు:** వర్సిటీ పరిధిలో ఫార్మా.డి కోర్సు 2,3,4,5 సంవత్సరాల రీవాల్యూయేషన్ ఫలితాలను సిఇ విడుదల చేశారు. అలాగే యంయిడి కోర్సు 4వ సెమిస్టర్ రీవాల్యూయేషన్ ఫలితాలను కూడా ఆయన విడుదల చేశారు.

## 24న ఫ్రైడ్ ప్రోగ్రాం సెలక్షన్స్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు22, ప్రభాతవార్త: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని భారత పార్లమెంట్ నవంబరు 11న ఫ్రైడ్ ప్రోగ్రాంను నిర్వహిస్తుందని ఏఎన్‌యు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌మార్ తెలిపారు. ఈ ప్రోగాంలో వర్సిటీ నుంచి ఇద్దరిని (1 బాలురు,1 బాలిక) ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకుగాను వర్సిటీలో ఈనెల 24న ఉదయం 11.30గంటలకు ఎడ్యుకేషన్ విభాగంలో వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ లైఫ్ అండ్ కాంట్రిబ్యూషన్స్ అనే అంశంపై పోటీలు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎడ్యుకేషన్ విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ యం.వసంతరావు (9848519890) ను సంప్రదించాలని సూచించారు.

## అభివృద్ధి పథంలో ప్రగతి నగర్



గుంటూరు వెస్ట్,అక్టోబర్ 22,ప్రభాతవార్త : సంక్షేమాభివృద్ధి పథంలో కూటమి పాలనసాగుతోందని ప్రగతి నగర్ రూపురేఖలు మారుస్తున్నామని తూర్పుఎమ్మెల్యే నసీర్ అన్నారు.స్థానిక ప్రగతి నగర్‌లో రూ.40లక్షలతో పైపులైన్లు,కొండయ్య కాలనీలో రూ.60లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు డిప్యూటీ మేయర్ షేక్ షాజిలా,కార్పొరేటర్ ఎల్లవుల అశోక్,ఐల శ్రీను,డివిజన్ అధ్యక్షులు బట్ట రాజా,మాదాసు శేఖర్,రామకృష్ణ,బాజీ, సుబ్బారావు, కొండలు,తిరుమలరాజు,మధుసూదనరావు,పవన్,కాంతారావు,సైదా,ఖలీల్,ఖతిజా పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరులకు నివాళులర్పించిన తూర్పు ఎమ్మెల్యే నసీర్



ప్రజాస్వామ్య పరిరక్షణే పరమావధిగా,సమాజ శ్రేయస్సే ఊపిరిగా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించే పోలీసు అమర వీరుల త్యాగం చిరస్మరణీయమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.స్థానిక పోలీసు అమరవీరల స్థూపం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు.కుటుంబానికి దూరంగా సమాజం కోసం అహర్నిశలు శ్రమించే పోలీసులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు.గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాల విక్రయాలు పెరిగిపోగా,దీంతో నేరాలు అదుపు ఉండేవని చెప్పారు.ప్రస్తుతం ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్న పోలీసు వారికి ఈ సందర్భంగా సెల్యూట్ చెప్పారు.

## ఆర్‌విఆర్‌జేసి కళాశాల 14మంది ఎంబిఏ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు



గుంటూరు విద్య,అక్టోబర్ 22,ప్రభాతవార్త : ఇటీవల కళాశాల్లో క్యాంపస్ ఐటి సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 14మంది ఎంబిఏ విద్యార్థులు ఎంపికై బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్ హోదాలో రూ.5 నుంచి 6లక్షల వార్షిక ప్యాకేజీ,ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.15000స్టైపండ్ కూడా కంపెనీ అందించనుందని ఆనందయానందమని,ఎంబిఏ విద్యార్థులు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకబలంగా నిలుస్తున్నారని ఆర్‌విఆర్ జెసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం,అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది,తదితరులు అభినందించారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో ముందడుగు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు వెస్ట్,అక్టోబర్ 22,ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గంలో మహిళల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో ముందుకు వెళ్తున్నామని ఇందులో భాగంగానే ప్రతి మంగళవారం "మహిళా గ్రీవెన్స్ డే" నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్ డే ను నిర్వహించి మహిళల నుండి వినతిపత్రాలు స్వీకరించి,వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా కొబాల్ట్ పేట 6వ లైనులో పీకలాను మీద ఆక్రమణ ఇల్లు నిర్మించుకోవడం వలన మురుగునీరు ప్రవాహానికి అడ్డంకిగా ఉండడంతో ఈ మురుగునీరు తమ ఇళ్లలోకి చేరుతోందని దీనిపై చర్యలు తీసుకోవాలని కొంతమంది మహిళలు వినతిపత్రం అందజేశారు.

## పురమిత్ర యాప్‌తో నగరపాలక సంస్థ సేవలు విస్తృతం



గుంటూరు నగరపాలక సంస్థ,అక్టోబర్ 22,ప్రభాతవార్త : పురపాలక సేవలను ఇంటి వద్ద నుండే ఫోన్‌ద్వారా పొందడానికి వీలుగా రూపొందించిన పురమిత్ర యాప్‌ని గుంటూరు నగరవాసులు విస్తృతంగా ఇప్పటికే 25వేల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం తెలిపారు.పురమిత్ర యాప్ ద్వారా సుమారు 122రకాల పురపాలక సేవలను చేతిలోని ఫోన్ ద్వారా పొందవచ్చన్నారు.కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలను పొందే యాప్‌ని నగర ప్రజలు విస్తృతంగా డౌన్‌లోడ్ చేసుకొని వినియోగిస్తున్నారన్నారు.సేవల కోసం దరఖాస్తులు ఎప్పటికప్పుడు వాటి పరిష్కార స్థితిని తెలుసుకోవడానికి ట్రాకింగ్ కూడా ఉండడం వలన ప్రజలకు తమ సమస్య,లేదా తమ దరఖాస్తు స్థితి తెలుసుకోవచ్చన్నారు.

## బిహెచ్‌ఎఫ్ మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

గుంటూరు నగరపాలక సంస్థ,అక్టోబర్ 22,ప్రభాతవార్త : బ్రైట్ హారిజన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూఘర్‌లో జరిగిన మెగా జాబ్ మేళాకు అభ్యర్థుల నుంచి విశేషస్పందన వచ్చింది.వివిధ ప్రాంతాలనుండి అభ్యర్థులు పెద్దఎత్తున జాబ్ మేళాలో పాల్గొన్నారు.దాదాపు 40కంపెనీలు పాల్గొని ఆయా అభ్యర్థులకు అర్హతల బట్టి పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇవ్వడానికి సిద్ధపడ్డాయి.ఫౌండేషన్ ఛైర్మన్ ఎంకెఎస్ మొహియుద్దీన్ ఆయన బృందం జాబ్ మేళాకు విశేషంగా కృషిచేశారు.తూర్పు ఎమ్మెల్యే నసీర్ కార్యక్రమానికి హాజరై అభ్యర్థులకు ఉద్దేశించి మాట్లాడారు.కొంతమంది అర్హులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.అభ్యర్థులతోపాటు వారి తల్లిదండ్రులు,బంధువులు కూడా ఉర్దూ ఘర్‌కు రావడం పెద్దఎత్తున అభ్యర్థులతో ఉర్దూఘర్ రెండు సమావేశ మందిరాలు కిక్కిరిసి పోయాయి.పలు కంపెనీల సీఈఓ. 40ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులను సమన్వయ పరుచుకొని వాళ్లందరిని ఒకే వేదికపై తీసుకొచ్చి మెగా జాబ్ మేళా నిర్వహణకు తోడ్పాటును అందించినందుకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రక్తహీనత రాకుండా పోషకాహారం తీసుకోండి

తిరువూరు, అక్టోబరు 22, ప్రభాతవార్త : తిరువూరు పట్టణంలో బుధవారం బేటి బచావో బేటి పడావో కిషోర్ వికాసం 2.0లో భాగంగా బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు 11 నుండి 18





వయసు గల ఆడపిల్లలను కిషోరి బాలికలని క్రమశిక్షణ నడవడిక వంటి విషయాలను రక్తహీనత రాకుండా తీసుకోవలసిన పోషకాహారము అలాగే ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని శాంతినగర్ మహిళా పోలీస్ విజయలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి.సుశీల, పి.సుశీల కృష్ణకుమారి పాల్గొన్నారు.

## డిఏ ప్రకటన హర్షణీయం

తిరువూరు, అక్టోబరు 22, ప్రభాతవార్త : ఏ.పి.పి.టి.డి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు తిరువూరు డిపో కమిటీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి, ఒక డిఏ ప్రకటించి మరియు ఆర్టీసి ఉద్యోగులకు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లు అమల్లోకి వచ్చే జివోలు ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఆర్టీసి ఎండి, విశేష కృషి



చేసిన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జివి నర్సయ్య మరియు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన బకాయిలు, వేతన సవరణ, ఐ.ఆర్ ప్రకటన త్వరగా చేయాలని మరియు స్త్రీ శక్తి పథకం అమలు తరువాత విపరీతంగా పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని, కొత్త సిబ్బంది నియామకాలు చేపట్టాలని డిపోలో వెంటనే డ్యూటీ చార్ట్‌లు వేయాలని కోరారు. రీజనల్ ఉపాధ్యక్షులు యంవికె రావు, డిపో అధ్యక్షులు రామకృష్ణ, డిపో కార్యదర్శి పి. కె రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.హరిబాబు, ఎన్.ఎస్.స్వామి, స్టాలిన్ బాబు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వెనక్కు తీసుకోవాలి



చేబ్రోలు(పొన్నూరు), అక్టోబరు 22,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణను తక్షణమే వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ చేబ్రోలు మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళశ్రీరామిరెడ్డి డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైకాపా అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి పిలుపు మేరకు జరుగుతున్న కోటి సంతకాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలకు కూడా వైద్య విద్యను అందించేందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి 17మెడికల్ కళాశాలలను తీసుకొచ్చి, అందులో కొన్నింటిని నిర్మాణం చేసి వినియోగంలోకి తెస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన వాటిని నిర్మించకపోగా అన్నీ కళాశాలలను, వైద్య శాలలను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడం దుర్మార్గమైన చర్య అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బద్దూరి భాస్కరరెడ్డి, కొల్లి శేషిరెడ్డి, గాదె కేశవరెడ్డి, బి.అప్పిరెడ్డి, ఇంటూరి సాంబిరెడ్డి, మాదిరెడ్డి అంజిరెడ్డి, భవనం పుల్లారెడ్డి, తాటి హరికృష్ణ, గట్టుపల్లి పోలేశ్వరరావు, మహిళా నాయకులు వై.మమత, ఆర్.శ్రీదేవి,, శ్రీరెడ్డి,, జ్యోతి తదితరులున్నారు.

## విద్యార్థులు వ్యవసాయం గురించి తెలుసుకోవాలి

పొన్నూరు, అక్టోబరు 22,ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతోపాటు వ్యవసాయ రంగం పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని సూచించారు. చేబ్రోలు




మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలో స్కూల్ స్థాయి హెల్త్ ప్రోగ్రామ్-2025ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ భూసార పరీక్షలను చేయించడం ద్వారా భూమి స్వభావం తెలుస్తుందన్నారు. అప్పుడు ఏ పంట వేయాలనే నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా భూసార పరీక్షా కేంద్రం అధికారి ఝాన్సీ రాణి మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ విధానం, జాగ్రత్తలు, పరీక్షల ద్వారా 12రకాల పారామీటర్ల నేల స్వభావం, ఉదజని సూచిక, లవణ సూచిక, సేంద్రియ కర్బన్, నత్రజని, పాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం, సల్ఫర్, జింక్, ఐరన్ మాంగనీస్, కాపర్ వంటి పోషకాల లభ్యతను గుర్తించవచ్చన్నారు. పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు, ఎస్‌టిఎల్‌ఏఓ ఝాన్సీ రాణి, శ్రీరంజని, అరుణ, విస్తరణాధికారి మోహన్, విహెచ్‌ఏ కె.విజయకుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఇరువురు మహిళలు దుర్మరణం




పొన్నూరు, అక్టోబరు 22,ప్రభాతవార్త: జీవనోపాధి కోసం పొలం పనులకు వెళ్ళిన ఇరువురు మహిళలు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పట్టణంలోని ఇటికంపాడురోడ్డు, బాడువ డొంకలోని పొలాల్లో కూలి పనికి కొంత మంది వెళ్ళారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుంది. మధ్యాహ్న సమయానికి వర్షం ఎక్కువ కావడం, అందుకు తోడు ఉరుములు, మెరుపులతో పాటు పిడుగు కూడా పడడంతో ఇరువురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. 23వ వార్డుకు చెందిన వలపర్ల కమలమ్మ(మరియమ్మ)(45)27వ వార్డుకు చెందిన షేక్ ముజాయిదా(50)అక్కడికక్కడే మృతి చెందారు. 23వ వార్డుకు చెందిన నీలం మాణిక్యం అనే మహిళ స్పృహ తప్పి పోడియింది. ఆమెను 108అంబులెన్స్‌లో నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి వెళ్ళి మృత దేహాలను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పిడుగుపాటుకు గురైన మహిళల మృత దేహాలకు తక్షణమే పోస్టు మార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించాలని వైద్యులను ఆదేశించారు. ఈ విషయం గురించి తెనాలి సబ్ కలెక్టర్‌కు జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయాన్ని అందించే విధంగా అధికారులు చొరవ చూపాలని కోరారు.

## అన్నపర్రు బీసీ వసతి గృహాన్ని పరిశీలించిన బాపట్ల జడ్జి శ్యాంబాబు



పెదనందిపాడు అక్టోబర్ 22 (ప్రభాతవార్త)పెదనందిపాడు మండలంలోని అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహాన్ని బుధవారం సాయంత్రం బాపట్ల ఆరవ అదనపు జడ్జి శ్యాంబాబు పరిశీలించారు. గుంటూరు జిల్లా జడ్జి మరియు స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ వారి ఆదేశాల మేరకు వసతి గృహంలోని పరిస్థితులను వారు పరిశీలించారు. ఇటీవల వసతి గృహంలో ఫుడ్ వాటర్ఫాయిజింగ్ జరిగి విద్యార్థులు ఆసుపత్రి పాలైన విషయం గురించి అందుకు గల కారణాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సంఘటన జరిగిన ముందు రోజు, ఆరోజు విద్యార్థులు తిన్న భోజనం తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. వసతి గృహంలో ఉన్న మోలిక వసతులను, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ రిపోర్టును గౌరవ గుంటూరు జిల్లా జడ్జి . స్టేట్ సర్వీస్ అథారిటీ వారికి వివరాలతో కూడిన రిపోర్టును అందిస్తామని తెలిపారు. వారి వెంట అడిషనల్ జడ్జి శ్యామల. ఎంపీడీవో స్వామి రెడ్డి. పెదనందిపాడు ఎస్ఐ మధు పవన్ తదితరులు ఉన్నారు.

## పెదనందిపాడులో వైసిపి కోటి సంతకాల సేకరణ



పెదనందిపాడు అక్టోబర్ 22 (ప్రభాతవార్త): ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా మరియు ప్రజల వైద్య ఆరోగ్య భద్రత కోసం పెదనందిపాడు ఎస్సీ కాలనీలో కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వైసిపి కన్వీనర్ షేక్ ఖాసిం పీరా మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ఆశయాల మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలను శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడం కాకుండా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేసి ప్రజలపై పెనుబారం మోయాలని చూస్తుందన్నారు జిల్లా సంస్కృతిక విభాగం కన్వీనర్. చెరుకూరి సాంబశివరావు.ఏ బి పాలెం సొసైటీ మాజీ అధ్యక్షులు కూరేటి భూషయ్య, పెదనందిపాడు సర్పంచ్ పద్మారావు,ఉప సర్పంచ్ దివి రాంబాబు, ధూళిపాళ్ల సుబ్బారావు, గద్దె చెంచురామారావు, సురేషు, సుబ్బారావు, పాలపర్రు ఉపసర్పంచ్ జంపని సంజీవరావు పాల్గొన్నారు.

## జయప్రద ఫౌండేషన్ ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ

వత్సవాయి, అక్టోబరు 22, ప్రభాతవార్త : జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో 89 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళను లింగాల సహకార సంఘం అధ్యక్షులు తొండపు జగన్మోహన్రావు అందజేశారు. ఇటీవల జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో లింగాల గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో



కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్‌లు చేసి మరియు చూపు సరిగా లేని వారిని గుర్తించి వారికి కళ్ళజోడులను అందజేశారు. గ్రామానికి చెందిన రాష్ట్ర టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, రాష్ట్ర టిడిపి రాజకీయ కార్యదర్శి, మాజీ శాసన మండలి సభ్యులు టిడి జనార్ధన్ జయప్రద ఫౌండేషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కళ్ళజోళ్ళు పంపిణీలో గ్రామ టిడిపి నాయకులు చల్లా కొండ, ఎంపిటీసీ సభ్యులు వేముల శివ తదితరులు పాల్గొన్నారు.

## విలీన గ్రామాల అభివృద్ధికి అడుగులు

గుంటూరు వెస్ట్,అక్టోబర్ 22,ప్రభాతవార్త : నగరంలో విలీనమై ఎలాంటి మౌలిక వసతులు లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.విలీనమైనవ బొంతపాడు నుంచి ఏటుకూరు వైపు వెళ్ళే రోడ్డు నిర్మాణానికి రూ.1.99కోట్లతో నగర మేయర్ కోవెలమూడి నానితో కలసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ



సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు.సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక విలీన గ్రామాలకు రోడ్డు నిర్మాణం, మంచినీటి సదుపాయం,వీధి దీపాల ఏర్పాటు వంటి పనులపై దృష్టి సారించామన్నారు.ఇందులో భాగంగా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని,మంచినీటి సరఫరా కూడా చేపడతాయని వెల్లడించారు.రాష్ట్రంలో అమృత్ పథకం ద్వారా రూ.440కోట్లతో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా మంచినీటి సరఫరా చేస్తామని తెలిపారు.వర్షాలకాలంలో విలీన గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వీటికి శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడుతున్నామన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా,మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య,డివిజన్ అధ్యక్షులు బ్రహ్మసాని శ్రీనివాస్,ఏడుకొండలు,అబాబ్స్ ఆలీ,శ్రీకాంత్,గోపి,రహమతున్నీసా,సరోజ,హరికృష్ణ,శ్రీను,రాంబాబు,వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



మాచర్ల, అక్టోబరు 22 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా సాంకేతిక కేంద్రాల నుంచి వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.నగేష్ ఆధ్వర్యంలో మాచర్ల మండలం రాయవరం గ్రామంలో పత్తి, మిరప పంట పొలాలను సందర్శించారు. పత్తి పంటలో గులాబిరంగు పురుగును నియంత్రించడానికి ఫెరమోన్ ట్రాప్స్ ఎకరానికి 20 చొప్పున పెట్టాలని సూచించారు. పత్తి పంటలో తెల్లదోమ నివారణకు లీటరు నీటికి డైఫెన్తురియన్ 1.25 గ్రాములు, పచ్చదోమ నివారణకు లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 ఎంఎల్, పిండినల్లి నివారణకు లీటరు నీటికి ప్రొఫెనోఫాస్ 2.5 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల సహాయ వ్యవసాయ సంచాలకులు వి.జగదీశ్వరరెడ్డి, మాచర్ల వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.మార్కండేయులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది జి.ప్రతాప్‌కుమార్, ఎం.శివానాయక్, బి.అంజినాయక్, రాయవరం గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ హయాంలో ఎన్నడూ చూడని అభివృద్ధి: జూలకంటి సాయి వివేకానందరెడ్డి



వెల్దుర్తి, అక్టోబరు 22 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ హయాంలో మాచర్ల నియోజకవర్గ ప్రజలు గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని చూస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు, టీడీపీ యువ నాయకులు సాయి వివేకానందరెడ్డి స్పష్టం చేశారు. వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో ఎమ్మెల్యే జూలకంటి ఆదేశాల మేరకు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు బుధవారం టీడీపీ యువనాయకులు జూలకంటి సాయి వివేకానందరెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి పాల్గొని భూమిపూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం వివేకానందరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే జూలకంటి పనిచేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు నర్రా గురవారెడ్డి, కేశిరెడ్డి హనిమిరెడ్డి, మల్లికార్జునరావు, దొండపాటి శ్రీను, ఉప్పలపాడు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## జూలకంటి ఇంట పెళ్లి సందడి..
## రిసెప్షన్‌కు హాజరు కానున్న అధినేత సీఎం చంద్రబాబు



వెల్దుర్తి, అక్టోబరు 22 ప్రభాతవార్త: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి వివాహ మహోత్సవ రిసెప్షన్ వేడుకల్లో ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నట్లు తెలుస్తుంది. ఈ నెల 24న గుంటూరులోని శ్రీకన్వెన్షన్‌లో వివాహం జరగనుంది. అనంతరం ఈ నెల 27న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్వగ్రామమైన వెల్దుర్తిలో స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఎందురుగా ఉన్న ఖాళీ స్థలంలో గౌతమ్‌రెడ్డి వివాహ మహోత్సవ రిసెప్షన్ వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నట్లు సీఎంఓ కార్యాలయం నుంచి బుధవారం అధికారికంగా షెడ్యూలు విడుదల కావడంతో టూర్‌కు సంబంధించిన ఏర్పాట్లను టీడీపీ శ్రేణులు ముమ్మరం చేస్తున్నాయి.

## ప్రారంభమైన కార్తీక మాస పూజలు

పొన్నూరు, అక్టోబరు 22,ప్రభాతవార్త: హిందువులకు అత్యంత పవిత్రమైన మాసం కార్తీక మాసం....ఈ మాసంలో హరిహరులకు నెల రోజులపాటు పూజలు నిర్వహిస్తారు. వేకువ జామునే చన్నీటి స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ నెల రోజుల పాటు



ఉపవాసాలు ఉంటారు. ఈ మాసంలో ప్రత్యేక పూజలు చేయడం, ఉపవాస దీక్షలు చేపట్టడం వంటివి చేస్తే సర్వ సుఖాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. కార్తీకమాసంలో దేవాలయాలన్నింటిని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. భక్తులు తాకిడి కూడా ఎక్కువగానే ఉంటుంది. ఈ ఏడాది మరీ ఎక్కువగా ఉండే అవకాశం కూడా ఉంది. ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటాలడే అవకాశాలూ లేకపోలేదు. పట్టణంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. బ్రాహ్మణ బజారులోని శ్రీ శంకర మఠంలో బుధవారం వేకువ జామునుంచే ప్రత్యేక అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు. బ్రాహ్మణ మహాసభ పూర్వాధ్యక్షులు పివిఎస్ఎస్‌వి ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా స్వామివారికి అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు గణపవరపు రామశాస్త్రి నేతృత్వంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

## అన్నిదానముల కన్న అన్నదానమె మిన్న



పొన్నూరు, అక్టోబరు 22,ప్రభాతవార్త: అన్ని దానముల కన్న అన్నదానమె మిన్నయని రాష్ట్ర మైనార్టీ కమీషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా అన్నారు. స్థానిక ముబారక్‌నగర్‌లోని మహమ్మదీయ మసీదు వద్ద గ్యార్మీ పండుగ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సైఫుల్లా మాట్లాడుతూ ముస్లింలు గ్యారీ నెల మొత్తం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి, కుల, మతాలకు అతీతంగా అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించి మత సామరస్యాన్ని కాపాడుతున్నారన్నారు. ఈ నెలలో అన్న సంతర్పణలు నిర్వహించడం ద్వారా మంచి జరుగుతుందన్నది విశ్వాసమన్నారు. తొలుత ముస్లీం మత పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మహమ్మదీయ మసీదు కమిటి నిర్వాహకులు షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## 26న జాతీయ అవార్డుల ప్రదానోత్సవం



పొన్నూరు, అక్టోబరు 22,ప్రభాతవార్త: సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్ఎల్‌టిఓ)ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ నేషనల్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని రెవెన్యూ కళ్యాణ మండపంలో మధ్యాహ్నాం 2గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సభకు అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ ఈవి నారాయణ, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ వాహిద్ హుస్సేన్, జనచైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి పాల్గొంటారన్నారు. ప్రతిభా అవార్డులకు ఎంపికైనవారు తప్పని సరిగా కార్యక్రమానికి హాజరై అవార్డులను స్వీకరించాలని కోరారు. ఎంపికైన వారందరికీ ఇప్పటికే సంబంధిత పత్రాలను పంపినట్లు చెప్పారు. సంస్థ సభ్యులు, అభిమానులు, అవార్డులకు ఎంపికైనవారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ నాగయ్య కోరారు.

# మంచి సాహిత్యంతోనే మానవ సంబంధాలు మెరుగు

## యూనివర్సిటీలు లిటరేచర్ కోర్సులను ప్రవేశ పెట్టాలి

## ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి ఓల్గా పిలుపు

### ఎస్ఆర్ఎం వర్సిటీలో అమరావతి సాహిత్య ఉత్సవం ప్రారంభం

మంగళగిరి, అక్టోబరు 22, ప్రభాతవార్త: విలువలతో కూడిన సాహిత్యంతో మానవ సంబంధాలు మెరుగుపడతాయనీ, ఆరోగ్యకరమైన సమాజం కనుల ముందుకు వస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత రచయిత్రి పి లలితకుమారి పేర్కొన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం ఉదయం అమరావతి సాహిత్య ఉత్సవం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ప్రాశ్చాత్య పోకడలు పెరిగి నైతిక విలువలు పతనమవుతున్నాయని, అంతటా హింస ప్రవృత్తి పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్, మెడికల్, న్యాయ కళాశాలల్లో మానవ





విలువలను పెంపొందించే ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని సూచించారు. మంచి సాహిత్యం మానవ మనుగడను సుసంపన్నం చేస్తుందని, యువత భవితవ్యాలను ఉజ్వలం చేస్తుందన్నారు. శ్రీశ్రీ, వేమన, కరుణశ్రీ, గురజాడ వంటి పేరున్న కవుల కలం నుంచి జాలువారిన సాహిత్యం ఇప్పటికీ ఆధునిక యువతను ప్రభావితం చేస్తుందన్నారు. తన సోదరి ఓల్గా మరణానంతరం ఆమె పేరును తన కలం పేరుగా మార్చుకుని రచనలు చేస్తున్నానని వివరించారు. పర్సనాలిటీ డెవలప్మెంట్ కోర్సుల కోసం పరుగులు తీయడం అనవసరమంటూ మంచి సాహిత్యం ఉన్న పుస్తకాలను పఠనం చేయడం సరిపోతుందన్నారు. యూనివర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ, వివిధ భాషలు, వాటి సాహిత్య విలువలను విద్యార్థుల్లో ప్రేరేపించే ప్రక్రియలో భాగంగా తొలిసారి వర్సిటీలో అమరావతి సాహిత్య ఉత్సవాన్ని ఏర్పాటు చేశామన్నారు. కవులు, విమర్శకులు, సాహిత్యాభిలాషులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారి ఆలోచనల నుంచి వచ్చే నూతన సృజనలకు ప్రాణం పోయాలన్న తలంపుతో ఈ కార్యక్రమాన్ని మూడురోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆమ్లాన్ బైశ్య మూడు రోజుల కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమానికి హాజరైన సాహిత్యవేత్తలను పరిచయం చేశారు. అనంతరం ముఖ్య అతిథి వోల్గాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, లిబరల్ ఆర్ట్స్ స్కూల్ డీన్ డాక్టర్ బిష్ణు పథ్, విభాగాధిపతి డాక్టర్ శయంటిన్ ఠాగూర్ తదితరులు ప్రసంగించారు.

## కందుకూరు ఘటనలో గాయపడిన బాధితులను పరామర్శించిన తిరుమలశెట్టి కొండలరావు



మంగళగిరి, అక్టోబర్ 22, ప్రభాతవార్త: కందుకూరు తాలూకా గుడ్లూరు మండలం దార కాని పాడు గ్రామంలో జరిగిన దారుణ ఘటనలో తిరుమల శెట్టి లక్ష్మీ నాయుడు మృతి చెందారు. సోదరులు పవన్, భార్గవ్ తీవ్రంగా గాయపడి ప్రమాదం నుంచి బయటపడిన బాధితులను బుధవారం గుంటూరులోని ఉదయ్ హాస్పిటల్ లో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కాపు సంఘాల నాయకులు బాధితులను పరామర్శించారు. వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. జై కాపు సేన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమల శెట్టి కొండలరావు బాధితులను పరామర్శించి మాట్లాడుతూ తాజా ఘటనతో నష్టపోయిన కుటుంబాలను ఆదుకునే విషయంలో తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులు మాట్లాడుతూ, నిందితులను కఠినంగా శిక్షి ంచాలని ఈ తరహా ఘటనలో పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి రాము, ఆమంచి సాములు, చలమల శెట్టి రమేష్, బుల్లెట్ ధర్మారావు, పశ్చిమగోదావరి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ శక్తి యాప్ ద్వారా మహిళలకు రక్షణ: ఎస్సై శ్రీనివాసరావు



వేమూరు అక్టోబరు 22 (ప్రభాతవార్త) : శక్తియాప్ మహిళల రక్షణకు అండగా నిలుస్తుందని వేమూరు ఎస్సై జి.శ్రీనివాసరావు తెలియజేశారు. బుధవారం జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు శక్తియాప్పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు శక్తియాప్పై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్లలో శక్తియాఫ్ డౌన్లోడ్ చేసుకున్నట్లయితే తన వెంట ఒక కుటుంబ సభ్యుడు తోడున్నట్లు అవుతుందన్నారు. పాఠశాలకు కళాశాలకు వెళ్ళే బాలికలపై అనుచిత వ్యాఖ్యలు చేసి భంగం కలిగే రీతిలో ప్రవర్తించినట్లయితే తమ ఫోన్లో శక్తి యాఫ్ను బటన్ నొక్కుతుండా పోలీసులు వెంటనే స్పందించి వారికి అండగా నిలుస్తారని గుర్తు చేశారు. పాఠశాల ప్రదానోపాధ్యాయుడు బద్రి నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

వేమూరు అక్టోబరు 22 (ప్రభాతవార్త) : వాయుగుండం ప్రభావం కారణంగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా మండలంలో ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సుశీల బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వాయుగుండం ప్రభావం కారణంగా జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఇందు మూలంగా కాలువలు వాగులు పొంగి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఇందు మూలంగా అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా రెవెన్యూ యంత్రాంగం గ్రామాల్లో ఉండే ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు సమాచారం అందించాలని ఆమె తెలియజేశారు.

## ఫోర్ ఫ్రంట్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు



కొల్లూరు, అక్టోబరు 22 (ప్రభాతవార్త) : గ్రామీణ ప్రాంతంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు మంచి విద్య బోధన అందించడం అభినందనీయమని కొల్లూరు ఎస్సై జానకి అమరవర్ధన్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కొల్లూరులోని ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ స్కూల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనితకుమారి రాజన్ అధ్యక్షత వహించారు. ఎస్సై అమరవర్ధన్ మాట్లాడుతూ విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని, అంతే కాకుండా చిన్ననాటి నుండే విద్యార్థులు సిగరెట్లు, ఇతర అలవాటులు చేసుకోకుండా ఉంటే మనం అనుకున్న స్థాయికి ఎదగవచ్చన్నారు. ఇంకా మరిన్ని అంశాలపై ఆయన విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ ప్రిన్సిపాల్ అనితకుమారి రాజన్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గృహనిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి: ఎంపీడీఓ విజయలక్ష్మీ



కొల్లిపర, అక్టోబరు 22 ప్రభాతవార్త: .గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ళు లేని నిరుపేదలు ఉంటే గృహనిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నవంబరు 5 వ తేదీ లోపు అర్హులైన వారు ఉంటే గృహ నిర్మాణశాఖ ఏఈ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. ఈ నెల 23 వ తేదీ నుండి 29 తేదీ వరకు మండల గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసామని మండల గ్రామాల ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్, సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కొల్లిపరలో భారీవర్షం..జలమయమైన రోడ్లు





కొల్లిపర, అక్టోబరు 22 ప్రభాతవార్త: వాతావరణంలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుని మండలంలో భారీవర్షం కురవటంతో రోడ్లన్ని జలమయమయ్యాయి. దావులూరిపాలెం, దావులూరు, శిరిపురం, చివలూరు, తూములూరు, వల్లభాపురం, మున్నంగి తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు నీటితో నిండటంతో పాటు పల్లపు ప్రాంతాలలో ఉన్న గృహాల వద్ద నీరు అధికంగా చేరటంతో గృహాలలో నుంచి బయటకు రావటానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొల్లిపర శివాలయం వద్ద నుండి గ్రామ పంచాయతీ వరకు రోడ్డుపై అధికంగా నీరు చేరటంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు.

# బాపట్ల జిల్లా వార్త



## జిల్లాలో భారీ వర్షాల వల్ల ఇరిగేషన్ చెరువులు తెగిపోకుండా పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలి

బాపట్ల, అక్టోబర్22, ప్రభాతవార్త: జిల్లాలో భారీ వర్షాల వల్ల ఇరిగేషన్ చెరువులు తెగి పోకుండా పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లో భారీ వర్షాలు, ఎరువుల నిల్వలు, గృహనిర్మా ణం, స్వామిత్వ సర్వే తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారు లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే



అవకాశము ఉన్నందున కొస్తాతీర ప్రాంతాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తీర ప్రాంత మండల అధికారులు గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనాలు వేస్తూ జాగ్రత్తగా ఉండాల న్నారు. గ్రామాల్లో మైనర్ ఇరిగేషన్ చెరువుల వద్ద గ్రామ స్థాయి అధికారులను ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. తీర ప్రాంతాలకు చెందిన 42 మంది జాలర్లుసముద్రంలో వేటకు వెళ్లారని వారిని సురక్షితంగా తిరిగి వారి ఇంటికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. భారీ వర్షాల సందర్భంగా అవసర మైన చోట పాఠశాలకు, అంగన్ వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలన్నారు. జిల్లాలో ఎరువుల నిల్వల గురించి అధికారులు యాప్ లో అప్డేట్ చేయాలన్నారు. జిల్లాలో ఇ. పంట నమోదు నూరు శాతం శాతం పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో స్వామిత్వ సర్వే పూర్తి చేయడంలో అధికారు లు వెనకబడి ఉన్నార ని పద్ధతి మార్చు కోవాలని జిల్లా పంచాయతీ అధికారిని, జిల్లా సర్వే అధికారిని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణ శాఖ ద్వారా నిర్మించిన గృహాలను త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, వ్యవసాయ శాఖ ఏడి అన్నపూర్ణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిరాజ్ దిబోరా తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప కృపతోనే 21 ఏళ్లుగా చద్ది కార్యక్రమం విజయవంతం

### అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, అక్టోబర్22, ప్రభాతవార్త: శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులతోనే గత 21 సంవత్సరాలుగా చద్ది కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ శాసనమండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా బాపట్ల పార్వతీ సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో మాలధారులకు చద్ది కార్యక్రమాన్ని అన్నం సతీష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభించారు.





ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ తొలుత అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామివారికి పడి వెలిగించి, చద్ది కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ చద్ది కార్యక్రమాన్ని తాను నిర్వహిస్తున్నప్పటికీ, ఎందరో మహానుభావుల కృషి ఇందులో దాగి ఉందని అన్నారు. ఆర్థికపరమైన బాధ్యతలను తాను చూసుకుంటున్నప్పటికీ, తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు ఎందరో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వామివారి సేవలో లీనమవుతున్నారని కొనియాడారు. వారి అందరి సహకారంతో, అయ్యప్ప స్వామి ఆశీస్సులతో గత 21 సంవత్సరాలుగా మాలధారులకు ఈ చద్ది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని చెప్పారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఉన్నంతకాలం తాను ఈ చద్ది కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తానని వివరించారు. ఈ కార్యక్రమం మొత్తం 41 రోజులపాటు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చద్ది కార్యక్రమంలో సోమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బుర్లె రామ సుబ్బారావు, గురు స్వామి సుబ్బారావు, బిజెపి నియోజకవర్గ అద్యక్షులు అనిల్కుమార్ ,తదితరులుపాల్గొన్నారు.

## డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసుల అవగాహన

బాపట్ల, అక్టోబర్22, ప్రభాతవార్త: బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలు, సైబర్ నేరాలపై జిల్లా పోలీసు అధికారులు విస్తృత అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు



అధికారులు మాట్లాడుతూ నేటి యువతే రేపటి దేశ భవిష్యత్ అని, చిన్న పొరపాటు వారి జీవితాలను గందరగోళానికి గురి చేస్తుందని హెచ్చరించారు.

**డ్రగ్స్ వద్దు.. జీవితం ముఖ్యం**

ప్రస్తుతం యువతలో డ్రగ్స్ వాడకం ఆందోళనకరంగా పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు సరైన మార్గదర్శనం అవసరమని పోలీసులు అధికారులు తెలిపారు. డ్రగ్స్ వినియోగం కేవలం శారీరకంగానే కాకుండా మానసికంగా, సామాజికంగా, కుటుంబపరంగా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థులు డ్రగ్స్కు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా, కలిగి ఉన్నా తక్షణమే టోల్ ఫ్రీ నంబర్లు 112 లేదా 1972కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మరోవైపు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్న సైబర్ నేరాలపై కూడా పోలీసులు అవగాహన కల్పించారు. నేటి టెక్నాలజీ ప్రపంచంలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద నష్టానికి దారి తీస్తుందని హెచ్చరించారు. సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్, అనుమానిత లింకుల ద్వారా సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, విద్యార్థులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నకిలీ ఐడెంటిటీలతో వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించవద్దని, అపరిచితుల మెసేజ్లు, లింకులను క్లిక్ చేయవద్దని స్పష్టం చేశారు. సైబర్ నేరాల బారిన పడినట్లు గుర్తిస్తే వెంటనే 1930 నంబర్కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. దగ్గరలోని పోలీస్స్టేషన్కు వెళ్ళి వివరాలు తెలపాలన్నారు.

## విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, శక్తి యాప్ గురించి అవగాహన

పిట్టలవానిపాలెం, అక్టోబర్22, ప్రభాతవార్త: పిట్టలవానిపాలెం మండలపరిధిలోని గోకరాజు నల్లి బోయిన వారిపాలెం లో ఉన్న కేర్ విద్యాలయం నందు చందోలు ఎస్సై ఎం వెంకట శివకుమార్ బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్



గురించి వివరిస్తూ శక్తి యాప్ అత్యవసర సమయంలో మహిళలకు తక్షణ సహాయం పొందేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని అదే విధంగా ఎవరైనా ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు అరికట్టే విధంగా ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు.. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలియజేస్తూ అలా మనల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే మన తల్లిదండ్రులకు మీరు చదువుకునే పాఠశాల గురువులకు చెప్పాలని, రోజురోజుకు పెరుగుతున్నటువంటి సైబర్ నేరాల నేపథ్యంలో విద్యార్థులకు సోషల్ మీడియా లో ఫేస్బుక్లో ఇంస్టాగ్రామ్ లలో వచ్చే ఫేక్ న్యూస్ లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులకు సమస్య వచ్చినప్పుడు హెల్ప్ లైన్ నెంబర్లు 100, 112 నంబర్లకు కాల్ చేసిన వెంటనే చట్టపరమైనటువంటి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం విజయవంతం

కర్లపాలెం, అక్టోబర్22, ప్రభాతవార్త: ప్రముఖ సమాజ సేవకులు మోపర్తి జాన్ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది . కర్లపాలెంలోని కేర్ క్యాంపస్ లో బుధవారం 200 మంది యువకులు, సామాజిక సేవా నిబద్ధత కలిగిన ప్రజలు పాల్గొని



రక్తదానం చేశారు. నీడ్స్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ రక్త దాన శిబిరాన్ని బాపట్ల ఆర్డిఓ గ్లోరియా, కర్లపాలెం, బాపట్ల తహసిల్దార్లు షాకీర్ పాషా, సలీమా ప్రారంభించగా.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్. విజయమ్మ రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా బాపట్ల ఆర్డిఓ గ్లోరియా మాట్లాడుతూ జన్మదిన సందర్భంగా ఓ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సమాజ సేవకులు మోపర్తి జాన్ ను అభినందించారు. సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి కార్యక్రమాలు జరగడం అభినందనీయం అన్నారు. డిఎంహెచ్ ఓ డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను రక్షించే అవకాశం లభిస్తుందన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. సమాజ సేవకులు మోపర్తి జాన్ మాట్లాడుతూ తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరానికి అనుహ్య స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నిస్సి జోసఫ్, మిషన్స్ డైరెక్టర్ స్టీవ్ కాలిన్స్, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పూర్ణచంద్ర , సాంబశివ రెడ్డి , బ్యూలా లివింగ్ స్టన్ , ల్యాబ్ టెక్నీషియన్ బుజ్జిబాబు, అంటరాని నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చార్వాక , దళిత నాయకులు పరమానంద కుమార్, ఆర్మీ విజయ్, కర్లపాలెం మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, అజీమ్ ఖాన్, టిడిపి నాయకులు పఠాన్, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ నుండి రావాల్సిన బకాయిలను ఇప్పించండి



తెనాలి టౌన్ అక్టోబర్ 22 (ప్రభాతవార్త): గ్రామపంచాయితీ నుండి త మకు రావాల్సి న బకాయిలను ఇప్పించవలసినదిగా, కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామని బాధితులు ఈపూరి వెంకట సత్యనారాయణ, సుద్దపల్లి నళిని, రావూరి రత్నారాణి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామ పురవేదిక వద్ద బుధవారం బాధితులు విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు సుద్దపల్లి నళిని మాట్లాడుతూ, నేను గ్రామంలో డయేరియా సోకిన సమయంలో గుంటూరు కృష్ణమోహన్ కోరిన మీదట రోజువారి చెప్పిన లెక్క మేరకు భోజనాన్ని సమకూర్చానని, రూ.2.14 లక్షలు రావాల్సి ఉండగా, దశలవారీగా రూ.1.50 లక్షలు మాత్రమే చెల్లించారని, ఓచర్ల మీద సంతకాలు పెట్టించుకున్నారని, బకాయి చెల్లించలేదని దయచేసి బిల్లులు ఇప్పించాలని కోరారు. మరో బాధితుడు ఏపూరి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ, నేను డయేరియా సమయంలో అప్పటి పంచాయితీ సెక్రటరీ, గుంటూరు కృష్ణమోహన్ ఇరువురు కోరిన మీదట 3357 ట్యాంకర్ల నీటిని సరఫరా చేశానని కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రూ.6.47 లక్షలు చెల్లించాలని, కానీ దశలవారీగా రూ.1.30 లక్షలు మాత్రమే చెల్లించారని పంచాయతీలో నిధులు డ్రా చేసి కూడా మాకు చెల్లించలేదని, అధికారులు చర్యలు తీసుకొని మా బకాయిలు చెల్లించాలని వాపోయారు. మరోసారి పంచాయతీలో అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాధితురాలు రావూరి రత్న రాణి మాట్లాడుతూ నేను 2004 నుంచి ఎస్సీ కాలనీ గ్రంథాలయంలో లైబ్రరీ అసిస్టెంట్ గా పని చేస్తున్నానని అప్పట్లో కేవలం రూ.800 జీతానికి ఒప్పుకొని పనిచేస్తున్నానని నా జీతం రూ.6 వేలకు చేరిన సమయంలో సర్పంచిగా చొప్పర ప్రీతి వచ్చారని నా జీతాన్ని రూ10 వేలకు పెంచుతానని, రూ.6వేలు నాకు చెల్లించి, రూ.4 వేలు తను తీసుకుంటానని చెప్పారు. దానికి అంగీకరించలేదని నన్ను తొలగిస్తున్నట్లు చెప్పి, నాలుగేళ్లుగా జీతం చెల్లించడం లేదని ఇప్పటికీ నేను నా విధులను నిర్వహిస్తూనే ఉన్నానని అధికారులు న్యాయం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బాధితులు పసుపులేటి పిచ్చయ్య, ముత్తె వీరరాఘవయ్య, కోళ్ల కోటేశ్వరరావు, సుద్దపల్లి మోజెష్, పండలనేని శ్రీనివాసరావు, తనిగినీడి శ్రీరామాంజనేయులు, ధూళ్ల వెంకటరామయ్య, మోదుకురి గురుదేవ్, కాలిశెట్టి రమేష్, ధూళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గృహవ్యర్థాలను మొక్కలకు ఎరువుగా చేసుకోండి:మున్సిపల్ చైర్మన్



తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 22 (ప్రభాతవార్త): గృహంలోని వ్యర్థాలను మొక్కలకు ఎరువుగా తయారుచేసుకోవచ్చని, మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, కమీషనర్ రామ అప్పలనాయుడు పేర్కొన్నారు. బుధవారం పురపాలక సంఘం వారు నిర్వహించిన హోమ్ కంపోస్ట్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 7మరియు 8వార్డుల్లో ఉన్న పలు అపార్ట్మెంట్లలో హోమ్ కంపోస్ట్ ఎలా తయారు చేయాలి అనే దానిపై అవగాహన కల్పించడం జరిగినది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో వచ్చినటు వంటి చెత్త ఆహార పదార్ధాలతో కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు అని అపార్ట్మెంట్ ప్రజలకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మునిసిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది మరియు శానిటేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, నగరదీపికలు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరులకు, అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ నివాళి



తెనాలి టౌన్ అక్టోబర్ 22 (ప్రభాతవార్త): పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా, మంగళవారం పట్టణంలోని చెంచుపేట లోగల దివంగత ఐపిఎస్ అధికారి స్వర్గీయ చదలవాడ ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించిన అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. అనంతరం వారు మాట్లాడుతూ, విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు ప్రజలందరూ రుణపడి ఉంటారని, ప్రజలను రక్షి ంచడంలో తమ కుటుంబాలను, వ్యక్తిగత జీవితాన్ని కూడా పణంగా పెట్టి అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవడం మన అందరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆళ్ళమూడి ప్రభాకరరావు, ట్రస్ట్ సభ్యులు ఈపూరి ప్రేమకుమార్, దోనేపూడి మస్తాన్ రావు, చిలకా సుధాకర్, యల్లమాటి కరుణాకర్, ఎస్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## సేవామూర్తి,పారిశ్రామికవేత్త పాటిబండ్ల నరేంద్రనాథ్ విగ్రహావిష్కరణ

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 22 (ప్రభాతవార్త): సంఘ సేవకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, దివంగత పాటిబండ్ల నరేంద్ర నాథ్ 61 వ జయంతి సందర్భంగా, విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పట్టణంలోని



చినరావూరులో గల వాసిరెడ్డి లక్ష్మీ మ్రపతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన నరేంద్రనాథ్ కాంస్య విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, మాజీ మంత్రి, మాజీ మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పట్టణ తెదేపా అధ్యక్షులు మొహమ్మద్ ఖుద్దుస్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, పాటిబండ్ల నరేంద్ర కుమార్ స్నేహానికి విలువనిచ్చేవాడని, తమ ఇద్దరి మధ్య ఎన్నో విషయాలు పంచుకునే వాళ్లమని, తెలుగుదేశం పార్టీకి వీర విధేయుడుగా వ్యవహరించేవాడని, గత ప్రభుత్వ హయాంలో ఎంతోమంది తెలుగుదేశం పార్టీ నాయకులు వేధింపులకు గురైనా, నరేంద్రనాథ్ తెలుగుదేశం పార్టీకి తన యొక్క సేవలను మాత్రం ఆపలేదని, వివాదరహితుడని అంతేకాకుండా తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి పరచి, మౌలిక వసతులు కల్పించి, అడిగినవారికి కాదనకుండా తనవంతు సేవను నిస్వార్థంగా చేసే నరేంద్రనాథ్, నేడు భౌతికంగా మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమన్నారు. అనంతరం శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, నరేంద్రనాథ్ నాతో కుటుంబసభ్యుల మాదిరి ఆప్యాయత అనురాగంతో ఉండేవాడని, నిస్వార్థపరుడని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తన కష్టముగా భావించి, తనవంతుగా సాయం అందించేవాడని, ముఖ్యంగా తనకు తన ఊరు తెనాలి అన్న, తను పెరిగిన ప్రాంతం చినరావూరు అన్న, తన చదువుకున్న పాఠశాల అన్న కూడా ఎంతో అభిమానం గా ఉండేవాడని, చెన్నైలో గొప్ప పారిశ్రామికవేత్తగా ఎదిగినా కూడా తన మూలాలు మరువకుండా స్నేహానికి విలువ ఇచ్చే వారన్నారు. మాజీ మహిళా కమిషన్ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి , నరేంద్రనాథ్ సతీమణి అన్నపూర్ణ కుమారులు హర్ష, శ్రీహర్ష కోడళ్ళు మనమళ్ళు పాల్గొన్నారు. పట్టణ తెదేపా కార్యదర్శి వసంతం అశోక్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు ఫణిదపు దుర్గ, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు మహిళ నేతలు పెద్ద ఎత్తున కార్యకర్తలు అలాగే పార్టీ బండ్ల నరేంద్రనాథ్ అభిమానులు చినరావూరు ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బంగారు నగలు మాయం

కొల్లిపర, అక్టోబరు 22 ప్రభాతవార్త: మండల పరిధిలోని హనుమాన్పాలెంలో శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో సుమారు 20 లక్షల విలువ గల బంగారు నగలు మాయం అయ్యాయని ఆలయధర్మకర్త కోటిరెడ్డి, గ్రామస్తులు కొల్లిపర పోలీస్స్టేషనులో పిర్యాదు చేసారు. దీంతో ఎస్.ఐ కోటేశ్వరరావు రంగంలోకి దిగి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

# ఎవర్ గ్రీన్.. రెబల్ స్టార్ ప్రభాస్..



**రెబల్ ఫ్యాన్స్‌కు** దీపావళితో పాటు వచ్చే పండుగ రెబల్ స్టార్ ప్రభాస్ బర్త్ డే. ఈ నెల 23న ఆయన పుట్టిరోజును ఘనంగా సెలబ్రేట్ చేస్తుంటారు ఫ్యాన్స్, మూవీ లవర్స్. ప్రభాస్ బర్త్‌డే ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో నోటెడ్ అకేషన్‌గా మారింది. దేశం నలుమూలలా ప్రభాస్‌కు అభిమానులు ఉన్నారు, ఆయన సినిమాలను ఇష్టంగా చూసేవాళ్లున్నారు. ఓవర్సీస్‌లో యూఎస్, యూకే, జపాన్..ఇలా ప్రతి దేశంలోనూ ప్రభాస్ సినిమాల కోసం ఎదురుచూస్తుంటారు. తన సినిమాలకు ఆయా దేశాల్లో వచ్చే బాక్సాఫీస్ కలెక్షన్స్ ప్రభాస్ యూనివర్సల్ క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తుంటాయి. అందుకే ప్రభాస్ చేసే ప్రతి సినిమా ట్రూ పాన్ వరల్డ్ మూవీ అవుతోంది. తన స్టార్ డమ్, ఛరిష్మా, పర్ ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్, రికార్డ్ స్థాయి బాక్సాఫీస్ వసూళ్లతో ప్రభాస్ తెలుగు సినిమా ఖ్యాతిని ఖండాంతరాలకు చేర్చారు. ఇండస్ట్రీలో పేరు తెచ్చుకునే హీరోలను చూస్తుంటాం...టాలీవుడ్‌కే పేరు తెస్తున్న అరుదైన స్టార్ రెబల్ స్టార్ ప్రభాస్. ఆయన బర్త్ డేకు తన బ్లాక్ బస్టర్ మూవీస్ రీ రిలీజ్‌తో పాటు కొత్త సినిమాల అప్డేట్స్ సందడి చేస్తుంటాయి. ఈ నెల 31న ప్రభాస్ కెరీర్‌లో మైల్ స్టోన్‌గా నిలిచే మూవీ 'బాహుబలి ది ఎపిక్' రీ రిలీజ్ అవుతోంది. బాహుబలి రెండు చిత్రాలు కలిసి ఒకే పార్ట్‌గా విడుదలకు వస్తుండటం మూవీ లవర్స్, ఫ్యాన్స్‌లో ఆసక్తి కలిగిస్తోంది. తెలుగువారు గర్వపడేలా ప్రభాస్ భారీ పాన్ వరల్డ్ మూవీ లైనప్ కంటిన్యూ చేస్తున్నారు. డైరెక్టర్ మారుతితో ప్రభాస్ చేస్తున్న 'ది రాజా సాబ్' సినిమా వచ్చే సంక్రాంతికి జనవరి 9న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. రాజా సాబ్ మూవీలో ప్రభాస్ ను మనం ఇంతకాలం మిస్ అయిన వింటేజ్ లుక్‌లో రొమాంటిక్ హారర్ కామెడీలో చూడబోతున్నాం. డైరెక్టర్ హను రాఘవపూడి, మైత్రీ మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో ప్రభాస్ నటిస్తున్న సినిమాపై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. సందీప్ వంగా డైరెక్షన్‌లో ప్రభాస్ నటించనున్న 'స్పిరిట్' సినిమాపై ఇప్పటికే స్కై రేంజ్ ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. ప్రభాస్ క్రేజీ లైనప్‌లో రానున్న సలార్ 2, కల్కి 2 ఎగ్జైట్ చేస్తున్నాయి. ఈ ఏడాది మంచు విష్ణు కన్నప్ప సినిమాలో ప్రభాస్ చేసిన రుద్ర క్యారెక్టర్ ఆ చిత్రానికే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రుద్ర పాత్రలో ప్రభాస్ చేసిన డివైన్ పర్ ఫార్మెన్స్ అందరినీ ఆకట్టుకుంది. మచ్చలేని జీవితం, శత్రువు ఎరుగని వ్యక్తిత్వం, చేతికి ఎముకలేని దాతృత్వం, మర్చిపోలేని ఆతిథ్యం... ఇవన్నీ ప్రభాస్‌ను అందరూ ఇష్టపడే డార్లింగ్‌లా మార్చేశాయి. స్టార్‌గా ప్రభాస్ స్టామినా బాక్సాఫీస్ రికార్డులు చెబితే, అందరూ ప్రేమగా పిలిచే డార్లింగ్ అనే మాట వ్యక్తిగా ఆయన గొప్పదనం చూపిస్తుంది. తెలుగు తెరపై వరుస విజయాలతో ప్రభాస్ మరెన్నో ఇలాంటి పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకుందాం. హ్యాపీ బర్త్ డే టు రెబల్ స్టార్ ప్రభాస్.

# 'మిరాయ్'కి బ్లాక్ బస్టర్ ఇచ్చినందుకు ఆడియెన్స్‌కు రుణపడి ఉంటా : హీరో తేజ సజ్జా



**సూపర్ హీరో తేజ సజ్జ** బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. రితికా నాయక్ హీరోయిన్‌గా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. సెప్టెంబర్ 12న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజైన ఈ చిత్రం బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకుని అద్భుతమైన కలెక్షన్స్ తో రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా మేకర్స్ బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ సెలబ్రేషన్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకలో యూనిట్ అందరికీ మెమెంటోలు అందించి అభినందించారు. బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ సెలబ్రేషన్‌లో హీరో తేజ సజ్జ మాట్లాడుతూ..అందరికి నమస్కారం. మాతో ఈ సక్సెస్ ని సెలబ్రేట్ చేసుకోవడానికి వచ్చిన మీడియా వారికి, ఆడియన్స్ కి, మమ్మల్ని ప్రోత్సహించడానికి ఇక్కడికి వచ్చిన రవి గారికి, రాధా మోహన్ గారికి, మారుతి గారికి, సంపత్ నంది గారికి, శ్రీరామ్ ఆదిత్య కి.. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమాకి మేము చాలా ఈవెంట్లు చేశాము. ఈవెంట్ మాత్రం మా వెనకాల ఉండి మమ్మల్ని నడిపించిన టెక్నీషియన్స్ అందరికోసం. వాళ్లకి గుర్తుగా ఉండాలని ఈవెంట్ ని నిర్వహించాం. సినిమా రిలీజ్ అయి దాదాపుగా 45 డేస్ అవుతుంది. ఓటీటీకి వచ్చిన వరకూ కూడా థియేటర్లో రన్ నడుస్తుంది. ఓటీటీకి వచ్చాక కూడా ఈవెంట్‌ని పెట్టడం విశ్వ గారి గొప్ప మనసు. ఒక మంచి సినిమా వస్తే సపోర్ట్ చేసి ఎంతో గొప్ప స్థాయికి తీసుకువెళ్తారు. నా కెరీర్లో నాకు ఇది ఎన్నో సార్లు చూపించారు. మీరు ప్రోత్సహించిన విధానం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. మీ అందరికీ ఎప్పుడు కూడా కృతజ్ఞతతో ఉంటాను. ఆడియన్స్ వల్లే ఇక్కడ ఉన్నాను. మీ అందరికీ పాదాభివందనాలు థాంక్యూ' అన్నారు. నిర్మాత టిజి విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ సినిమాకి ఇంత అద్భుతమైన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు మీడియాకు ధన్యవాదాలు. దీనిని ఫ్రాన్ వరల్డ్ ఫ్రాంఛైజ్ చేస్తున్నాం. మిరాయి విజయంతో ఇది మొదలైంది. జియో స్టార్ లార్జెస్ట్ యూజర్ బేస్ ఉన్న ఓటిటి. తెలుగు సినిమాల్లో ఇది అత్యధికంగా ప్రేక్షకులు వీక్షించిన సినిమా అవుతుందని వారి నుంచి మాకు ఫీడ్బ్యాక్ వచ్చింది. ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా నిలుస్తుందని ఆశిస్తున్నాం. మరిన్ని అద్భుతమైన సినిమాలు చేయాలని కోరుకుంటున్నాం. అందరికీ థాంక్యు అన్నారు. డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ..'సినిమాని నేను ఎప్పుడు కూడా మ్యాజిక్ అనుకునేవాడిని. తీయడం మొదలుపెట్టాక మ్యాజిక్ అనేది నెమ్మదిగా అర్థమైంది. అందరి కొలాబరేషన్‌తో సినిమా తయారవుతుంది. మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్' అన్నారు. హీరోయిన్ రితిక నాయక్ మాట్లాడుతూ.. 'నాకు విభా క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ కార్తీక్ గారికి థాంక్యూ సో మచ్. ఈ సినిమాకి బ్యాక్ బోన్‌గా నిలిచిన విశ్వప్రసాద్ గారికి కృతి ప్రసాద్ గారికి థాంక్యూ సో మచ్. తేజ గారు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఆయన పాషన్‌తోనే ఇది సాధ్యపడింది. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు' అన్నారు..

నిర్మాత వై రవిశంకర్ మాట్లాడుతూ... 'తేజ, కార్తీక్ మిగతా టెక్నీషియన్ అందరు కూడా మాకు చాలా ఆప్తులు. ఈ సినిమా అద్భుతమైన సక్సెస్ అయినందుకు చాలా హ్యాపీగా ఫీల్ అయ్యాం. సిజిని ఈ బడ్జెట్‌లో ఇంత అద్భుతంగా తీయొచ్చు అని విశ్వగారు మా అందరికీ ఒక పెద్దన్నలా చూపించారు. ఈ సినిమాకి అన్ని వైపుల నుంచి అద్భుతమైన విజయం దక్కింది. విశ్వ గారు నుంచి రాజా సాబ్, ఆ తర్వాత వస్తున్న సినిమాలో కూడా పెద్ద విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు.

డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో మిరాయ్ అలంటి అద్భుతమైన సినిమా రావడం చాలా ఆనందంగా అనిపించింది. ఇండియాలోనే క్వాలిటీతో సినిమా చేయగలమని విశ్వగారు చేసిన ప్రయత్నానికి నిదర్శనమే ఈ సినిమా. మన దగ్గర కూడా ఎంత అద్భుతమైన టీం ఉందని నిరూపించిన సినిమా ఇది. ఇది టెక్నీషియన్స్‌కి జరుగుతున్న ఒక సత్కారం అని చెప్పాలి. ఇలాంటి సినిమాలు మరెన్నో రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మా రాజాసాబ్ కూడా మీ అందరి అంచనాలకు తగినట్టుగా ఉంటుంది. అందరికీ థాంక్య'అన్నారు.



## 'కాంత' నవంబర్ 14న రిలీజ్

**దుల్కర్ సల్మాన్** పీరియాడికల్ మూవీ 'కాంత' టీజర్‌తో సంచలనం సృష్టించింది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ తమిళతెలుగు ద్విభాషా చిత్రంలో దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించింది. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. కాంత ఫస్ట్ సింగిల్ హే పసి మనసేకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ తాజాగా రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. కాంత నవంబర్ 14న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని వింటేజ్ అండ్ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ చాలా క్యురియాసిటీ పెంచింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ డానీ సాంచెజ్ లోపెజ్, ఆర్ట్ డైరెక్షన్‌ను థా. రామలింగం.

# 'బైసన్' తెలుగు ప్రేక్షకులందరికీ నచ్చుతుంది

## అక్టోబర్ 24న అందరూ చూడండి.. ప్రెస్ మీట్‌లో హీరో ధృవ్ విక్రమ్



**ధృవ్ విక్రమ్,** అనుపమ పరమేశ్వరణ్ జంటగా అప్లాజ్ ఎంటర్టైన్మెంట్స్, నీలం స్టూడియోస్ బ్యానర్ మీద పా. రంజిత్ సమర్పణలో సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా. రంజిత్, అదితి ఆనంద్ నిర్మాతలుగా మారి సెల్వరాజ్ తెరకెక్కించిన చిత్రం 'బైసన్'. ఈ సినిమాకి నివాస్ కె. ప్రసన్న సంగీతాన్ని అందించారు. ఇక ఈ మూవీని తెలుగులో జగదంబే ఫిల్మ్స్ బ్యానర్ మీద తెలుగులో అక్టోబర్ 24న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం (అక్టోబర్ 21) నాడు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. హీరో ధృవ్ విక్రమ్ మాట్లాడుతూ . 'బైసన్'ను తెలుగులో ప్రమోట్ చేసేందుకు మొదటి సారిగా హైదరాబాద్ వచ్చాను. అలా నాకు ఈ చిత్రం ఎంతో ప్రత్యేకంగా మారింది. నేను కొన్ని రోజుల క్రితం ఇక్కడికి షాపింగ్ చేసేందుకు వచ్చాను. అక్కడ ఆ షాప్ ఓనర్ నన్ను చూసి 'మీరు విక్రమ్‌లా ఉన్నారు' అని అన్నారు. అవును.. నేను ఆయన కొడుకుని అని చెప్పాను. మా నాన్న గారి కష్టం, సినిమా కోసం చేసే ప్రయోగాల గురించి చాలా చెప్పారు. ఆయన ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చి ఈ స్థాయికి ఎదిగారు. కానీ నేను ఆయన కొడుకుగా నాకు అన్నీ సులభంగానే అందాయి. కానీ ఆయనలా అందరి ప్రేమను సంపాదించేందుకు చాలా కష్టపడతాను. నాకు తెలుగులో నటించాలని ఉంది. 'బైసన్' కోసం మూడేళ్లు కష్టపడ్డాను. ఈ మూవీని చూడండి. నచ్చితే సపోర్ట్ చేయండి. నాన్న గారిలానే నేను కూడా చాలా కష్టపడి వంద శాతం ఎఫర్ట్ పెడతాను. నా కొడుకు కూడా ఇలా వస్తే..'మీ నాన్న ధృవ్ అంటే చాలా ఇష్టం' అని చెప్పే స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను. తమిళంలో మా సినిమాకు మంచి ఆదరణ దక్కింది. మారి సెల్వరాజ్ గారు తన జీవితంలో ఎదురైన అనుభవాలు, చూసిన సంఘటనల నుంచే కథల్ని రాసుకుంటారు. పీపుల్స్‌ని ఎడ్యుకేట్ చేయాలని ఆయన పరితపిస్తుంటారు. అర్జున అవార్డు గ్రహీత మణతి గణేషన్ కథ ఆధారంగా ఈ మూవీని మారి సెల్వరాజ్ గారు తెరకెక్కించారు. ఈ మూవీ కోసం నేను కబడ్డీ నేర్చుకున్నాను. నంబర్స్ గురించి కాకుండా తెలుగులో మా సినిమాను అందరూ చూడాలని కోరుకుంటున్నాను. తెలుగు ప్రేక్షకులందరికీ మా చిత్రం నచ్చుతుంది. అక్టోబర్ 24న అందరూ చూడండ్డి అని అన్నారు. అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ .. 'మారి సెల్వరాజ్ గారి మొదటి చిత్రంలో నేను నటించాల్సింది. కానీ అప్పుడు బిజీగా ఉండటం వల్ల కుదరలేదు. ఆయన దర్శకత్వంలో నటించాలనే కోరిక ఉండేది. ఇప్పుడు ఆయన తీసిన 'బైసన్' చిత్రంలో నటించడం ఆనందంగా ఉంది. తమిళంలో ఆల్రెడీ ఈ చిత్రానికి మంచి ఆదరణ దక్కింది. తెలుగులో రిలీజ్ చేయాలనే డిమాండ్ కూడా ఎక్కువైంది. మేం అక్టోబర్ 24న తెలుగు ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాం. ధృవ్‌తో నటించడం నాకు గర్వంగా ఉంది. అక్టోబర్ 24న'బైసన్' తెలుగులో రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయాలి' అని అన్నారు. నిర్మాత వీపీ సెల్వన్ బాలాజీ మాట్లాడుతూ 'బైసన్' మూవీని తెలుగులో రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. లింగుస్వామి, నా సోదరుడు చంద్రబోస్‌గారి వల్లే తెలుగులోకి ఈ మూవీని తీసుకు వస్తున్నాను. ఇది గొప్ప విజయం సాధిస్తుంది, చాలా మంచి చిత్రం అని లింగుస్వామి గారు మాకు సలహా ఇచ్చారు. ఈ మూవీని నేను చూశాను. తెలుగు ఆడియెన్స్‌కి తప్పకుండా కనెక్ట్ అవుతుందన్న నమ్మకం నాకు ఏర్పడింది. తమిళంలో ఆల్రెడీ బ్లాక్ బస్టర్ టాక్‌తో దూసుకుపోతోంది. ఇక ఇప్పుడు తెలుగులో అక్టోబర్ 24న మాచిత్రం రాబోతోంది. పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.



## 'ది బ్లాక్ గోల్డ్' ఫస్ట్ లుక్ రిలీజ్

**టాలీవుడ్ లక్కీ చార్మ్** సంయుక్త ఫస్ట్ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్ యోగేష్ కెఎంసి దర్శకత్వంలో చేస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సామజవరగమన, ఊరు పేరు భైరవకోన వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన నిర్మాత రాజేష్ దండా నిర్మిస్తున్నారు.సంయుక్త స్వయంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సింధు మాగంటి సహ నిర్మాత. నిన్న ఈ మూవీ టైటిల్ 'ది బ్లాక్ గోల్డ్' అని అనౌన్స్ చేశారు. దీపావళి సందర్భంగా చిత్రానికి సంబంధించిన ఇంటెన్స్, గ్రిప్పింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. చేతిలో పిస్టల్, టీషర్ట్, చేతులపై రక్తపు మరకలతో రైల్వే ఫ్లాట్ పై సంయుక్త కనిపించడం అదిరిపోయింది.రైల్వే స్టేషన్ అంతా శవాలతో నిండిపోయి, ఇంటెన్స్ ఫైట్ జరిగిందని సూచిస్తుంది. 'వెల్‌కమ్' అని రాసిన బోర్డు కింద సీలింగ్‌కివేలాడుతున్నవ్యక్తి కనిపించడం పోస్టర్‌కిమరింత క్యురియాసిటీ పెంచింది. సంయుక్త ఇప్పటివరకు చూడని యాక్షన్ అవతార్‌లో చూపించబోతోందని ప్రామిస్ చేస్తోంది. దర్శకుడు యోగేశ్ సంయుక్తని నెవర్‌సీన్‌బిఫోర్ అవతార్‌లో చూపించే పవర్‌ఫుల్ స్క్రిప్ట్ రాశారు. ఆమె చేసిన హైఆక్టేన్ స్టంట్స్ ప్రేక్షకులను షాక్‌కి గురి చేయబోతున్నాయి. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ఎ వసంత్ కెమెరా మ్యాన్ కాగా, సామ్ సిఎస్ సంగీతం అందిస్తున్నారు.

# నిర్మాత నుంచి దర్శకుడిగా మారుతున్నా: సెవెన్ హిల్స్ సతీష్



**సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్** బ్యానర్‌పై బట్టలరామస్వామి బయోపిక్, కాఫీ విత్ ఏ కిల్లర్, సోలోబాయ్ సినిమాలను నిర్మించిన ప్యాషనేట్ ప్రొడ్యూసర్ సెవెన్ హిల్స్ సతీష్ తన పుట్టినరోజు (అక్టోబర్ 23) సందర్భంగా నూతన ప్రయాణం మొదలుపెట్టినట్లు ప్రకటించారు. 3 విజయవంతమైన సినిమాలను నిర్మించి సతీష్.. త్వరలో దర్శకుడిగా మారబోతున్నట్లు తెలిపారు. డైరెక్టర్ కావాలనే లక్ష్యంతో ఇండస్ట్రీకి వచ్చిన తను నిర్మాతగా ప్రారంభమై సినిమా నిర్మాణానికి అన్నీ నేర్చుకుని పూర్తిగా సన్నద్ధం అయిన తర్వాత తన లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అలాగే తన బ్యానర్‌లో ఇంకో రెండు సినిమాలు తీస్తున్నట్లు చెప్పారు. ఎడిటర్ ప్రవీణ్ పూడి దర్శకత్వంలో ఒక సినిమా తీస్తున్నామని, రాజశేఖర్ గడ్డం దర్శకత్వంలో మరో సినిమా స్క్రిప్ట్ దశలో ఉందని చెప్పారు. నార్నె నితిన్ హీరోగా ఉగాది రోజున ప్రారంభమైన సినిమా అనుకోకుండా పట్టాలెక్కక పోవడంతో ఆ కథను సరికొత్తగా మార్చి త్వరలో సినిమా చేస్తున్నామని చెప్పారు. సోలోబాయ్ ఈవెంట్‌లో తన గురువు వీవీ వినాయక్ చెప్పిన విధంగా తాను డైరెక్టర్ అవ్వాలనే ప్రయత్నాన్ని ఈ పుట్టినరోజు సందర్భంగా మొదలు పెట్టినట్లు సెవెన్ హిల్స్ సతీష్ తెలిపారు. తన స్నేహితుల సహాయంతో వాళ్ల నిర్మాణంలో తన మొదటి సినిమా డైరెక్షన్ చేయబోతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ సతీష్ ప్రెస్‌మీట్‌లో మరిన్ని విషయాలు మాట్లాడుతూ.'నేను మీడియా ముఖంగా ఎప్పుడూ బర్త్ డే చేసుకోలేదు. నా ఫ్రెండ్స్ నాకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. తప్పకుండా బర్త్ డే చేసుకోవాలని సూచించారు. మూడు సినిమాల నిర్మాణంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా. అన్ని క్రాఫ్ట్‌లకు సంబంధించి విషయాలు నేర్చుకున్నాను. వయసులో ఉన్నప్పుడే డైరెక్షన్ చేయాలని వీవీ వినాయక్ గారు చెప్పడంతో డైరెక్టర్‌గా మారుతున్నా. డైరెక్టర్‌గా డెబ్యూ మూవీ అనేది చాలా ముఖ్యం. మంచి సినిమా చేస్తేనే మన ట్యాలెంట్ ఏంటనేది బయటపడుతుంది. ప్రస్తుతం మనం మెసేజ్ ఇస్తే చూసే మూడ్‌లో ఆడియన్స్ లేరు. అందుకే నవ్వించి ఎంటర్‌టైన్ చేస్తేనే ఆడియన్స్ థియేటర్లకు వస్తారు బలగం, లిటిల్ హార్ట్స్ వంటి సినిమాలతో అది ప్రూవ్ అయింది. అందుకే తక్కువ బడ్జెట్‌తో మంచి కంటెంట్ ఉన్న సినిమా చేస్తాను. డైరెక్టర్‌గా నేను ఏంటనేది నిరూపించుకుంటే తర్వాత పాన్ ఇండియా సినిమా చేయడానికి సిద్ధం. లిటిల్ హార్ట్స్ లాంటి కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తే దర్శకులకు మంచి గుర్తింపు ఉంటుంది' అని తెలిపారు. ముందుగా నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు అసిస్టెంట్ డైరెక్టర్‌గా కొన్ని చిత్రాలకు పని చేశాను. ఆ తర్వాత డబ్బు సంపాదించుకుని వద్దామని రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో కొంత డబ్బులు సంపాదించి, ఆ తర్వాత నిర్మాతగా ఇండస్ట్రీలో అడుగు పెట్టాను. సాధారణంగా ఇండస్ట్రీలో ఎత్తుపల్లాలు ఉంటాయని నాకు తెలుసు. ఒక మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలని ఆశయంతో నిర్మాతగా వచ్చాను. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది టాప్ డైరెక్టర్స్ వెంకీ అట్లూరి, సాగర్ చంద్ర, సంపత్ నంది, బలగం వేణు వంటి వారు నాకు మంచి స్నేహితులు. అలాగే నేను సురేష్ ప్రొడక్షన్స్ ఇంకా వేరే ప్రొడక్షన్స్‌లో కూడా పనిచేశాను. ఆ సమయంలో నందినీ రెడ్డి, మచ్చ రవి, నేచురల్ స్టార్ నానితో కూడా కలిసి డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేశాను. ఎన్నో వేలమంది, లక్షలమంది చూసి ఆదరించే సినిమాను.. వారు సంతృప్తి పరిచే విధంగా ఉండాలంటే ముందు కథ సెలెక్ట్ చేసుకునే విధానంలో ఎంతో జాగ్రత్త తీసుకోవాలి. నేను అటువంటి జాగ్రత్తలే తీసుకుని సినిమాలు తీస్తున్నాను. అలాగే సినిమాలు చేయడానికి ఇష్టం కాదు, పిచ్చి ఉండాలి. నాకు సినిమాలు అంటే అటువంటి పిచ్చే ఉంది. అందుకే సెలక్టెడ్‌గానే సినిమాలు చేస్తున్నాను అన్నారు.



## 'నారి నారి నడుమ మురారి' సంక్రాంతికి వరల్డ్ వైడ్ రిలీజ్

**చార్మింగ్ స్టార్ శర్వా** ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ నారి నారి నడుమ మురారిలో నటిస్తున్నారు. బ్లాక్ బస్టర్ 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సాక్షి వైద్య, సంయుక్త హీరోయిన్స్. ఫస్ట్ లుక్, ప్రమోషనల్ పోస్టర్లు ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. ఫస్ట్ సింగిల్ భిదర్శనమేఖి కూడా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. దీపావళిసందర్భంగా, ఈ చిత్రం 2026 సంక్రాంతికి రిలీజ్ అవుతుందని మేకర్స్ ప్రకటించారు. గతంలో 'శతమానం భవతి'తో బ్లాక్‌బస్టర్ అందించిన శర్వాకు సంక్రాంతి లక్కీ సీజన్. దీపావళి శుభాకాంక్షలు తెలియజేసేన పోస్టర్‌లో శర్వా సాంప్రదాయ పంచె కట్టులో పూల మంచం మీద స్టైలిష్‌గా నడుస్తున్నట్లు కనిపించడం ఆకట్టుకుంది. అందమైన డ్యాన్సర్స్, డ్రమ్మర్‌లతో పోస్టర్‌లో పండగ వైబ్ కనిపించింది. ఈ చిత్రానికి విశాల్ చంద్ర శేఖర్ సంగీతం అందిస్తుండగా, జ్ఞాన శేఖర్ విఎస్, యువరాజ్ కలిసి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. భాను బోగవరపు కథను రాశారు. నందు సావిరిగణ డైలాగ్స్ అందించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. అజయ్ సుంకర సహ నిర్మాతగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ చిత్రం షూటింగ్ పూర్తయ్యే దశలో ఉంది. నిర్మాతలు త్వరలో నెక్స్ట్ ప్రమోషన్స్‌ను ప్రారంభించనున్నారు.

# 'లవ్ ఒటిపి' చిత్రం అందరినీ అలరిస్తుంది

## ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజీవ్ కనకాల



**శ్రీమతి పుష్ప మణిరెడ్డి** సమర్ప ణలో భావప్రీత ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అనీష్ హీరోగా స్వీయ దర్శకత్వంలో రానున్న 'లవ్ ఒటిపి' చిత్రాన్ని విజయ్ ఎం రెడ్డి నిర్మించారు. ఈ చిత్రంలో రాజీవ్‌కనకాల ప్రధాన పాత్రలో నటిం చారు. జాన్విక, నాట్యరంగ వంటి వారు కీలక పాత్రల్ని పోషించారు. ఈ సినిమాను నవంబర్14న రిలీజ్‌చేయబోతున్నారు. ఈ మేరకు బుధవారం 'లవ్ ఓటీపీ'కి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈక్రమంలో నిర్వహించిన ఈవెంట్‌లో.. రాజీవ్ కనకాల మాట్లాడుతూ.. 'లవ్ ఓటీపీ' చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో చిత్రీకరించాం. ఇందులో నేను తండ్రి పాత్రను పోషించాను. కొడుకుని కూతురిలా చూసుకునే ఓ డిఫరెంట్ ఫాదర్ కారెక్టర్‌ను చేశాను. భావప్రీత బ్యానర్ మీద విజయ్ గారు ఈ మూవీని భారీ ఎత్తున నిర్మించారు. అనీష్ గారు తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. జాన్వికకి తెలుగులో మంచి ఫ్యూచర్ ఉంటుంది. ఆనంద్ గారి మ్యూజిక్ చాలా బాగుంటుంది.హర్ష గారి విజువల్స్ అద్భుతంగా వచ్చాయి. అనీష్ ఈ మూవీని ఇష్టపడి, కష్టపడి చేశాడు. రాజమౌళిలా అన్ని క్రాఫ్ట్‌ల మీద పట్టున్న అనీష్‌కు మంచి పేరు రావాలి. నవంబర్ 14న ఈ చిత్రం రాబోతోంది. అందరూ తప్పకుండా చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. హీరో, దర్శకుడు అనీష్ మాట్లాడుతూ.. 'హీరో అవ్వాలని చిన్నప్పటి నుంచీ కలలు కంటుండేవాడిని. వైజాగ్ మూర్తి వద్ద యాక్టింగ్ నేర్చుకున్నాను. ఎప్పటి నుంచో మళ్లీ తెలుగులోకి రావాలని చాలా ప్రయత్నాలు చేసి విఫలం అయ్యాను. మళ్లీ ఇప్పుడు ఇలా ఇన్నేళ్లకు టెక్నీషియన్‌గా, దర్శకుడిగా, హీరోగా ఆడియెన్స్ ముందుకు వచ్చాను. ఇందులో మంచి కంటెంట్ ఉంటుంది. ఈ రోజు అదే మా ఈవెంట్‌కు గెస్ట్. మేం కంటెంట్‌ను నమ్మి ఈ మూవీని చేశాం. రాజీవ్ కనకాల గారు ఈ మూవీని భుజానికెత్తుకుని ముందుకు తీసుకు వెళ్తున్నారు. నవంబర్ 14న ఈ చిత్రం రాబోతోంది. అందరినీ ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది. అందరూ చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాన్న అని అన్నారు. నిర్మాత విజయ్ ఎం రెడ్డి మాట్లాడుతూ..'అనీష్‌తో నాకు పదహారేళ్ల నుంచి బంధం ఉంది. సినిమా చేయాలని హైదరాబాద్‌కు వచ్చాం. ఇప్పుడు నేను నిర్మాతగా అనీష్‌ని హీరోగా, దర్శకుడిగా పరిచయం చేస్తున్నాను. అనీష్ ఎప్పుడూ కష్టపడుతూనే ఉంటాడు. ట్రైలర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను.

రాజీవ్ కనకాల గారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. నవంబర్ 14న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. హీరోయిన్ జాన్విక మాట్లాడుతూ.. 'తెలుగులో ఇదే నాకు మొదటి చిత్రం. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన నిర్మాత విజయ్ గారికి, హీరో, దర్శకుడు అనీష్ గారికి థాంక్స్. షూటింగ్ అంతా సరదాగా చేశాం. రాజీవ్ కనకాల గారితో పని చేయడం ఆనందంగా ఉంది. మా సినిమా నవంబర్ 14న రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. బాబా భాస్కర్ మాట్లాడుతూ. 'లవ్ ఓటీపీలో నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన అనీష్ గారికి థాంక్స్. నిర్మాత గారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. ఇందులో లవ్, మాస్ సాంగ్స్ ఇలా అన్నీ బాగుంటాయి. ఈ చిత్రం చాలా బాగా వచ్చింది. నవంబర్ 14న ఈ మూవీ రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు.

23-10Pg5 9_23-10Pg5.qxd 10/22/2025 10:55 PM Page 1



## ఆపరేషన్ సిందూర్ వీరులకు

# 'శౌర్య' పురస్కారాలు!




**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** దేశ రక్షణలో అసాధారణ ధైర్యసాహసాలు, విశిష్ట సేవలు అందించిన భారత సైనిక దళాల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం శౌర్య పురస్కారాలను ప్రకటించింది. ఇటీవల విజయవంతంగా ముగిసిన 'ఆపరేషన్ సిందూర్' సహా పలు కీలక ఆపరేషన్లలో పాల్గొన్న ఆర్మీ, వైమానిక దళాలకు చెందిన పలువురు అధికారులను ప్రతిష్ఠాత్మక 'వీర చక్ర' పురస్కారంతో గౌరవించింది. ఈ మేరకు కేంద్రం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ ఆపరేషన్లలో భాగంగా ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించిన 1988 (ఇండిపెండెంట్) మీడియం బ్యాటరీకి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ సుశీల్ బిస్త్‌కు వీర చక్ర లభించింది. అలాగే, అత్యంత రహస్యంగా, తక్కువ సమయంలోనే ప్రత్యేక పరికరాలను విమానాల ద్వారా సమర్థంగా తరలించి, సైనిక సామర్థ్యాన్ని చాటిన 302 మీడియం రెజిమెంట్‌కు చెందిన కల్నల్ కోశాంక్ లాంబాను కూడా ఈ పురస్కారం వరించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నుంచి పలువురు అధికారులు వీర చక్రకు ఎంపికయ్యారు. శత్రువుల కట్టుదిట్టమైన గగనతలంలోకి చొచ్చుకెళ్లి, నిర్దేశిత లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించినందుకు ఫైటర్ పైలట్ గ్రూప్ కెప్టెన్ రంజీత్ సింగ్ సిద్ధూకు ఈ గౌరవం దక్కింది.

ఫార్వర్డ్ ఎయిర్‌బేస్‌లో సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (ఎస్ఏఎం) స్క్వాడ్రన్‌కు నాయకత్వం వహించి, మన వనరులకు ఎలాంటి నష్టం జరగకుండా శత్రువులకు భారీ నష్టం కలిగించిన గ్రూప్ కెప్టెన్ అనిమేశ్ పట్నీ కూడా వీర చక్ర అందుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన మిషన్‌లో భాగంగా, అర్ధరాత్రి వేళ శత్రు భూభాగంలోకి ప్రవేశించి కోటలాంటి లక్ష్యాలను ధ్వంసం చేసిన స్క్వాడ్రన్ లీడర్ రిజ్వాన్ మాలిక్, సంక్లిష్టమైన వైమానిక దాడిలో అద్భుతమైన సమన్వయం ప్రదర్శించిన స్క్వాడ్రన్ లీడర్ సిద్ధాంత్ సింగ్‌లకు కూడా వీర చక్ర పురస్కారాలు ప్రకటించారు. మొత్తంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 127 గ్యాలంట్రీ అవార్డులు, 40 విశిష్ట సేవా పురస్కారాలకు ఆమోదం తెలిపారు. వీటిలో 4 కీర్తి చక్రలు, 15 వీర చక్రలు, 16 శౌర్య చక్రలు ఉన్నాయి.



# ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

- ఆ దిశగా ప్రయత్నాలు సాగాలి
- ట్రంప్‌తో ప్రధాని మోడీ ఆకాంక్ష
- ఫోన్‌లో దీపావళి శుభాకాంక్షలు చెప్పిన ట్రంప్
- వైట్ హౌస్‌లోను దీపావళి వేడుకలు
- వాణిజ్య ఒప్పందం వేళ ఆసక్తికర పరిణామం
- సుంకాలు తగ్గే అవకాశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడాలని, ఈ దిశగా ఉమ్మడి ప్రయత్నాలు జరగాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకాంక్షించారు. ఫోన్ చేసి దీపావళి శుభాకాంక్షలు చెప్పినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు అంటూ మోడీ ట్వీట్ చేశారు. "దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు. ఈ దీపావళి పండుగ నాడు రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచాన్ని ఆశతో ప్రకాశింపజేయడం కొనసాగించాలి. అన్ని రకాల ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐకనయంగా నిలబడాలని కోరుకుంటున్నా" అని మోడీ ఆ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంతోపాటు, ఉగ్రవాదులకు సురక్షితమైన స్వర్గధామంగా అందించడంలో పేరుగాంచిన పాకిస్తాన్‌తో అమెరికా సాన్నిహిత్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలకు ప్రాముఖ్యత సంతరించుకుంది. మంగళవారంనాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని మోడీకి ఫోన్ చేసిన దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇరు దేశాధినేతలు వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం. వైట్‌హౌస్‌లో ప్రత్యేక దీపావళి కార్యక్రమంలో ట్రంప్ దీపం వెలిగించి, ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ మంగళవారం తాను భారత ప్రధానితో ఫోన్‌లో మాట్లాడానని చెబుతూ, మోడీ గొప్ప స్నేహితుడు అని ప్రశంసించారు. తమ ఇద్దరి మధ్య చాలా మంచి సంబంధం ఉందని పేర్కొన్నారు. అలాగే ఇకపై ఆయన రష్యా నుంచి పెద్దగా ఆయిల్ కొనుగోలు చేయబోరని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగియాలని నేను ఎంతగా కోరుకుంటున్నానో.. మోడీ కూడా అంతే కోరుకుంటున్నారని అన్నారు. వారు మరీ ఎక్కువగా చమురు కొనడం మానేస్తారు.. రష్యా కూడా యుద్ధం ఆపేందుకు ప్రయత్నిస్తుందని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే భారత్ భారీగా చమురు కొనుగోళ్లను తగ్గించిందని.. మున్ముందు మరింతగా తగ్గిస్తుందని పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో నిర్వహించిన దీపావళి వేడుకలలో అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా, ఎఫ్‌బిఐ చీఫ్ కాష్ పటేల్, ఇంటెలిజెన్స్ హెడ్ తులసి గబ్బర్డ్, భారత్‌లో కొత్త అమెరికా రాయబారి సెర్గియో గోర్, భారతీయ అమెరికన్ వ్యాపార వేత్తలు పాల్గొన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై భారత్ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించనప్పటికీ.. బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ట్రంప్‌కు ఫోన్ చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయనకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో కూడా ట్రంప్ ఇలాంటి కామెంట్లే చేయగా.. న్యూఢిల్లీ ఆ వ్యాఖ్యలను గట్టిగా తిరస్కరించింది. "భారత్ ఆయిల్, గ్యాస్ ముఖ్యమైన దిగుమతిదారు. అస్థిరంగా ఉన్న ఇంధన పరిస్థితులలో భారతీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం మా స్థిరమైన ప్రాధాన్యత. మా దిగుమతి విధానాలు పూర్తిగా ఈ లక్ష్యం ద్వారానే నిర్దేశించబడతాయి" అని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. తమ ఇంధన విధానాలు కేవలం దేశ అవసరాలు, వినియోగదారుల ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటాయని భారత్ తేల్చి చెప్పింది.

**సుంకాలు తగ్గే అవకాశం:** దీపావళి శుభాకాంక్షలు చెప్పడానికే ప్రధాని మోడీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసినా, వారిద్దరి మధ్య ఎక్కువగా వాణిజ్యంపైనే చర్చ జరిగినట్లుగా సమాచారం. ఈ మేరకు రాయిటర్స్ పేరొనకంది.

తాజా ఫోన్ కాల్ సంభాషణ ప్రకారం రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం జరగవచ్చని, దీంతో అమెరికా సుంకాలు 16శాతం వరకు తగ్గించవచ్చని రాయిటర్స్ ఆ కథనంలో పేర్కొంది. త్వరలో జరిగే ఆసియాన్ శిఖరాగ్ర సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని నివేదించింది. భారత్‌పై ట్రంప్ తొలుత 25 శాతం సుంకం విధించారు. అనంతరం రష్యాతో సంబంధాలు కొనసాగిస్తుననందుకు జరిమానాగా మరో 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో భారత్‌పై 50శాతం సుంకం అమలవుతోంది. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో భారత్ – అమెరికా బంధం బలపడుతున్నట్లుగా కథనాలు పేర్కొంటున్నాయి. ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం జరగవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి.

# మానాన్న చివరి అంకంలో ఉన్నారు..

## సతీశ్‌జర్కిహోళి పెద్ద బాధ్యతలకు అన్ని విధాలా అర్హుడు

## సిఎం సిద్దరామయ్య తనయుడు యతీంద్ర సంచలన వ్యాఖ్యలు

**బెంగళూరు, అక్టోబరు 22:** కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య రాజకీయ భవిష్యత్తుపై ఆయన కుమారుడే చేసిన వ్యాఖ్యలు ఇపుడు కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో దుమారం రేపు తున్నాయి. తనయుడు యతీంద్ర తన తండ్రిపై చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. తన తండ్రి రాజకీయ జీవితం చివరిదశలో ఉందని కర్ణాటకలో రాజకీయ నాయకత్వాం చేపట్టేందుక సతీశ్ జర్కిహోళి అన్నివిధాలా అర్హుడని ఆయన అన్నారు. యతీంద్ర వ్యాఖ్యలు కర్ణాటకలో నాయకత్వ మార్పు అనివార్యం అని స్పష్టంచేస్తు న్నాయని కాంగ్రెస్ వర్గాల్లోనే వినిపిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి తనయుడే ఈ వ్యాఖ్యలుచేయడంతో వీటికి మరింత ప్రాధాన్యం పెరిగింది. బెళగావిజిల్లాలో బుధవారం జరిగిన కార్యక్రమంలో యతీంద్ర ఈ వ్యాఖ్యలుచేసారు. రాజకీయాల్లో తన తండ్రి చివరిదశలో ఉన్నారని, ఈ సమయంలో బలమైన ప్రగతిశీల భావజాలం కలిగిన నాయకుడు ఆయనకు అవసరమని అన్నారు. అలాంటి నాయకుడికి సిద్ధరామయ్య మార్గదర్శకునిగా ఉంటారని అన్నారు. సతీశ్‌జర్కిహోళికి ఆ లక్షణాలు న్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నడిపించేందుకు ఆయనే సరైన వ్యక్తి అన్నారు. ఈ గురుతరబాధ్యతలు స్వీకరించేందుకు ఆయన సంసిద్ధులు కావాలని అన్నారు. పెద్ద బాధ్యతలు అంటే సీఎం మార్పునే సూచిస్తున్నా యని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సీఎం మార్పుఅంశంపై సిఎం సిద్ధరామయ్య, డికెశివకుమార్‌మధ్య ఇప్పటికే పరోక్షంగా వాగ్వాదాలు జరుగుతున్నాయి.



ఈ సమంలో సతీశ్‌పేరు తెరపైకి రావడం గమ నార్హం. రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యంమంత్రి పీఠంలో మార్పు ఉంటుందని అధికారంలోకి వచ్చినప్పటినుంచి ప్రచారంలో ఉంది. పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఆవిధానంపైనే నమ్మకంతో ఉన్నారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రినని ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య చెపుతున్నా తన చేతుల్లో ఏమీలేదని డికెశివకుమార్ చెపుతున్నా ఇప్పటికీ ఊహాగానాలు చెలరేగుతూనే ఉన్నాయి. అయితే సిద్ధరామయ్యను దించితే కర్ణాటకలో పార్టీ రెండుగా చీలిపోతుందని హైకమాండ్ భయపడుతోంది. ఇపుడు హైకమాండ్ నిర్ణయం ఏమిటన్నదే కర్ణాటక కాంగ్రెస్ మొత్తం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నది.

## శ్వేతసౌధంలో సువిశాలమైన 'బాల్‌రూమ్'

### 999 అడుగుల విస్తీర్ణంలో రూ. 2200 కోట్లతో నిర్మాణం

**వాషింగ్టన్, అక్టోబరు 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన చిరకాల స్వప్నంగా భావిస్తున్న ప్రాజెక్టును పట్టాలెక్కించారు. శ్వేతసౌధం ప్రాంగణంలో అత్యంత సువిశాలమైన, ఆధునికమైన బాల్‌రూమ్ (నృత్య శాల) నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వెల్లడించారు. వైట్‌హౌస్ తూర్పు విభాగంలో ఈ నిర్మాణం కోసం సోమవారం కూల్చివేతలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వైట్‌హౌస్ మైదానంలోని తూర్పు విభాగంలో అతిపెద్ద, అందమైన బాల్‌రూమ్ నిర్మాణ పనులు మొదలయ్యాయని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నానని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. గత 150 ఏళ్లుగా ప్రతి అమెరికా అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో గ్రాండ్ పార్టీలు, ప్రత్యేక కార్యక్రమాల కోసం ఒక పెద్ద బాల్‌రూమ్ ఉండాలని కలలు కన్నారని, ఎట్టకేలకు ఆ ప్రాజెక్టు ఇప్పుడు ప్రారంభమైందని ఆయన వివరించారు. ఈ ఏడాది జూలైలో ఈ ప్రాజెక్టు గురించి ట్రంప్ మొదటిసారి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ భారీ నిర్మాణానికి సంబంధించిన ఓ ముఖ్యమైన విషయాన్ని కూడా ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును ప్రభుత్వ నిధుల నుంచి కాకుండా పూర్తిగా దాతలు అందించే విరాళాలతో భరిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనివల్ల అమెరికా ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడదని ఆయన పేర్కొన్నారు.

## మసూద్ సోదరి నాయకత్వంలో

# మహిళా జైషే!



**ముజఫరాబాద్, అక్టోబరు 22:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ 'జమాత్ ఉల్ మొమినాత్' పేరుతో తన తొలి మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. తాజాగా, జైష్ తుఫత్ అల్ ముమినాత్ పేరుతో ఆన్‌లైన్ శిక్షణా కోర్సును కూడా ప్రారంభించినట్లు తెలిపింది. దీని ద్వారా నిధులు సేకరించి, మరింతమంది మహిళలను ఆకర్షించాలని భావిస్తోంది. ఈ మహిళా బ్రిగేడ్‌కు మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నాయకత్వం వహించనున్నారు. మే నెలలో భారత దళాలు ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మర్కజ్ సుభానల్లాలోని జైష్ కార్యాలయంపై దాడి చేసినప్పుడు ఆమె భర్త యూసుఫ్ అజార్ మరణించినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో సంస్థను మరింత బలోపేతం చేయడంలో భాగంగా మరింతమంది మహిళలను నియమించుకోవాలని భావిస్తున్నారు. సంస్థను బలోపేతం చేయడం కోసం మరింత మంది మహిళలను నియమించుకోవాలని యోచిస్తున్నారు. మసూద్ అజార్, కుటుంబ సభ్యులు, అతని కమాండర్లు జిహాదీ, మతం, ఇస్లాంకు సంబంధించిన అంశాలపై మహిళలకు శిక్షణ ఇస్తారు" అని జైష్ ఏ మహమ్మద్ వర్గాలు తెలిపాయి. మహిళలను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు నవంబర్ 8 నుంచి ఆన్‌లైన్ లైవ్ క్లాసులు ప్రారంభించనున్నారు. ఈ శిక్షణలో భాగంగా ప్రతిరోజు 40 నిమిషాల పాటు మసూద్ సోదరీమణులు, కమాండర్ల కుటుంబ సభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి విరాళాలు కూడా సేకరిస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### రష్యా దాడుల్లో చిన్నారులు సహా ఏడుగురు మృతి : జెలెన్‌స్కీ



**కీవ్, అక్టోబర్ 22:** రష్యా తాజాగా చేపట్టిన డ్రోన్, మిస్సైల్ దాడుల్లో ఏడుగురు మరణించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోల్దోమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లోని రెండవ పెద్ద నగరమైన ఖార్కివ్‌లో ఉన్న కిండర్‌గార్డెన్‌పై అటాక్ జరిగింది. వరుస దాడుల వల్ల కీవ్‌లో కూడా నష్టం జరిగింది. చిన్నారులతో కలిపి సుమారు 26 మంది గాయపడినట్లు జెలెన్‌స్కీ చెప్పారు. అయితే బుడాపెస్ట్‌లో పుతిన్‌తో జరగాల్సిన భేటీని డొనాల్డ్ ట్రంప్ రద్దు చేసుకున్నారు. ట్రంప్, యూరోప్ నేతలు పిలుపు ఇచ్చినా ఫ్రంట్‌లైన్ వద్ద కాల్పులు ఆగడం లేదని రష్యా పేర్కొన్నది. బ్రియాన్‌స్క్ బోర్డర్ ప్రాంతంలో ఉన్న రష్యా రసాయనిక ప్లాంట్‌పై ఉక్రెయిన్ మిలిటరీ అటాక్ చేసింది. బ్రిటన్ పంపిన స్టార్మ్ షాడో మిస్సైల్‌తో ఉక్రెయిన్ ఆ దాడిలో పాల్గొన్నది. రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఛేధించి ఆ స్టార్మ్ షాడో క్షిపణులు విజయవంతంగా దూసుకెళ్లినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది.

### వైట్‌హౌస్ భద్రతా గేటును ఢీకొట్టిన కారు



**వాషింగ్టన్, అక్టోబరు 22:** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్ద మంగళవారం రాత్రి తీవ్ర కలకలం రేగింది. ఓ వ్యక్తి తన కారుతో నేరుగా వచ్చి భద్రతా గేటును ఢీకొట్టాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భవనం లోపలే ఉన్నారని, దీంతో భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారని యూఎస్ సీక్రెట్ సర్వీస్ వెల్లడించింది. వాషింగ్టన్‌లోని 17వ ఈ స్ట్రీట్స్ కూడలి సమీపంలో రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఓ కారు వేగంగా దూసుకొచ్చి వైట్‌హౌస్ ఆవరణలోని సెక్యూరిటీ గేటును ఢీకొట్టింది. వెంటనే స్పందించిన సీక్రెట్ సర్వీస్ యూనిఫాం విభాగం అధికారులు ఆ కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో వైట్‌హౌస్‌కు ఎలాంటి లాక్‌డౌన్ విధించలేదని అధికారులు స్పష్టం చేశారు. కారును క్షుణ్ణంగా తనిఖీ చేసారు.

## శారీరకసంబంధం పదంతో లైంగికదాడిని నిర్ధారించలేం!

### పోక్సో కేసు కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** పోక్సో చట్టం కింద నమోదైన ఒక కీలక కేసులో ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధితురాలు తన వాంగ్మూలంలో ఉపయోగించిన శారీరక సంబంధం అనే పదం చాలా అస్పష్టంగా ఉందని, కేవలం ఆ పదాన్ని ఆధారంగా చేసుకుని అత్యాచారం లేదా లైంగిక దాడి జరిగిందని నిర్ధారించలేమని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు విధించిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను రద్దు చేస్తూ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది. రాహుల్ అలియాస్ భూపిందర్ వర్మ అనే వ్యక్తి తన 16 ఏళ్ల కజిన్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు అతడిని దోషిగా తేల్చి పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ నిందితుడు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ అప్పీలుపై విచారణ జరిపిన జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, ప్రాసిక్యూషన్ నేరాన్ని నిస్సందేహంగా నిరూపించడంలో విఫలమైందని అభిప్రాయపడింది. కేవలం శారీరక సంబంధం అనే పదాన్ని ఉపయోగించడం వల్ల, దానికి సరైన ఆధారాలు లేనప్పుడు, నేరం జరిగినట్లుగా భావించలేమని కోర్టు పేర్కొంది. భారత శిక్షాస్మృతి (ఐపీసీ)లో గానీ, పోక్సో చట్టంలో గానీ ఈ పదానికి నిర్దిష్ట నిర్వచనం లేదని గుర్తుచేసింది. బాధితురాలు శారీరక సంబంధం అని చెప్పినప్పుడు, దాని అర్థం ఏమిటో, అది లైంగిక దాడి కిందకు వస్తుందో లేదో ప్రాసిక్యూషన్ గానీ, ట్రయల్ కోర్టు గానీ స్పష్టత కోరలేదని హైకోర్టు తప్పుబట్టింది. సాక్షుల నుంచి సరైన వాస్తవాలను రాబట్టాల్సిన బాధ్యత కోర్టుపై ఉందని ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 165ను ఉటంకించింది. ఈ కేసులో ఘటన జరిగిన దాదాపు ఏడాదిన్నర తర్వాత మార్చి 2016లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపైనా హైకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. నిందితుడు పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు విషం తాగిందని, ఆ తర్వాత ఆమెకు మాట పడిపోయిందని, తిరిగి మాట వచ్చిన తర్వాత ఫిర్యాదు చేశారని ప్రాసిక్యూషన్ వాదించింది. అయితే, ఈ వాదనను బలపరిచే ఎలాంటి వైద్యపరమైన ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. ఇంత సుదీర్ఘ జాప్యానికి సరైన కారణాలు చూపడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఇది ఒక దురదృష్టకరమైన కేసుఅని వ్యాఖ్యానిస్తూ, ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేసింది. నిందితుడిని వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది.



## ఎల్వోసి వెంబడి మళ్లీ చురుకుగా ఉగ్రశిబిరాలు!

### హోంశాఖకు నిఘా వేగుల నివేదిక

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** ఆపరేషన్ సింధూర్ తర్వాత తునాతునకలయిన ఉగ్రవాద స్థావరాలు మళ్లీ జీవంపోసుకుంటున్నాయి. వాస్తవాధీనరేఖ వెంబడి మళ్లీ ఉగ్ర లాంచ్‌ప్యాడ్‌లు, ఉగ్రశిక్షణ శిబిరాలు ప్రారంభం అయినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని భారత సరిహద్దుప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తున్నట్లు తేలింది. చిన్నచిన్న క్లాసులు రూపంలో వీటినినిర్వహిస్తున్నారు. అయితే సాంకేతికతను జోడించి ఆధునిక పరిజ్ఞానంతో వీటిని నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. తద్వారా ఈ శిక్షణా శిబిరాలు డ్రోన్ నిఘాలను, వైమానిక దాడులను సైతం తప్పించుకునేదిశగా ఈ శిబిరాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖకు అందిన నిఘా నివేదికల్లో సుమారు 100 మంది ఉగ్రవాదులకు సరిహద్దుల్లో శిక్షణ జరుగు తోందని, ఎంతమేర ఈశిబిరాలు విధ్వంసం చేసినా మళ్లీ పురుడు పోసుకుంటున్నాయని తెలిపింది. దీనితో ఇపుడు హోంశాఖ అన్ని దళాలను అప్రమత్తంచేసి వ్యూహాత్మక కసరత్తును సిద్ధంచేసుకోవాలని సూచించింది. సరిహద్దుల్లో ఇప్పటికీ ఉగ్రముప్పు దాగి ఉన్నందున మరింత నిఘాను పెంచుకోవాలనిసూచించింది. లూని, పుత్వాల్, టిపు పోస్ట్, జామిల్‌పోస్ట్, ఉమ్రాన్ వాలి, చాప్రార్ ఫార్వార్డ్, ఛోటా చక్, జంగ్లోరా ప్రాంతాల్లో ఉగ్రశిబిరాలు మళ్లీ చురుకుగా పనిచేస్తున్నాయని నిఘా వర్గాలు హోంశాఖకు నివేదిక ఇచ్చాయి. భద్రతా దళాలు వీటిని నిర్మూలించడానికిసైతం వీలులేని విధానంలో శిక్షణ ఇవ్వడం అక్కడి నుంచి కనుమరుగవడంచేస్తున్నాయని తేలింది.



## సెర్బియా పార్లమెంట్‌పై ఉగ్రదాడి

- కాల్పులు.. టెంట్ దగ్ధం
- ఓ అనుమానితుడు అరెస్టు

**బెల్‌గ్రేడ్ (సెర్బియా), అక్టోబరు 22:** సెర్బియా పార్లమెంట్ వద్ద కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పులో ఒకరు గాయపడ్డారు. అలాగే అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ మద్దతుదారులకు చెందిన టెంట్‌కు నిప్పు పెట్టారు. భద్రతా అధికారుల సమాచారం ప్రకారం, పార్లమెంట్ వెలుపల కాల్పులు చోటుచేసుకున్నాయని, అదే సమయంలో టెంట్ అగ్నికీలలో దగ్ధమైంది. కాల్పుల్లో 57ఏళ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్రమత్తమైన సాయుధ భద్రతా దళం ఘటనా స్థలంలో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. దాడికి ఎవరు పాల్పడ్డారన్నది తెలియడం లేదు. ఘటనను ఉగ్రవాదచర్యగా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ అభివర్ణించారు.

## తమిళనాడులో భారీ వర్షాలు

### లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు



**చెన్నై, అక్టోబరు 22:** తమిళనాడును భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కడలూరు జిల్లాలో కుండపోత వానకు ఓ నివాసం కూలిపోవడంతో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీరం దాటే అవకాశం ఉండటంతో తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా జిల్లాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. వాతావరణ శాఖ తమిళనాడులోని చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ప్రకటించింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలకు 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సహాయక శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెంగల్‌పట్టు కలెక్టర్ డి. స్నేహ మాట్లాడుతూ, వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేశాం. నీటిని తోడే పంపులు, సహాయక కేంద్రాలు, కమ్యూనిటీ కిచెన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకుడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచారు.

## శ్రీలంకలో కౌన్సిల్ చైర్మన్ కాల్చివేత!



**కొలంబో, అక్టోబర్ 22:** శ్రీలంకకు చెందిన ఓ రాజకీయ నేత పార్టీ ఆఫీస్‌లో దారుణ హత్యకు గురయ్యారు. వెలిగామా కౌన్సిల్ చైర్మన్ లసంత విక్రమశేఖర బుధవారం తన కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆఫీస్‌లోకి చొరబడ్డారు. తమ వద్ద ఉన్న గన్‌తో విక్రమశేఖరపై పలు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం పరారయ్యారు.

తీవ్రంగా గాయపడిన విక్రమశేఖరను ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని, దుండగుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది.

## కన్నతల్లిని హత్యచేసిన కసాయి

**చండీగఢ్, అక్టోబరు 22:** దేశమంతా దీపావళి సంబరాల్లో మునిగివున్న వేళ చండీగఢ్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కన్న కొడుకే కాలయముడై తన తల్లిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం సెక్టార్ 40లో నివసిస్తున్న 60 ఏళ్ల సుశీల అనే మహిళను ఆమె కొడుకు రవీందర్ నేగి అలియాస్ రవి (40) కత్తితో పొడిచి చంపాడు. దీపావళి రోజు ఉదయం 7 గంటల సమయంలో సుశీల ఇంట్లో నుంచి గట్టిగా కేకలు వినిపించాయని పొరుగున ఉంటున్న ఆకాశ్ బెయిన్స్ పోలీసులకు తెలిపారు. దీంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేసరికి ఇంటికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. వారు టెర్రస్ పైనుంచి ఇంట్లోకి ప్రవేశించి చూడగా, రవి చేతిలో కత్తితో పారిపోవడం కనిపించింది. లోపల సుశీల రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే స్థానికులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



తడ మండలం చేనిగుంట వద్ద మునిగిన పంట పొలాలు

# తడలో కుండపోత

**మునిగిన పంటపొలాలు... రైతులకు తీవ్రనష్టం**

తడ, అక్టోబరు 22 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా తడ మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. తీరప్రాంత గ్రామాలు బిక్కుబిక్కుమంటున్నాయి. మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాలను వరదనీరు చుట్టుముట్టింది. బుధవారం ఇక్కడ 97.8 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. తడ మండలంలో ప్రతిరోజు జల్లులుగా వర్షం కురుస్తుంది. ఈ వాన వలన ముందుగా వేసుకున్న ఎలిది పైర్లు మునిగిపోయాయి. వరినాట్లకు, పొలాల దుక్కులు వేసుకునేందుకు అంతరాయం కలిగింది. రైతులు నిన్నమొన్నటి దాకా పొలాల్లో నీటి కోసం అల్లాడితే, ప్రస్తుతం ఆ నీటిని వెలికి తీసేందుకు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు పులికాట్ సరస్సు నిండుకుండలా మారింది. జాలర్లు పడవలు ఎక్కడ రేవుల్లో అక్కడ భద్రపరుచుకున్నారు. చేపల వేటకు వెళ్లి వారం రోజులైంది. ఈ వర్షం మరో మూడురోజులు కొనసాగుతుందని వాతావరణ హెచ్చరికలు మరింత భయపెడుతున్నాయి. తిరుపతి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక అధికారులు అప్రమత్తమై కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని తెలుసు కుంటున్నారు. గ్రామాల్లో పనిచేసే విఆర్ఓలు, సెక్రటరీలు కూడా వరద పరిస్థితిని అధికారులకు తెలియజేస్తున్నారు. పలుచోట్ల పక్కాగృహాలు ఉరుస్తు న్నాయి. వాటంబేడు, గ్రద్దగుంటల మధ్య కాళంగి నది వద్ద విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచి పోతోంది. జోరువానలోను సిబ్బంది వీటిని సరిదిద్ది మళ్లీ విద్యుత్ సరఫరా ఇస్తున్నప్పటికీ ఎప్పుడు వస్తుందో రాదో తెలియక ఆ మధ్యలోని కనీసం పది గ్రామాల ప్రజలు సతమతమవు తున్నారు. బుధవారం కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్యకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వతంగా పరిష్కరించాలని తడ మండల ప్రజలు కోరుతున్నారు.


# కుప్పంలో అలీప్, ఫ్రంటైయర్

- కడతో ఒప్పందాలు... త్వరలో పరిశ్రమలు
- మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అడుగులు
- సిఎం చంద్రబాబునాయుడు చొరవతో చకచకా చర్యలు

కుప్పం, అక్టోబరు 22 ప్రభాతవార్త: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కుప్పం నుంచే శ్రీకారం చుడతామని ప్రకటించిన సిఎం చంద్రబాబునాయుడు ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందితే వారి కుటుంబాలు కూడా బలోపేతం అవుతాయని భావించి కుప్పంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చొరవ చూపుతున్నారు. ఈ క్రమంలోనే కుప్పం నియోజకవర్గంలో హైదరాబాద్‌కు చెందిన అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్యూనర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) సంస్థ, రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన ఫ్రంటైయర్ మార్కెట్ సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చాయి. ఈసంస్థలు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అలీప్ సంస్థ కుప్పంలో ఇదివరకే ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు వారు ఏర్పాటు చేయదలచుకున్న పరిశ్రమలకు సంబంధించి వారికి శిక్షణ కల్పించడంతో పాటు హైదరాబాద్‌లో ఇండస్ట్రియల్ విజిట్‌ను క్షేత్రస్థాయిలో నిర్వహించి కుప్పం ప్రాంత మహిళలకు పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. కాగా అలీప్ సంస్థ కుప్పంలోనే రూ.26.7కోట్ల పెట్టుబడులతో ఇండస్ట్రియల్ పార్క్ (మహిళాశక్తి భవన్) నిర్మాణంకు ముందుకు వచ్చింది. ఈ సంస్థ కార్యకలాపాలు మొదలైతే 3500మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ఇక దేశంలో ఇ-కామర్స్ రంగంలో పేరుపొందిన ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థ కూడా కుప్పంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ఈ సంస్థ గ్రామీణ ప్రా ంత మహిళలకు డిజిటల్ వ్యాపార నిర్వహణపై శిక్షణ ఇచ్చి వారి ద్వారానే ఆర్థిక కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ప్రజలకు అవసరమైన చిన్న వస్తువులు మొదలు ల్యాప్‌టాప్‌ల వరకు ఈ సంస్థ ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకే మేరీ సహేలీ యాప్ ద్వారా అందుబాటులో తెచ్చింది. తద్వారా ఈయాప్ నుంచి వివిధ రకాల వస్తువులు తక్కువ ధరలకే కొనుగోలు చేయడంతో పాటు వీటిని ఆర్డర్ చేస్తున్న మహిళలకు కూడా ఆర్థికంగా తోడ్పాటు లభిస్తోంది. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చిరువ్యాపారాలు నిర్వహించుకునే మహిళలకు కూడా సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంతంలో ఇ-సైకిళ్లను పంపిణీ చేస్తున్నారు. మార్కెట్లో 35-40వేలధర పలికే ఇ-సైకిల్‌ను రూ.9600లకే అందించడం జరుగుతోంది. తద్వారా గ్రామీణ మహిళలు ఈ సైకిళ్ల ద్వారా గ్రామాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఏది ఏమైనా కుప్పం ప్రాంతంలో మహిళల ఆర్థికాభ్యున్నతికి సిఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారనే చెప్పాలి.

## తూపిలిపాలెం వద్ద ఎగసిపడుతున్న అలలు



వాకాడు, అక్టోబరు 22 ప్రభాతవార్త: తూపిలిపాలెం వద్ద ఎగసిపడుతున్న అలలు ఎగసిపడుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. బుధవారం తూపిలి పాలెం బంగాళాఖాతం సముద్ర తీరములో ఎగసిపడుతున్న అలలను పరిశీలించారు. తీర ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ తెలిపారు. అవసరమైతే మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఆయా పంచాయతీలలో అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా పలుచోట్ల జడివాన కురుస్తోంది. ముందస్తుగా లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధించిన అధికారులను తహసీల్దార్ కోరారు. అన్ని పంచాయతీలలో రోడ్లు, విద్యుత్తు, ఉండాలని ఆయా సంబంధించిన అధికారులను కోరారు. సముద్రం ముందుకు వచ్చిన వెంటనే సంబంధించిన అధికారులకు తెలియజేయాలని కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో కోటి బిల్వార్చనకు పూజాసామగ్రిని తీసుకు వస్తున్న డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి

# శాస్త్రోక్తంగా కోటి బిల్వార్చన

శ్రీకాళహస్తి, అక్టోబరు 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా కోటి బిల్వార్చన, కోటి కుంకుమార్చనలు ప్రారంభమయ్యాయి. సహస్రలింగేశ్వరుని సన్నిధి వద్ద కైలాసగిరి కొండకోనల్లోంచి తెచ్చిన బిల్వాలతో స్వామికి అర్చన చేయటం. అలాగే దాతలు, దేవస్థానం భాగస్వామ్యంతో అందుబాటులో ఉంచిన కుంకుమలతో పూజలు ప్రారంభించారు. ఉదయం ఆలయంలోని సహస్రలింగేశ్వరాలయం వద్ద డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి హాజరు కాగా ఆలయ ప్రధానార్చకులు నిరంజన్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి పర్యవేక్షణలో కోటి బిల్వార్చన, కుంకుమార్చనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సహస్రలింగేశ్వరుని ఆలయం ఎదురుగా కలశ స్థాపన గావించారు. స్వామి అమ్మవార్లను ఆవాహన గావించుటకు వేదమంత్రాలను పఠించారు. దీక్షాధారణ గావించారు. తరువాత వేదపండితుల వేద మంత్రాలతో ఆలయం దద్దరిల్లింది.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న కోటి బిల్వార్చన, కోటి కుంకుమార్చనలకు సంబంధించి పౌరోహితులు అర్ధగిరి స్వామి వివరిస్తూ స్వామి వారికి కోటి బిల్వార్చన, అమ్మవారికి కోటి కుంకుమార్చనలు నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఈ పూజలు 27 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. బహుళ చతుర్థశి అమావాస్య సందర్భంగా ముగిస్తుందన్నారు. ఆ రోజు ఆలయంలో సహస్ర శంఖాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈ పూజల్లో భక్తులు కూడా భాగస్వామి కావచ్చునని వివరించారు.



# శివయ్య సన్నిధిలో ఢిల్లీ హోం మంత్రి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం న్యూఢిల్లి హోం శాఖ మంత్రి ఆశిష్‌సూద్ కుటుంబసభ్యులతో కలసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. మంత్రి ఆశీష్ సూద్ కుటుంబసభ్యులతో ఆలయానికి రాగా రాగా దక్షిణ గోపురం వద్ద వారికి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవి వేదపండితులచే స్వాగతం పలికారు. మంత్రి తాను ఇక్కడ నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ప్రత్యేక విఐపి టిక్కెట్టులో వేదపండితులచే పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. పూజల అనంతరం వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను ఆలయ ఇఓ బాపిరెడ్డి అందించారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు.



జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యురాలు భారతి సాయని సమీక్ష

# విద్యార్థినుల బాత్‌రూమ్‌లో సిసికెమెరాలు దోషులకు శిక్షపడేలా చర్యలు

**జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యురాలు భారతి సాయని**

చిత్తూరు, అక్టోబరు 22 ప్రభాతవార్త: చిత్తూరు అపోలో యూనివర్సిటీలో విద్యార్థినిల బాత్‌రూమ్‌లో రహస్య కెమెరాల వ్యవహారంపై బుధవారం జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యురాలు భారతి సాయని అపోలో యూనివర్సిటీలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి సాయని మాట్లాడుతూ ఈ వ్యవహారంపై ఇప్పటికే పోలీసు విచారణ సాగుతోందని, దోషులను తొందరగా న్యాయస్థానం ముందు నిలిపి శిక్షపడేలా చేయాలని పోలీసులను కోరామన్నారు. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా మానవ హక్కుల ఉల్లంఘన కింద సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించి ఇక్కడికి వాస్తవాలు తెలుసుకోవడం కోసం విచారణకు వచ్చామన్నారు. ఈ ఘటనకు సంబంధించి తాను విద్యార్థినిలతో ముఖాముఖి మాట్లాడగా ఎలాంటి సమస్యలేవని చెప్పడం జరిగిందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అధికారులు ఎస్.జ్యోతి, హరినాథ్‌రెడ్డి, అపోలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పోతురాజు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేష్‌కుమార్‌రెడ్డి, డిఎస్పీలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పండుగల వేళ రైలు ప్రయాణికుల రద్దీ

# సమన్వయంతో నియంత్రణ

డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



గుంతకల్లు రైల్వే, అక్టోబరు 22 ప్రభాతవార్త: దసరా, దీపావళి, ఛాట్ పండుగల సమయంలో రైలు ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని గుంతకల్లు రైల్వే డివిజన్ వివిధ విభాగాల సమన్వయంతో సమర్థవంతంగా నియంత్రించిందని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిసిఎంఎస్ మనోజ్ తెలిపారు. స్థానిక డిఆర్ఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 22 నాటికి దసరా, దీపావళి, ఛాట్ పండుగల సందర్భంగా గుంతకల్లు డివిజన్ 66 ప్రత్యేక రైళ్లతోపాటు, వివిధ ప్రాంతాల నుంచి డివిజన్‌కు వచ్చిన 12 రైళ్లతోపాటు, గుంతకల్లు డివిజన్ మీదుగా వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే మరో 54 రైలు సర్వీసులలో ప్రయాణీకులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గట్టిచర్యలు తీసుకున్నామని వివరించారు. ఛాట్ పూజాను పురస్కరించుకుని 54 ప్రత్యేక రైళ్లను నడపడంతోపాటు, వివిధ ప్రాంతాల నుంచి డివిజన్‌కు వచ్చే మరో తొమ్మిది రైలు సర్వీసులను, గుంతకల్లు డివిజన్ మీదుగా వివిధ ప్రాంతాలమధ్య రాకపోకలు సాగించే మరో 45 రైలు సర్వీసులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణీకులకు ప్రయాణ వసతిని కల్పించడానికై వివిధ రెగ్యులర్ రైళ్లకు అదనపు బోగీలను జోడించినట్లు తెలిపారు. ప్రధాన స్టేషన్లలో చేపట్టిన సమగ్ర రద్దీ నియంత్రణ, మౌలిక సదుపాయాలు కల్పన, సౌకర్యాల చర్యల గురించి వారు వివరించారు. తిరుపతి, రాయచూరు, గుంతకల్లు ప్రధాన స్టేషన్లలో ప్లాట్‌ఫామ్‌లపైకి రద్దీ నియంత్రిణ చర్యలో భాగంగా హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ హోల్డింగ్ ప్రాంతాలలో తగినంత సీటింగ్, లైటింగ్, తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని ప్రధాన స్టేషన్లలో సి.సి. కెమెరాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బుకింగ్ కౌంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. రద్దీ రోజులలో స్టేషన్లలో రేయింబవళ్ళు పర్యవేక్షణ కోసం ఆపరేటింగ్, కమర్షియల్, ఆర్.పి.ఎఫ్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ సిగ్నల్, టెలికాం వంటి విభాగాల నుండి అధికారులు, సూపర్‌వైజర్లతో కూడిన సంయుక్త బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఐఆర్‌సిటిసి సమన్వయంతో ఆన్‌బోర్డ్ క్యాటరింగ్ సేవలను ఏర్పాటు చేయడమైనది. అధిక చార్జీలు, అనధికార విక్రయాలు మొదలైన కేసులను నివారించడానికి తనిఖీలు నిర్వహించామని ఆయన తెలిపారు. రద్దీ నియంత్రణ చర్యలు, ప్రయాణీకుల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు మొదలైన వాటిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రయాణీకులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో పిఆర్ఐ హేమంత్‌కుమార్, సిసిఐలు హరిబాబు, కిశోర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



# శివయ్య సేవలో సినీ నటులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో బుధవారం సినీనటులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైకాపా శ్రేణులు స్వాగతం పలికారు. మాజీ మంత్రి ఆర్‌కె రోజా, రవళి కుటుంబసభ్యులతో రాగా దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం వేదపండితుల తో ఆశీర్వదించారు. వారికి వైకాపా శ్రేణులు అంజూరు తారక శ్రీనివాసులు, లోకేష్ యాదవ్, శ్రీవారి సురేష్, తేజ రాయల్, ప్రసాద్, చందు స్వాగతం పలికారు.



# రికార్డ్ స్థాయిలో వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1,87 కోట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 22 ప్రభాతవార్త: ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధిచెందిన కోనసీమ తిరుమల, వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ1,87,33,329ల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమీషనర్, కార్య నిర్వాహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి, డి.సురేష్ బాబు, తనిఖీ అధికారి జె. రామ లింగేశ్వరరావు, గ్రూపు దేవాలయాలు కార్యనిర్వహణాధికారి పివివిఎస్ కామేశ్వరరావులు పర్యవేక్షణాధికారులుగా హుండీల లెక్కింపు చేపట్టడం జరిగిందని తెలిపారు. 35 రోజులకు ఆదాయం లెక్కించగా ఆలయ ప్రధాన హుండీల నుండి నగదు రూ.1,41,69,487లు. అన్నదానం రూ.45,63,842 కలిపి మొత్తం రూ.1,87,33,329 సమకూరిందని తెలిపారు. అలాగే బంగారం 47 గ్రాములు, వెండి కేజీ. 240 గ్రాములతో పాటు 6 దేశాల విదేశీ కరెన్సీ 25 నోట్లు వచ్చాయని ఆలయ డిప్యూటీ కమిష నర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పులపర్తి రాం బాబు, వర్మ, మనోజ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వై శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ కుమార్, నారాయణ, కనకయ్య, ప్రసాద్, ఏపుగంటి వెంకటేష్, గ్రామస్తులు, దేవస్థానం సిబ్బంది, గోదావరి గ్రామీణ బ్యాంకు, కెనరా బ్యాంకు సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో ప్రజల్లో సంతృప్తి

- అభివృద్ధి, సంక్షేమంపై ఆనందోత్సాహాలు
- ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహించిన సర్వేలో వెల్లడి: మంత్రి పార్థసారథి

విజయవాడ, అక్టోబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలపై రాష్ట్ర ప్రజల్లో 75 శాతం మందికి పైగా సంతృప్తిని వ్యక్తం చేసినట్లు ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడైనట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల నాడి, ప్రభుత్వ సేవలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందు తున్న తీరుపై ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించడం జరుగుచున్నదని తెలిపారు. మిగిలిన 25శాతం అసంతృప్తికి కారణాలు తెలుసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నా మని, నూటికి నూరు శాతం కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పనితీరుపై సీఎం నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో ప్రజల సంతృప్త స్థాయి 75 శాతంకు పైగా ఉండటం తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారన్నారు. అయితే నూటికి నూరు శాతం సంతృప్త స్థాయి చేరేవరకు కృషి చేయాలని ఆయా శాఖాధిపతులను ఆదేశించారని మంత్రి తెలిపారు. ప్రజల అసంతృప్తికి కారణాలు తెలుసుకుని పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించడం జరిగిందన్నారు. మిగిలిన అసంతృప్తికి కారణాలు అధికారుల వైఫల్యమా, ప్రజాప్రతినిధుల వైఫల్యమా తెలుసుకుని దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారని మంత్రి పార్థసారథి తెలిపారు. విద్యుత్ వినియోగంలో లోఓల్టేజీ, విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. సబ్ స్టేషన్ ఒక యూనిట్‌గా తీసుకుని సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తున్నదని, ప్రభుత్వం ఏర్పడి కేవలం ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.7.65 లక్షల కోట్ల పైబడి పెట్టుబడులు రాష్ట్రానికి రావడం జరిగిందని, తద్వారా 182 ప్రాజక్టుల్లో 7.21 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ఉచిత ఇసుక పాలసీ వల్ల ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం రాకపోయినా త్యాగం చేసి మరీ ఉచిత ఇసుక అందిస్తున్నామన్నారు. అలాగే హౌసింగ్‌లో ఏ విషయంలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారో తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందని, హౌసింగ్ బిల్లులు త్వరలోనే చెల్లించనున్నామన్నారు. వాట్సప్ గవర్నెన్స్‌లో భాగంగా 741 సర్వీస్‌లు అందుబాటులోకి మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, కాని ప్రజలు ఆశించినంత స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదని సీఎం చంద్రబాబు సమీక్షలో గుర్తించారన్నారు. ఈ సేవలను యూజర్ ఫ్రెండ్లీగా రూపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వర్షాకాలంలో పిడుగులు పడే ప్రాంతాలు, భారీ వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేసే మెసేజ్‌లు ప్రజలకు చేరవేయడంలో ముందున్నామన్నారు. తుఫాన్ ప్రభావంకు గురయ్యే ప్రాంతాలను సైతం ఖచ్చితత్వంతో కూడిన సమాచారం అందిస్తున్నామన్నారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రజలకు ఆ సేవలు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.



డ్రోన్ పాలసీ రూపొందించిన తర్వాత రాష్ట్రంలో 2,10,047 గంటలకు పైగా డ్రోన్లను వినియోగించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సేవలకు 64,759 గంటలు, ప్రైవేట్ గా 1,45,288 గంటలు వినియోగించడం జరిగిందన్నారు. అలాగే పంట పోలాలకు పురుగు మందులు పిచికారి చేయడానికి లక్షన్నర కు పైగా గంటలు వినియోగించినట్లు వివరించారు. డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారి చేయడం వలన ఎంత మేర ప్రయోజనం చేకూరిందన్న అంశంపై గణన జరుగుతుందన్నారు. డ్రోన్ల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్నూల్‌లో తయారైన డ్రోన్లు ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించామని, వాటి పనితీరు భేష్ అని సాక్షాత్తు ప్రధాని మోడీ మెచ్చుకున్న విషయం ఈ సందర్భంగా గుర్తుచేశారు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్బన్ ప్రాంతాల్లో 50 వేల ఇళ్లను ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందని, మరిన్ని దరఖాస్తులు వస్తే ఇంకా మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గృహాలు లేనివారు నవంబర్ 5 లోపు అర్బన్ హౌసింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పార్థసారథి కోరారు.



# కోనలో వైభవంగా లక్ష్మీనరసింహుని స్వర్ణ గరుడోత్సవ సేవ

రాపూరు (నెల్లూరు), అక్టోబరు 22 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి బుధవారం స్వర్ణ గరుడోత్స వ సేవ నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, చందనాలంకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి శాంతి హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అత్యంత ప్రీతిప్రాతమైన స్వర్ణ గరుడ వాహనం పై స్వామివారిని వుంచి స్వామివారికి క్షేత్రోత్స వం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, గిరిజన వాయిద్యాల మధ్య నిర్వహించిన స్వామివారి స్వర్ణ గరుడవాహన క్షేత్రోత్స వంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు భోజన, వసతి ఏర్పాట్లును ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులున్నారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.



శ్రీమల్లేశ్వరస్వామికి సహస్ర లింగార్చన ప్రత్యేక పూజలు

## కార్తీకమాస పూజలు షురూ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. బుధవారం ప్రారంభమైన ఈ సేవలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు.

### దుర్గమ్మ గుడిలో మరిన్ని సౌకర్యాలు

శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పెరిగిన భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన చేయాలని ఇఓ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో వున్న అన్ని ప్రధాన పనులపై నివేదికను దేవదాయ శాఖ కమీషనర్‌కు అందించాలన్నారు. కాంట్రాక్టర్లను సంప్రదించి ఎప్పటికి పనులు పూర్తవుతాయనే నివేదికను సిద్ధం చేయాలని, త్వరలో జరగబోయే సమీక్షలో దేవదాయ శాఖ మంత్రికి వివరాలు తెలపాలన్నారు.



శృంగేరి పీఠం ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతి స్వామిని ఆశీస్సులు తీసుకుంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

# నిరక్ష్యానికి చోటు లేదు

● వసతిగృహాలలో పిల్లల భద్రతపై జిల్లా కలెక్టర్ హెచ్చరిక ● విచారణలో నిరక్ష్యం.. హాస్టల్ సంక్షేమ అధికారి ఉమాదేవి సస్పెన్షన్

ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 22 ప్రభాతవార్త: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో పిల్లల సంరక్షణ, భద్రత విషయంలో పూర్తి అప్రమత్తత పాటించాలంటూ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల నగరంలోని ఒక వసతి గృహంలో చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో సమగ్ర విచారణ చేపట్టగా, విచారణలో హాస్టల్ సంక్షేమ అధికారి ఉమా దేవి విధుల్లో నిరక్ష ్యం ప్రదర్శించినట్లు నిర్ధారణ కావడంతో, ఆమెను తక్షణం విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ వసతి గృహాల పిల్లల భద్రత, రక్షణ



అంశాల్లో ఎవరైనా నిరక్ష ్యంగా వ్యవహరించినా, కఠినచర్యలు తప్పవు అని హెచ్చరించారు. ప్రతి వసతి గృహ వార్డెన్ తమ పరిధిలోని పిల్లల సంరక్షణలో సంపూర్ణ బాధ్యత వహించాలని, అప్రమత్తతతో వ్యవహరించాలని, భద్రత పరమైన చర్యలు పాటించాలి," అని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వసతి గృహాల నుండి పిల్లలను పంపించే ముందు, వారి బంధువుల వివరాలు, గుర్తింపు ఆధారాలు పూర్తిగా నమోదు చేయడం తప్పనిసరి అని ఆమె స్పష్టం చేశారు. భద్రతా చర్యలు పాటించడంలో ఏ చిన్న లోపమూ చోటు చేసుకోరాదని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని సంబంధిత అధికారులు, సిబ్బంది ఈ సూచనలను కచ్చితంగా అమలు చేయాలని, వసతి గృహాల్లో పిల్లల భద్రతకు సంబంధించి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు.

## హెచ్ఎంగా ఎస్జీటీ, వార్డెన్‌గా వాచ్‌మెన్

సిర్పూర్ ఆశ్రమ పాఠశాలలో అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ




సిర్పూర్(టీ),అక్టోబరు 22, ప్రభాతవార్త: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీజీహెచ్ఎం మంజూరు ఉన్నచోట హైస్కూల్‌లో ఒక ఎస్జీటీకి ఇన్చార్జి హెడ్ మాస్టర్‌గా ఫుల్ అడిషనల్ చార్జ్‌గా బాధ్యతలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బాధ్యతలు ఇచ్చారు. ఇదిలా ఉంటే వార్డెన్ మంజూరు ఉన్న పోస్టులో వాచ్ మెన్‌ను ఇన్చార్జి డిప్యూటీ వార్డెన్‌గా బాధ్యతలను అప్పజెప్పారు. గిరిజన విద్యార్థుల పట్ల, గిరిజన విద్యా పట్ల అధికారులకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. నిబంధ నలకు విరుద్ధంగా వీరిని నియమించడం ఎంతవరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 260 మంది గిరిజన విద్యార్థినులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లుగా ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉండగా ఒక ఎస్జీటీకి హెచ్ఎంగా బాధ్యతలు అప్పజెప్పడం ఎంతవరకు సమంజమని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై జిల్లా గిరిజన అధికారిని ప్రభాత వార్త వివరణ కోరగా ఇది మాకేం కొత్త కాదు, కొన్నిచోట్ల ఎస్జీటీని హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా నియమించిన దాఖలాలు ఉన్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఎవరు ముందుకు రాకపోతే ఎస్జిటికీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. త్వరలోనే హెడ్ మాస్టర్‌ను నియమిస్తామని చెప్పుకొచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన హెడ్‌మాస్టర్ డిప్యుటేషన్‌పై తిర్యానికి పంపించడం జరిగిం దన్నారు. ఇకనైనా రెగ్యులర్ అర్హత కలిగిన హెడ్ మాస్టర్‌ను, వార్డెన్‌ను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ముక్త్యాల పంచాయితీ నిధుల దుర్వినియోగంపై మండలాభివృద్ధి కార్యాలయంలో ప్రశ్నిస్తున్న గ్రామ యువత

## నిధుల దుర్వినియోగంపై నివేదిక ఏదీ?

ఎంపిడిఓని నిలదీసిన ముక్త్యాల యువత

జగ్గయ్యపేట, అక్టోబరు 22 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల (ముక్తేశ్వరపురం) గ్రామ పంచాయితీలో భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం, అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని పలు ఆధారాలతో గ్రామ యువత, ప్రజానీకం ప్రభుత్వానికి ఫిర్యాదుచేసినా స్పందన లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధుల సద్వినియోగంలో గ్రామ కార్యదర్శి, సర్పంచ్ బాధ్యత వహించాల్సి ఉంది. అయితే దాదాపు రూ.1.50 కోట్లకు పైబడిన నిధుల దుర్వినియోగం జరిగినట్లు సమాచారం. దీంతో జులై 14న డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్‌కు గ్రామ యువకులు ఫిర్యాదుచేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఆగస్టు 13న విచారణ జరిపారు. అనంతరం 30 రోజుల్లో ఫిర్యాదుదారులకు విచారణ నివేదిక వివరాలు అందజేస్తామని జగ్గయ్యపేట ఉప మండల పరిషత్ అధికారి పద్మావతి హామీ ఇచ్చినట్లు యువకులు మీడియాకు తెలిపారు. ఇప్పటికి 70 రోజులవుతున్నా తుది నివేదిక ఇవ్వకుండా కాలయాపన చేస్తూ అవినీతి చేసిన వారికి సహకరిస్తున్నారంటూ యువకులు ధ్వజమెత్తారు. బుధవారంతో అధికారి ఇచ్చిన గడువు పూర్తికాగా నివేదిక ఇవ్వాలని తాము కోరగా ఉప మండల పరిషత్ అధికారిణి ఈనెల 30వ తేదీన ఇస్తానంటూ మరో వారం రోజుల గడువు పెంచారని ఫిర్యాదిదారు నాగుల్‌మీరా తెలిపారు. 30వ తేదీకైనా నివేదిక ఇవ్వకుంటే తాము గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అవినీతి చేసిన సొమ్ము అంతా పంచాయితీ ఖజానాలోకి చేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కాగా ఈ కార్యక్రమంలో నాగుల్‌మీరాతోపాటు షేక్ అక్బర్, షేక్ షకీల్, షేక్ అల్లాభక్షు, దస్తగిరి, గోపి, సిలార్, షఫీ, లాలు కూడా పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మరో సైబర్ మోసం
### 70 యేళ్ల వృద్ధుడికి రూ.93 లక్షలు టోకరా

హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త: సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని పోలీసులు పదే పదే చెబుతున్నా నిత్యం ఈ తరహా మోసాలు జరుగుతూనే వున్నాయి. ట్రేడింగ్ పేరిట 70 ఏళ్ల వృద్ధుడికి సైబర్ నేరగాళ్లు ఏకంగా 70లక్షల రూపాయల టోకరా వేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగు చూసింది. గత జూలై 17న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్టా క్ మార్కెట్లో పెట్టుబడుల పేరుతో వాట్సాప్‌లో వచ్చిన సమాచారంతో మేడ్చల్‌కు చెందిన ఓ వృద్ధుడు స్పందించాడు. మొదట రాజ్‌కుమార్ పేరిట ఒ క నేరగాడు ఆ తరువాత నిఖిత పేరిట ఇంకో నేరగత్తె తనతో మాట్లాడి పలుమార్లు 93 లక్షల ఏడువేల రూపాయలను కాజేశారని బాధితుడు పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 17వ తేదీన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబ ట్టారు. ఈ కేసులో నగదు బదిలీపలు ఖాతాల నుంచి జరిగినట్లు పోలీసులు గుర్తించారు. అసలు నేరగాళ్లు విదేశాల్లో వుండి వుంటారని భావిస్తున్నారు.

## గంజాయి స్మగ్లర్లపై ఈగల్ దాడి
### 300 కిలోమీటర్లకు పైగా ఛేజింగ్

తెలంగాణ నుంచి ఝార్ఖండ్ వరకు వెంటాడి పట్టివేత



ఈగల్ పోలీసులకు పట్టుబడ్డ గంజాయి స్మగ్లర్లు. వారి వద్ద లభ్యమైన గంజాయి

హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త: రాష్ట్రంలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్న ఈగల్ (పూర్వపు టి.నాబ్) మరోసారి భారీ ఆపరేషన్ చేబట్టింది. ఈ సందర్భంగా 500 కిలోల గంజాయితో పాటు ముగ్గురు అంతరాష్ట్ర నేరగాళ్లను పట్టుబడ్డారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డిజి సందీప్ శాండిల్యా బుధవారం మీడియాకు వెల్లడించారు. ఒడిషా నుంచి తెలంగాణ మీదుగా యుపిలోని వారణాసికి 500 కిలోల గంజాయిని ట్రక్కులో తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు మొదట ఖమ్మం సరిహద్దుల్లో నిఘా వుంచారు. ఈగల్ పోలీసులతో పాటు ఖ మ్మం పోలీసులు కూడా వున్నారు. పోలీసులు తమ ను గమనిస్తున్నారని అనుమానించిన గంజాయి స్మగ్లర్లు తమ వాహనాన్ని దారి మళ్లించి ఛత్తీస్ ఘడ్ నుంచి ఝార్కండ్ వైపు మళ్లించారు. దీనిపై సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు ఈ విషయాన్ని ఛత్తీస్‌ఘడ్‌తో పాటు ఝార్కండ్ పో లీసులకు సమాచారంఅందించి స్మగ్లర్లను పట్టుకోవాలని కోరారు. మంగళవారం రాత్రి ఖమ్మం సరిహద్దుల నుంచి ఛత్తీస్‌ఘడ్ మీదుగా ఝార్కండ్‌కు 300 కిలోమీటర్లకు పైగా స్మగ్లర్ల వాహనాన్ని వెంబ డించిన ఈగల్ పోలీసులు నేరగాళ్లను రాంచి సమీపంలో పట్టుకున్నారు. ఈ సందర్భంగా 500 కిలోలతో వెళుతున్న గంజాయివాహనంతోపాటు స్మగ్లర్‌గా వుంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్న హరియాణాకు చెందిన నసీం ఖుద్ముద్దీన్‌ను, అతని వద్ద గంజాయి కొనేందుకు రాంచి వద్దకు వచ్చిన హరి యాణాకు చెందిన ముస్తాక్ ఖాన్, ఆరిఫ్‌లను అరెస్టు చేశారు. వీరిద్దరు కొంతకాలంగా వారణాసిలో వుంటున్నారు. కాగా గం జాయితోపాటు డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా వెంటనే 8712671111కు ఫోన్ చేయాలని ఈగల్ డిజి సందీప్ శాండిల్యా కోరారు.

# పండుగులకు 12వేల ప్రత్యేక రైళ్లు

జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 22 ప్రభాతవార్త : పండుగల వేళ స్పెషల్ ట్రైన్స్ దసరా, దీపావళి, ఛట్ పూజ పండగల సందర్భంగా రైల్వేల్లో రద్దీ సహజంగానే పెరుగుతోందని ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైలు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా 12,011 ప్రత్యేక రైళ్లను నడిపి స్తోందని దక్షిణ మధ్య రైల్వే సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రద్దీని తట్టుకునేందుకు ప్రత్యేక రైళ్లన్నీ 21 సెప్టెంబర్, 2025 నుంచి 30 నవం బర్, 2025 వరకూ నడుస్తాయన్నారు. ఇందులో దక్షిణ మధ్య రైల్వే 973 ప్రత్యేక రైళ్లను నడిప స్తోందన్నారు. 21 సెప్టెంబర్ నుంచి 30 నవం బర్ మధ్యన వివిధ జోన్లకు సంబంధించిన స్పెషల్ ట్రైన్స్ తో కలిపి మొత్తం 2,285 రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణిస్తున్నా యన్నారు. గతేడాది ప్రయాణించిన 1,924 రైళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం 19 శాతం ఎక్కు వగా ప్రత్యేక రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయని తెలిపారు. ఈ రైళ్లన్నీ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే తెలం గాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తర ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజ రాత్ తదితర రాష్ట్రాల మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయని చెప్పారు. 21 సెప్టెంబర్, 20 అక్టోబర్ మధ్య నెల రోజుల సమయంలో దక్షిణ మధ్య రైల్వే పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని నడిపిన అదనపు రైళ్లతో కలిపి మొత్తం 1,010 ప్రత్యేక రైళ్లను నడిపిందిని చెప్పారు. ఇందులో 399 రైళ్లను జోన్ పరిధిలో నడపగా, 611 రైళ్లను ఇతర జోన్లకు నడిపింది. ఇవి గతేడాది ఇదే సమయంలో నడిపిన 684ప్రత్యేక రైళ్లతో పోలిస్తే 47 శాతం ఎక్కువ. ఈ సమయంలో ప్రయాణం సాగించిన రోజువారీ రైళ్లతోపాటుగా ఈ స్పెషల్ ట్రైన్స్ సేవలను దాదాపు 5కోట్ల మంది సద్విని యోగం చేసుకున్నారు. గతేడాది ఈ పండుగల సమయంలో 1అక్టోబర్, 2024 నుంచి 31అక్టో బర్, 2024 వరకు దాదాపు 4.5 కోట్లమంది దక్షిణమధ్య రైల్వేస్పెషల్ ట్రైన్స్, రెగ్యులర్ ట్రైన్స్ సేవలను పొందారని వెల్లడించారు.

# నీరజ్‌చోప్రాకు 'లెఫ్టినెంట్ కల్నల్ హోదా'



న్యూఢిల్లీ, అక్టోబరు 22: భారత మేటి జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. జావెలిన్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాకు భారతీయ ఆర్మీలో గౌరవప్ర దమైన లెఫ్టినెంట్ కల్నల్ ర్యాంక్‌ను అందజేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఆయన్ను ఆ ర్యాంక్‌తో సన్మానించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నీరజ్ చోప్రా కుటుంబం కూడా ఈ ఈవెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించింది. పట్టుదలకు, దేశభక్తికి నీరజ్ చోప్రా నిదర్శనమని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం నీరజ్ చోప్రా నియామకం ఏప్రిల్ 16వ తేదీన జరిగింది. జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్‌గా నయిబ్ సుబేదార్ ర్యాంకుతో నీరజ్ చోప్రా 2016 ఆగస్టులో భార తీయ సైన్యంలో చేరారు. నీరజ్ చోప్రాకు గతం లో పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్‌రత్న, అర్జున అవార్డులు దక్కాయి. పరమ విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ కూడా ఆయన గెలుచుకున్నారు. 2020లో టోక్యోలో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకం గెలుచుకుని చరిత్ర సృష్టిం చారు. ఆ తర్వాత 2024 పారిస్ ఒలింపిక్ క్రీడల్లో రజత పతకం సాధించాడు. 2023 వరల్డ్ అథ్లటిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాడు. ఏషియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌తో పాటు డైమండ్ లీగ్‌ల్లోనూ అతను స్వర్ణ పతకాలు గెలుచుకు న్నాడు. నీరజ్ చోప్రా తన జావెలిన్‌ను అత్యుత్త మంగా 90.23 మీటర్ల దూరం విసిరి రికార్డు సృష్టించాడు. నీరజ్ సాధించిన విజయాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కీర్తించారు. రాబోయే తరాలకు ఇన్‌స్పిరేషన్‌గా ఆయన నిలుస్తారన్నారు. పట్టుదలకు, క్రమశిక్షణకు నీరజ్ ఆదర్శ ప్రాయుడన్నారు.

# జీవికా దీదీలకు 30 వేల జీతం

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తాం




కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తాం

ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ హామీ

కూటమిలో ఎలాంటి విభేదాల్లేవని స్పష్టీకరణ

పాట్నా, అక్టోబరు 22:బీహార్‌లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆయా రాజకీయ పార్టీలు హామీల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్ జీవికా సీఎం దీదీలకు నెలకు రూ.30 వేలు జీతంతో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. బుధవారం పాట్నాలో తేజస్వి యాదవ్ మీడియాతో మా ట్లాడుతూ మహాఘట్‌బంధన్ అధికారంలోకి వస్తే జీవికా దీదీ (కమ్యూనిటీ మొబిలైజర్లు)లను పర్మినెంట్ చేస్తామని, జీతాలు పెంచుతూనే ప్రభుత్వ ఉద్యోగి హోదా ఇస్తామని హామీని చ్చారు. ఈ ప్రభుత్వంలో జీవికా దీదీలకు అన్యాయం జరిగిందని అందరికీ తెలుసు. వారి జీతం నెలకు రూ.30 వేలకు పెంచాలని నిర్ణయించాం. ఇది సాధారణ ప్రకటన కాదు, ఇది జీవికా దీదీల డిమాండ్ అని పేర్కొన్నారు. ఇది ప్రజల దీర్ఘకాల డిమాండ్ అని తెలిపారు. జీవికా దీదీలకు అదనపు అలవెన్స్ రెండు వేలతో పాటు ఆ క్యాడర్‌కు రూ.5లక్షల బీమా కల్పించనున్నట్లు చెప్పారు. అంతేగాకుండా రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులందరికీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తామని తేజస్వి ప్రకటించారు. ఎన్నికల అజెండాను ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ వెల్లడించారు. సీట్ల పంపకం విషయంలో మహాఘట్‌బంధన్‌లో ఎటువంటి విబేధాలు లేవని, గురువారం అన్ని సమాధానాలు దొరు కుతాయని తేజస్వి యాదవ్ అన్నారు. ఇప్పటికే నామినేషన్ దాఖలు ప్రక్రియ పూర్తయిందని, అక్టోబర్ 24 నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. "నామినేషన్ దాఖలు ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ప్రచారం కోసం సమయం ఆసన్న మైంది. ఈసారి, బీహార్ ప్రజలు మార్పు కోరు కుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో బీహార్ ప్రజలు విసుగు చెందారు. ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో అవినీతి, నేరాలు పెరిగాయి. నిరుద్యోగం, వలసలతో బిహా రీలు విసుగు చెందారు. ప్రస్తుత ప్రభుత్వం మేం గతంలో ఇచ్చిన హామీలను కాపీ చేస్తోంది" అని తేజస్వి యాదవ్ విరుచుకుపడ్డారు.



## ఆర్థర్ రోడ్డు జైలు.. బ్యారక్ నంబరు 12

మెహుల్ చోక్సీని ఉంచే సెల్, బెల్జియం కోర్టుకు సిబిఐ నివేదిక

ముంబయి, అక్టోబరు 22: పిఎన్‌బి కేసులో రెండో ప్రధాన నిందితుడుగా ఉన్న ఆభరణాల వ్యాపారి మెహుల్‌చోక్సీని భారత్ రప్పించి ఆతడిని ముంబయిలోని ఆర్థర్‌రోడ్డు జైలులో ఉంచాలని భారత ప్రభుత్వం అన్ని ఏర్పాట్లుచేసింది. ఇందుకు సంబంధించి ఆర్థర్‌రోడ్డులో చోక్సిని ఉంచే సెల్ మొత్తం వివరాలు, ఆతనికి కల్పించిన సదుపా యాలతోపాటు జైలులో ఉన్న మౌలికవసతుల న్నింటిపైనీ విడియో, ఫోటో చిత్రాల నివేదికను బెల్జియం కోర్టుకు సిబిఐ ఈడీ అదికారులు అం దచేసారు. ఆర్థర్‌రోడ్డుజైలులోని బ్యారక్‌నంబరు 12ను చోక్సీకోసం కేటాయించినట్లు అధికారులు తెలిపారు. 46 చదరపు మీటర్ల బ్యారక్‌లో రెండు సెల్స్ ఉన్నాయి. వాటిలో ప్రైవేటు టాయిలెట్ సౌకర్యం కూడా ఉంది. ప్రాథమిక వసతలున్నీ ఉన్నాయి. సెల్‌లో టివి సదుపాయం కూడా ఉంది. భారత జైళ్లు పరిమితికిమించిన ఖైదీలతో ఉన్నాయని, భద్రత లేదని చేసిన వాదనను ఖండిస్తూ భారత దర్యాప్తుసంస్థలు ఈ నివేదికను ఇచ్చాయి. అర్థర్‌రోడ్డు జైలులోని బ్యారక్ నంబరు 12 అంటే ముంబయి దాడుల కేసు నిందితుడు అజమ్మల్‌కసబ్ నిందితుడు ఉన్న బ్యారక్ అని కూడా చెప్పాలి. కోర్టు విచారణ, వైద్య సపర్యలకు మినహాయిస్తే చోక్సీ బయటకు వచ్చేందుకు అను మతిలేదు. ఆయన కస్టడీ కూడా జ్యుడిషియల్ పర్యవేక్షణలోనే ఉంటుంది. భారత జైళ్లు అధ్వా న్నంగా ఉంటాయని, న్యాయవ్య వస్థలో స్వయంప్రతిపత్తి స్వతంత్రత లేదని అందువల్ల తమ క్లయింట్‌కు భద్రతలేదని చోక్సీ న్యాయ వాదులు వాదించారు. అయితే కోర్టు వీటన్నింటినీ తిరస్కరించింది.

# సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై పోలీసుల కొరడా

డ్రంకన్ డ్రైవ్ తరహాలో నిందితులను కోర్టులో హాజరు పరచాలని నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త: జంట నగరాలలో ఇకముందు సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని పోలీసులు నిర్ణయిం చారు. ఇప్పటి వరకు జరిమానాలతో సరిపుచ్చు తుండగా ఇక ముందు ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని మద్యం తాగి వాహనాలను నడిపే వారిని కోర్టు లో హాజరు పరుస్తున్నట్లు జరిమానాలతో వదలకుండా నేరుగా కోర్టులో హాజరు పరచాలని ట్రాఫిక్ పోలీసు అధికారులు నిర్ణయించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల జరుగు తున్న ప్రమాదాల నివారణకు ఈ చర్యలు తీసు కుంటున్నట్లు ట్రాఫిక్ పోలీసు అధికారులు చెబు తున్నారు. వారంరోజులుగా సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేబట్టిన ట్రాఫిక్ పోలీసులు ఇందులో భాగంగా నాలుగు వేల వరకు కేసులు నమోదు చేశారు. జంట నగరాలలో ఏటా జరుగు తున్న రోడ్డు ప్రమాదాలలో సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా ఘటనలు పదుల సంఖ్యలో వుండడం తెలిసిందే. దీనివల్ల అనే కసార్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు ప్రమా దాల్లో పడుతున్నారు. ఇందులో కొందరు మరణి స్తుండగా మరికొందరు తీవ్రంగా లేదా స్వల్పంగా గాయపడుతున్నారు. ఇంకొన్నిసార్లు వీరి కారణం గా ఇతరులు ప్రమాదాలలో పడి మరణించడం లేదా గాయపడడం జరుగుతోంది. రవాణాచట్టాల ప్రకారం సెల్‌ఫోన్ డ్రైవింగ్ తీవ్రమైన నేరం. సెల్‌ఫోన్ డ్రైవింగ్ మాత్రమే కాదు, సెల్‌ఫోన్‌లో సిని మాలు, లేదా వార్తలు చూస్తూ, చాటింగ్ చేస్తూ, పాటలు వింటూ వాహనాలు నడిపే వారి సంఖ్య కూడా ఇటీవల కాలంలో భాగా పెరిగింది. వీటివల్ల దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమా దాలు పెరుగుతున్నట్లు రవాణా శాఖ పేర్కొంది. ఈ విషయంలో



కఠిన చట్టాలు వున్నా ఇంతకాలం పెద్దగా అమలుకు నోచుకోలేదు. అయితే ఈ చట్టాలను జంటనగరాలలో తొలిసారిగా కఠినంగా అమలు చేయనున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసుల్లో పట్టుబడ్డ వారిని ఇక ముందు డ్రంకన్ డ్రైవింగ్ కేసుల తరహాలో కోర్టులో హాజరు పరచనున్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిందితుల్లో కొందరికి జైలుశిక్ష పడుతున్న ఉదంతాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దవుతున్న ఘటనలు అనేకం వుండడం తెలిసిందే. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో అనేక మంది నిందితులకు నెలనుంచి మూడునెలల జైలు శిక్షపడిన ఉదంతాలున్నాయి. ఇలా జైలు శిక్షలకు గురై జైలు జీవితం గడిపిన వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను పదేళ్లనుంచిశాశ్వతంగా రద్దు చేయబడ్డాయి. మూడు అంతకు ఎక్కువగా డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలుకూడా కోర్టులు విధించడం గమనార్హం. ఇప్పుడు సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసుల్లో నింది తులకు ఈ తరహాశిక్షలు అమలు చేయాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. మొదట హైదరాబాద్‌లో అమలుచేశాక సైబరాబాద్, రాచకొండలో అమలు చేయాలని భావిస్తున్నారు.

23-10pg10exAKRP 12 VJA_23-10pg10exAKRP.qxd 10/23/2025 12:12 AM Page 1





## ముక్కోణపు మహిళల టోర్నమెంట్‌లో
# భారత్ ఓటమి
### 0-2తో ఇరాన్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ముక్కోణపు మహిళల అంతర్జాతీయ టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లో ఇరాన్ భారత్‌ను అధిగమించింది. భారత మహిళల జట్టు తొలి మ్యాచ్‌లో తడబడటంతో 0-2 తేడాతో ఇరాన్ గెలుపొందింది. మొదటి అర్ధభాగంలో గోల్ లేని తర్వాత సబ్‌స్టిట్యూట్ సారా దిదార్ రెండవ అర్ధభాగంలో రెండుసార్లు గోల్ చేసి విజయాన్ని అందించింది. బ్లూ టైగ్రెస్‌లు దూకుడుగా కనిపించినా ఇబ్బంది పడ్డాయి. ఇరాన్ ప్రారంభం నుండి వేగాన్ని నిర్దేశించుకుంటూ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. నాల్గవ నిమిషంలోనే పాంథోయ్ సాధారణ క్రాస్‌ను తప్పుదారి పట్టించడంతో ఇబ్బంది సంకేతాలు వెలువడ్డాయి. ఫంజౌబమ్ నిర్మలా దేవి చివరి డిచ్ క్లియరెన్స్ కారణంగా ఇరానియన్ గోల్‌ను తృటిలో తప్పించింది. 64వ నిమిషంలో ఇరాన్ పట్టుదల ఫలించింది. జహ్రా ఘన్‌బారి నుండి వచ్చిన హెడర్ క్రాస్‌బార్‌ను తాకిన తర్వాత, సారా దిదార్ రీబౌండ్‌ను సద్వినియోగం చేసుకుని స్కోరింగ్‌ను ప్రారంభించింది. 74వ నిమిషంలో నోంగ్మైథమ్ రతన్‌బాలా దేవి చేసిన డిఫెన్సివ్ తప్పుడు అంచనా తర్వాత ఫార్వర్డ్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. పాంథోయ్‌ను దాటుకుని తక్కువ షాట్‌ను రైఫిల్ చేసి స్కోరును 2-0కి చేర్చింది. 89వ నిమిషంలో లిండా కోమ్ సెర్టో ఫ్రీకిక్ ద్వారా ఇరానియన్ గోల్ కీపర్ రహా యజ్దానీపై ప్రయత్నం చేసినా దాన్ని ఆమె సేవ్ చేయగలిగింది. అయినా ఫాతిమే షాబాన్ ఘోఫ్రూద్ పోస్ట్‌ను బద్దలు కొట్టడంతో ఇరాన్ 3-0తో గెలుపొందింది.



# జింబాబ్వే విజయం
### చిత్తుగా ఓడిన అఫ్ఘానిస్థాన్

**న్యూఢిల్లీ:** స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో పర్యాటక జట్టును చిత్తుగా ఓడించింది. 12 ఏళ్ల తర్వాత జింబాబ్వే గెలిచిన తొలి టెస్టు మ్యాచ్ ఇది. మూడు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో జింబాబ్వే అన్ని విభాగాల్లోనూ సత్తా చాటింది. బ్యాటర్లు ఒకే ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసి సత్తా చాటారు. ఓపెనర్ బెన్ కర్రన్ కెరీర్‌లో తొలి సెంచరీతో కదం తొక్కగా, సికిందర్ రజా అర్ధ సెంచరీతో రాణించాడు. నిక్ వెల్చ్ 49 పరుగులు చేసి అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. పేసర్ బ్రాడ్ ఈవాన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు. ముజరబానీ 3 వికెట్లు, ఈ ఇన్నింగ్స్‌లో మరో 3 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో రిచర్డ్ నగరవ 5 వికెట్లు తీశారు.

ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘన్‌కు ఒకే ఒక సానుకూల అంశం ఉంది. పేసర్ జియా ఉర్ రెహ్మాన్ 7 వికెట్లతో విజృంభించాడు. ఆఫ్ఘన్ స్టార్ బ్యాటర్లు గుర్బాజ్ (37, 9), ఇబ్రహీం జద్రాన్ (19, 42) పెద్దగా రాణించలేకపోయారు. అయినా తొలి ఇన్నింగ్స్‌లో గుర్బాజ్, రెండో ఇన్నింగ్స్‌లో జద్రానే టాప్ స్కోరర్లు కావడం విశేషం. కెప్టెన్ హస్మతుల్లా షాహిది (7, 7) రెండు ఇన్నింగ్స్‌ల్లో నిరాశపరిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో బషీర్ షా (32) ఒక మోస్తరు స్కోర్ చేశాడు. మొత్తంగా ఆఫ్ఘనిస్తాన్ అన్ని విభాగాల్లో దారుణంగా విఫలమై, ఇన్నింగ్స్ పరాజయాన్ని మూటగట్టుకుంది.

### ఫ్రెంచ్ ఓపెన్‌లో..
# లక్ష్యసేన్ ఔట్
### దూసుకువెళ్తున్న రోహన్-రుత్విక



**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్ 2025లో భారత్‌కు చెందిన లక్ష్య సేన్ ముందుగానే ఔటయ్యాడు. ఇక రోహన్-రుత్విక ముందున్నారు. లక్ష్య సేన్ తొలి రౌండ్‌లో ఐర్లాండ్‌కు చెందిన నాట్ న్గుయెన్ చేతిలో ఓడిపోగా, రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని జోడీ ఉక్రెయిన్‌కు చెందిన టిటోవ్-కాంటెమిర్‌ను అధిగమించారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య ప్రారంభంలోనే ఓడిపోగా, మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం రోహన్-రుత్విక ద్వయం మొదటి రౌండ్‌లో అద్భుతమైన విజయాన్ని సాధించారు. పురుషుల సింగిల్స్‌లో, ఈ నెల ప్రారంభంలో హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన ప్రపంచ 16వ ర్యాంకర్ లక్ష్య ఐర్లాండ్‌కు చెందిన ప్రపంచ 29వ ర్యాంకర్ నాట్ న్గుయెన్ చేతిలో 7-21, 16-21 తేడాతో ఓటమి పాలయ్యాడు. పారిస్ హాల్ డ్రిఫ్ట్ కింద భారత షట్లర్ లయ తప్పినట్లు కనిపించి షటిల్‌ను నియంత్రించడంలో ఇబ్బంది పడ్డాడు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రపంచ నం. 32 జోడీ రోహన్-రుత్విక 32 నిమిషాల్లో 21-12, 21-19తో ఉక్రెయిన్‌కు చెందిన 58వ ర్యాంకర్ ఒలెక్సి టిటోవ్-యెవెనియా కాంటెమిర్‌ల జోడీపై విజయం సాధించారు. తొలి గేమ్‌లో త్వరిత ఆటతీరుతో, నిర్ణయాత్మకమైన కోర్ట్ ఆటతో భారత జట్టు ఆధిపత్యం చెలాయించింది. రెండో మ్యాచ్‌లో చివరి ఒత్తిడిని తట్టుకుని మ్యాచ్‌ను ముగించింది. ఈ విజయంతో, వారు రౌండ్ ఆఫ్ 16కి చేరుకున్నారు. అక్కడ వారు ఫ్రాన్స్‌కు చెందిన 5వ సీడ్ థామ్ గిక్వెల్ మరియు డెల్ఫిన్ డెల్రూలాలను ఎదుర్కొంటారు. లక్ష్య జట్టు ముందుగానే నిష్క్రమించడంతో, ఇప్పుడు అందరి దృష్టి సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి, అన్మోల్ ఖర్బ్ మరియు ఆయుష్ శెట్టి వంటి ఇతర భారతీయ ఆశావహులపైకి మళ్లింది,



# నేడు భారత్ కీలక పోరు



### ఆస్ట్రేలియాతో రెండో వన్డే
### ఇద్దరు స్టార్ ప్లేయర్స్‌పై వేటు



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగే రెండో వన్డే మ్యాచ్‌కు టీమిండియా సిద్ధమైంది. ఈ రెండు జట్ల మధ్య ఈ నెల23న ఆడిలైట్ వేదికగా పోరు జరగనుంది. పెర్త్‌లో జరిగిన తొలివన్డేలో వర్షంకారణంగా అంతరాయం కలిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో అడిలైడ్‌లో టీమిండియా గెలవడం చాలా ముఖ్యం. ఇందులో ఓటమి చెందినట్లయితే భారత్ సిరీస్‌ను కోల్పోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే బిసిసిఐ సెలక్టర్లు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్లేయింగ్ లెవన్‌లో పలు మార్పులు చేశారు. తొలి వన్డేలో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు ఓపెనింగ్ జోడీ శుభ్‌మాన్‌గిల్, రోహిత్ శర్మ కూడా మార్పులకు లోనయ్యే అవకాశం ఉంది. తొలి వన్డేలో రోహిత్ లేదా గిల్ ఇద్దరూ పరుగులు చేయడంలో ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు, ఒత్తిడి రోహిత్‌పై ఉంది. రోహిత్‌ను జట్టు నుంచి తప్పించి అడిలైడ్‌లో జరిగే రెండో వన్డేకు యశస్వి జైస్వాల్‌ను ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. యశస్వి ప్రస్తుతం తన అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ఇటువంటి పరిస్థితిలో రోహిత్‌ను తప్పించి, జైస్వాల్, గిల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం ద్వారా పెద్ద రిస్క్ తీసుకోనుంది. ఇక పెర్త్ వన్డేలో భారత్ ఓడిపోయినప్పుడు తలెత్తిన అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే కుల్దీప్ యాదవ్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎందుకు చేర్చలేదు. టీమిండియా ఒక స్పెషలిస్ట్ బౌలర్‌కు బదులుగా ముగ్గురు ఆల్ రౌండర్లను ఎందుకు రంగంలోకి దించింది? కుల్దీప్‌ను ఎందుకు విశ్వసించలేదు? అనే ప్రశ్నలు తలెత్తాయి. అయితే కుల్దీప్ గురువారం జరిగే మ్యాచ్‌లో కూడా ఆడటం లేదని తెలుస్తోంది. అడిలైడ్ ఓవల్‌లో ఫాస్ట్ బౌలర్లు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. దీంతో కుల్దీప్ మైదానంలోకి దిగడం కష్టమైంది. కుల్దీప్ మాత్రమే కాదు, మహమ్మద్ సిరాజ్ కూడా అడిలైడ్‌లో ప్రాక్టీస్ చేయలేదు. అందువల్ల, రెండవ వన్డేకు అతనికి విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. దీని వలన ప్రసిద్ధ్ కృష్ణకు అవకాశం లభిస్తుంది. ఈ విధమైన మార్పులతో ఆస్ట్రేలియాతో జరిగే రెండో టెస్టులో భారత్ సిరీస్‌ను నిలుపుకోవచ్చని సెలక్టర్ల కమిటీ భావిస్తోంది.



ఆట

# టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నం.1 బుమ్రా
### 17వ స్థానంలోకి సిరాజ్

**న్యూఢిల్లీ:** ఐసిసి పురుషుల టెస్ట్ బౌలర్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో బుమ్రా అగ్రస్థానంలో ఉన్న ఆధిక్యాన్ని పాకిస్తాన్‌కు చెందిన నోమన్ అలీ కేవలం 29 పాయింట్లకు తగ్గించాడు. దక్షిణాఫ్రికాపై పాకిస్తాన్ 93 రన్స్ తేడాతో విజయం సాధించిన మ్యాచ్‌లో నోమన్ 10 వికెట్లు తీయడంతో అతను 4 స్థానాలు ఎగబాకి మొత్తం 853 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానానికి చేరుకున్నాడు. ఈ మేరకు బుధవారం పురుషుల ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. అలాగే భారత జట్టుకు చెందిన మరో ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ వన్డే ర్యాంకింగ్స్‌లో బలమైన పునరాగమనం చేశాడు. ఇటీవల ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో అద్భుతమైన ప్రదర్శన చేయడంతో ఏడాది తర్వాత తొలిసారిగా ర్యాంకింగ్స్‌లో 17వ స్థానంలో తిరిగి అడుగుపెట్టాడు. దక్షిణాఫ్రికా, పాకిస్తాన్ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన తర్వాత అతని సహచరుడు షాహీన్ అఫ్రిది కూడా 3 మెట్లు ఎగబాకి 19వ స్థానానికి చేరుకున్నాడు. పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్లలో, మహ్మద్ రిజ్వాన్ 4 స్థానాలు ఎగబాకి 16కు, బాబర్ ఆజం 2 స్థానాలు ఎగబాకి 22కు, సల్మాన్ ఆఘా 8 స్థానాలు ఎగబాకి 30వ స్థానానికి చేరుకున్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆదిల్ రషీద్ మూడు స్థానాలు ఎగబాకి మూడవ స్థానాన్ని దక్కించుకున్నాడు. వన్డే బౌలర్లలో పేసర్లు జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్ కూడా మంచి ఫలితాలను సాధించారు. వరుసగా 10వ, 21వ స్థానాలకు ఎగబాకారు. వెస్టిండీస్‌పై స్థిరమైన ప్రదర్శన తర్వాత బంగ్లాదేశ్ స్పిన్నర్ మెహిదీ హసన్ మీరాజ్ ఆరు స్థానాలు ఎగబాకి 18వ స్థానానికి చేరుకున్నారు.

వాణిజ్యం

# ఐటి రంగానికి కొత్త ఊపు



### పెరుగుతున్న నియామకాలు!
### తొలి ఆరునెలల్లోనే 27 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** భారత ఐటీ రంగానికి క్రమేపీ కొత్త ఊపు వచ్చింది. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఫ్రెషర్లకు ఇది నిజంగా మంచి పరిణామమే. ప్రాజెక్టులు పుంజుకోవడంతో కంపెనీలు మళ్లీ నియామకాల బాట పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి ఆరు నెలల్లో నియామకాలు ఏకంగా 27 శాతం పెరిగాయని మానవ వనరుల సేవల సంస్థ 'అడెకో ఇండియా' తన నివేదికలో వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి అర్ధభాగంతో పోలిస్తే ఈసారి నియామకాలు గణనీయంగా పెరిగాయి.

ముఖ్యంగా ఫ్రెషర్ల నియామకాలపై కంపెనీలు దృష్టి సారించడం సానుకూల పరిణామం. ఫ్రెషర్ల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెరిగాయి. అయితే, కంపెనీలు తమ నియామక వ్యూహాన్ని మార్చుకున్నాయి. కేవలం పేరున్న ఇంజనీరింగ్, టెక్నికల్ కళాశాలలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి అధునాతన నైపుణ్యాలు ఉన్నవారికే అవకాశాలు కల్పిస్తున్నాయి.

గతంలో మాదిరిగా ఆఫర్ లెటర్ ఇచ్చి శిక్షణ ఇవ్వడం కాకుండా, అవసరమైన నైపుణ్యాలపై కాలేజీల్లోనే శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయని అడెకో ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప వివరించారు. నియామకాలతో పాటు ఉద్యోగుల జీతాల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఐటీ ఉద్యోగుల జీతాలు సగటున 5 శాతం పెరిగాయి.


మరోవైపు, ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ప్రత్యేక విభాగాల్లో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది.

ఈ రంగాల్లో 45 నుంచి 50 శాతం వరకు నైపుణ్యం ఉన్నవారి కొరత ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతంలో బెంగళూరు, హైదరాబాద్, పుణె వంటి పెద్ద నగరాలకే పరిమితమైన ఐటీ కంపెనీలు ఇప్పుడు విశాఖపట్నం, ఇండోర్, కోయంబత్తూర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలపైనా దృష్టి సారిస్తున్నాయి.

ఈ నగరాల్లో నియామకాలు 7 శాతం పెరిగాయి. అయినప్పటికీ, ఇప్పటికీ ప్రధాన నియామకాలు పెద్ద నగరాల్లోనే జరుగుతున్నాయి. సుమారు 50 ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు అడెకో ఇండియా తెలిపింది.

### చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు
# ఎలాంటి అడ్డంకుల్లేవ్!
### స్పష్టంచేసిన బెల్జియం కోర్టు

**బ్రస్సెల్స్, అక్టోబరు 22:** పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీని భారత్‌ను తీసుకువచ్చేందుకు మార్గం సుగమమైంది. చోక్సీని భారత్‌కు అప్పగించే విషయంలో బెల్జియం కోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, బెల్జియన్ చట్టాల ప్రకారం చోక్సీని భారత్‌కు అప్పగించడంలో ఎలాంటి అడ్డంకులు లేవని స్పష్టం చేసింది. బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లోని ఒక కోర్టు తన తీర్పులో చోక్సీ నేరాలు భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 120బి, 201, 409, 420, 477తి కింద చట్టం ప్రకారం శిక్షార్హమైనవని తెలిపింది. చోక్సీపై మోసం, దుర్వినియోగం, ఫోర్జరీ అభియోగాలు బెల్జియన్ చట్టం ప్రకారం కూడా శిక్షార్హమైనవని కోర్టు స్పష్టం చేసింది. ఛోక్సీ బెల్జియం పౌరుడు కాదని గుర్తుచేసింది. నేరాలు 2016 డిసెంబర్ 31 ఒకటి జనవరి 2019 మధ్య భారత్‌లో జరిగాయని, బెల్జియన్ చట్టం ప్రకారం ప్రాసిక్యూషన్ కాలపరిమితికి లోబడి ఉండదని తీర్పు స్పష్టం చేసింది. అయితే, భారత్ ఆదేశాలకు తనను ఆంటిగ్వా నుంచి కిడ్నాప్ చేశారంటూ చోక్సీ చేసిన వాదలను కోర్టు తోసిపుచ్చింది. ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవంటూ కొట్టిపడేసింది. చోక్సీ అప్పగింత అనంతరం అతడిని ఉంచే జైలుకు సంబంధించి భారత ప్రభుత్వం అందించిన వివరాలను ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. అంట్వర్ప్‌లోని కోర్టు చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపింది. భారత్‌కు చోక్సీని అప్పగిస్తే ఆయనను ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైలులోని బ్యారక్ నెంబర్ 12లో ఉంచుతామని అధికారులు కోర్టుకు హామీ ఇచ్చారు. బ్యారక్ దాదాపు 46 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుందని రెండు సెల్‌లు, ప్రైవేట్ టాయిలెట్ సౌకర్యాలు ఉన్నాయని, వైద్య సహాయం ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే, తాను అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నానని.. సరైన చికిత్స అందదని చోక్సీ చేసిన వాదనలు కోర్టు తోసిపుచ్చింది.





# రూపాయి క్షీణత కట్టడికి ఆర్బీఐ డాలర్ విక్రయాలు!

**ముంబయి, అక్టోబరు 22:** అంతర్జాతీయ పరిణామాలు, అమెరికా కఠిన నిర్ణయాల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత పడిపోకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారు రూ. 67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయిన సంగతి తెలిసిందే. ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మార్కెట్లో డాలర్లకు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది. అటువంటి సమయంలో ఆర్బీఐ తన విదేశీ మారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దీనివల్ల మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జులై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది. దీంతో ఆర్బీఐ వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. దీని విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ఈ ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.




# సత్యనాదెళ్లకు రూ.800 కోట్ల ప్యాకేజి

**రెడ్మండ్(యుఎస్ఎ), అక్టోబరు 22:** టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వేతనం రికార్డుస్థాయిలో పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయన ఏకంగా 96.5 మిలియన్ డాలర్ల (సుమారు రూ.800 కోట్లకుపైగా) వేతన ప్యాకేజీని అందుకున్నారు. గత దశాబ్ద కాలంలో ఆయన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే అత్యధిక వేతనం కావడం విశేషం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో కంపెనీ సాధించిన అసాధారణ విజయాలకు గుర్తింపుగానే ఆయన జీతాన్ని భారీగా పెంచినట్లు తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం, నాదెళ్ల వేతనంలో అధిక భాగం షేర్ల రూపంలోనే ఉంది. ఆయన ప్రాథమిక వేతనం 2.5 మిలియన్ డాలర్లు కాగా, మిగిలిన 90 శాతం కంపెనీ షేర్ల రూపంలో అందుకోనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆయన 79.1 మిలియన్ డాలర్ల వేతనం అందుకున్నారు. ప్రస్తుతం టెక్నాలజీ ప్రపంచంలో ఏఐ ఒక పెను మార్పునకు కారణమవుతోందని, ఈ కీలక సమయంలో సత్య నాదెళ్ల, ఆయన నాయకత్వ బృందం మైక్రోసాఫ్ట్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపారని కంపెనీ బోర్డు వాటాదారులకు తెలియజేసింది. సత్య నాదెళ్ల నాయకత్వంలో మైక్రోసాఫ్ట్ షేరు విలువ ఈ ఏడాదిలోనే దాదాపు 23 శాతం పెరిగింది. ముఖ్యంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి పోటీదారులను అధిగమిస్తూ కంపెనీకి చెందిన అజూర్ క్లౌడ్ కంప్యూటింగ్ వ్యాపారం నిలకడగా వృద్ధి చెందుతోంది.

ఒకప్పుడు చిన్న స్టార్టప్‌గా ఉన్న ఓపెన్‌ఏఐలో ముందుచూపుతో పెట్టుబడులు పెట్టడం నాదెళ్లకు బాగా కలిసొచ్చింది. చాట్‌జీపీటీ సంచలనం సృష్టించడంతో మైక్రోసాఫ్ట్ ఆ సంస్థలో తన పెట్టుబడులను 10 బిలియన్ డాలర్లకు పైగా పెంచింది. సత్య నాదెళ్ల వ్యూహాత్మక నిర్ణయాల వల్లే మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఏఐ రంగాల్లో అగ్రస్థానానికి చేరింది. లింక్డ్‌ఇన్, గిట్‌హబ్, యాక్టివిజన్ బ్లిజార్డ్ వంటి కీలక సంస్థలను కొనుగోలు చేసి సాఫ్ట్‌వేర్, గేమింగ్, ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ రంగాల్లోనూ కంపెనీని విస్తరించారు.

# పండగ సీజన్‌లో రికార్డు గరిష్టానికి యుపిఐ పేమెంట్స్




**ముంబయి, అక్టోబరు 22:** పండగ సీజన్‌లో డిజిటల్ చెల్లింపులు సరికొత్త గరిష్టాలకు చేరుకున్నాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి ఆల్‌టైమ్ రికార్డులను సృష్టిస్తున్నాయి. దీపావళి కొనుగోళ్ల జోరుతో యూపీఐ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త మైలురాళ్లను అధిగమించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, అక్టోబర్ నెలలో యూపీఐ ద్వారా జరుగుతున్న సగటు రోజువారీ లావాదేవీల విలువ ఏకంగా రూ. 94,000 కోట్లకు చేరింది. సెప్టెంబర్ నెలతో పోలిస్తే ఇది 13 శాతం అధికం కావడం గమనార్హం. గత కొన్నేళ్లుగా నెలవారీగా చూస్తే ఇదే అత్యధిక వృద్ధి అని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఇంకా వారం రోజులు మిగిలి ఉండగానే, యూపీఐ తన జీవితకాలంలోనే అత్యుత్తమ నెలవారీ ప్రదర్శనను నమోదు చేసే దిశగా దూసుకెళ్తోంది. దీనికి దీపావళి పండగతో పాటు ఇటీవల జీఎస్టీ రేట్లలో వచ్చిన మార్పులు కూడా కారణంగా నిలుస్తున్నాయి. ఈ నెల 20న దీపావళి సందర్భంగా చెల్లింపులు భారీగా పెరిగాయి. పండగకు ముందు రోజు యూపీఐలో ఒక్కరోజే 74 కోట్ల లావాదేవీలు జరిగి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించాయి. ఈ నెలలో ఇప్పటివరకు సగటున రోజుకు 69.5 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లోని 65.4 కోట్ల రికార్డును ఇది అధిగమించింది. సాధారణంగా నెల ఆరంభంలో జీతాలు, ఈఎంఐ చెల్లింపుల కారణంగా లావాదేవీలు ఎక్కువగా ఉండి, నెల మధ్యకు వచ్చేసరికి తగ్గుముఖం పడతాయి. కానీ, ఈసారి పండగ ప్రభావంతో ఆ ధోరణి మారింది. ఈ నెల 20 నాటికే, రోజువారీ లావాదేవీల విలువ ఆరుసార్లు లక్ష కోట్ల రూపాయల మార్కును దాటింది. సెప్టెంబర్‌లో ఈ ఘనత కేవలం మూడుసార్లే నమోదైంది. ఈ దూకుడు చూస్తుంటే, ఈ నెలలో మొత్తం లావాదేవీల విలువ తొలిసారిగా రూ. 28 లక్షల కోట్లు దాటుతుందని, గత రికార్డయిన రూ. 25 లక్షల కోట్ల మార్కును అధిగమిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14